॥గుహ్యకాల్యాః సుధాధారాస్తవః॥

॥మహాకాల ఉవాచ॥

అచిన్త్యామితాకార శక్తి స్వరూపా
ప్రతివ్యక్త్యధిష్ఠాన సత్త్వైకమూర్తిః।
నిరాకార నిర్ద్వన్ద్వ బోధైకగమ్యా
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౧

భావము... హే గుహ్యేశ్వరీ! నీయొక్క పరిమితి లేని పరిమాణ శక్తి స్వరూపాలు ఊహాతీతము. ప్రతి జీవియందు సత్ (ఆత్మ) స్వరూపముగా ఉన్నదానవు. నిరాకారము నిర్ద్వంద్వము అయిన నీ నిజస్వరూపాన్ని జ్ఞానముద్వారా మాత్రమే తెలియగలము. నీవు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్యా:

ఈ స్తవము ఆదినాథుడు రచించిన మహాకాల సంహిత లోనిది. సంహిత అని చెప్పేరు అంటే ఇది వైదికమార్గ గ్రన్థము అనుకునేరు. కాదు, ఇది పూర్తి కౌలమార్గ అనుయాయి. ఈ శ్లోకం భుజఙ్గప్రయాత వృత్తంలో చెప్పేరు. యగణంతో ప్రారంభం చేసేరు. దీనితో దేవతా లక్షణాన్ని ఈ దేవతోపాసకుడికి ఉండవలసిన లక్షణాలను చెప్తున్నారు. **యగణము** తెల్లని రంగు. బ్రాహ్మణ వర్ణము. సత్త్వగుణం. వృత్తమును యగణముతో ప్రారంభం చేసి, రెండవ గణముకూడా యగణమునే ఉంచారు. '**యయ**' ఇలా ఉండరాదని లక్షణకారులు చెప్పేరు. దీనిచే ఈ దేవత సత్త్వగుణ విశిష్ట అని ఉపదేశిస్తూనే, తద్భిన్నులు (సత్త్వగుణవిశిష్టులుకానివారు) ఉపాసింపతగదని నిషేధాన్ని విధించేరు. చెప్పబడుతున్నది జ్ఞానసంబంధమైనది. కేవల సత్త్వగుణవిశిష్టులు ఉపాసింప తగిన దేవతగా చెప్తున్నారు. ఈ స్తోత్ర పారాయణ ధనసమృద్ధిని ఇస్తుంది. ఛన్దోలక్షణాతో ఈ విషయాలను సూచన చేస్తున్నారు.

అచిన్త్యామితాకార శక్తిస్వరూపా హే అమ్మా! నీయొక్క పెద్దదైన ఆకారం అంటే బృహద్రూపము. ఎంత పెద్దది అన్నదో ప్రశ్న. పిపీలికాది బ్రహ్మపర్యన్తమైన

పశువర్గము లేదా జీవవర్గముయొక్క ఇన్ద్రియముల సామర్థ్యానుసారము గ్రహింపబడునంతటి పెద్దది.

ఆకార శబ్దప్రయోగం అభిప్రాయ ప్రకటన లక్షణం కలదని చెప్పుటకు.

పరిమితాకారం అంటే జ్ఞానేన్ద్రియ కర్మేన్ద్రియ పఞ్చకముచే గ్రహణయోగ్యమైన స్వరూపము. **'అమితాకారము'** అంటే **"మనో బ్రహ్మేత్యుపాసీతేత్యధ్యాత్మమథాధి దైవతమాకాశో బ్రహ్మేత్యుభయమాదిష్టం భవత్యధ్యాత్మం చాధిదైవతం చ। తదేతచ్చతుష్పాద్బ్రహ్మ॥ వాక్పాదః ప్రాణః పాదశ్చక్షుః పాదశ్శ్రోత్రం పాద ఇత్యధ్యాత్మమ్। అథాధిదైవతమగ్నిః పాదో వాయుః పాద ఆదిత్యః పాదో దిశః పాద ఇత్యుభయమేవాదిష్టం భవత్యధ్యాత్మం చైవాధిదైవతం చ।** (ఛాన్దోగ్య. 3. 18)"

ఇన్ద్రియరాజమైన మనోరూపంగా (అధ్యాత్మోపాసన); ఆకాశరూపంగా (అధిదైవతోపాసన) పరదేవతను ఉపాసించాలి. వాగిన్ద్రియ ఘ్రాణేన్ద్రియ చక్షురిన్ద్రియ శ్రోత్రేన్ద్రియము; అగ్ని వాయు ఆదిత్య దిక్కులు ఈ విధంగా మనోరూపమైన, ఆకాశరూపమైన చతుష్పాద్బ్రహ్మమును దర్శించాలి. మనస్సు, ఆకాశము సూక్ష్మమైనవి. బ్రహ్మను గుర్తించుటకు ఆలంబనమగుచున్నవి. 'అమితాకారము' పరదేవతయొక్క పాదస్వరూపము. అంటే పిపీలికాది బ్రహ్మపర్యన్తమైన ఈ సమస్తము నానావిధ నామరూపములుగా వర్ణనకు అనువుగా ప్రకటన సామర్థ్యము కలదిగా ఉంది. ఇదంతాకూడా జగత్తే. అంటే సాధనసాధ్యరూపంగా అతఃకరణముచే ఉపాసింపదగిన స్వరూపము అని భావము.

అక్షయ్యం హ వై చాతుర్మాస్య యాజినస్సుకృతం భవతి చాతుర్మాస్య యాగము చేయువానికి అక్షయ్య పుణ్యము కలుగును. ఇక్కడ అక్షయ్యం అనునది కర్మ సంబంధి కనుక శాశ్వతమని కాదు. ఇతర కర్మఫలము కన్న మిన్న అనే అభిప్రాయం. అమితాకార అను పదమునందలి 'అమిత' ఆకార సంబంధి అగుటంజేసి ఆకాశ రూపంగా అన్తఃకరణ రూపంగా ఉపాసింపదగిన శ్రేష్ఠమైన (పూర్ణబ్రహ్మ) స్వరూపము.

శక్తిస్వరూపా 'ప్రభావోత్సాహ మన్త్రజాః' అని శక్తి త్రివిధరూపాలలో ఉంది. ధనాదులవలన ఆయుధాదుల వలన వచ్చిన బలము **'ప్రభావశక్తి'.**

అవకాశము ఉన్న ప్రతిచోటుకు వ్యాపించాలనే లక్షణం లేదా చేష్ట '**ఉత్సాహశక్తి**'. సామము, దానము, భేదము, దణ్డము, సన్ధి, విగ్రహము వీటిని అర్హతలు అనుసరించి ప్రయోగించు జ్ఞానము **'మన్త్రశక్తి'.** ఈ త్రివిధ రూపములుగా జీవులయందు త్రిశక్తులగా ప్రకటమగుచున్న జీవులయందలి శక్తి నీయొక్క ప్రకాశమే.

అచిన్త్యా సాధనసాధ్య రూపంగా, శక్తి త్రయాత్మకంగా మరియు ధర్మాధర్మ స్వరూపంగా ఏ ఆకారం అయితే ఉందో, ఆ మహాశక్తి సృష్టి ఆవిర్భావానికి పూర్వం అవ్యాకృతమైన నామరూప వికారశూన్యమై ఉంది. కనుక అచిన్త్యమని చెప్పబడుతోంది.

ప్రతివ్యక్త్యధిష్ఠాన సత్త్వైకమూర్తిః సతో భావః సత్త్వం తత్ జ్ఞానహేతుః అంటే విమర్శశక్తిగా ఉన్నట్టిది. జీవులయందలి బల విశేషానికికూడా సత్త్వమని వ్యవహారము. జీవులయందు బలరూపముగా ఉండునది. **బలవానప్యశక్తోఽసౌ – యో ధర్మ విముఖో జనః** ఎవడు ధర్మమున ప్రవర్తించుట లేదో, వాడు బలవంతుడైననూ శక్తిహీనుడే అనుటచే ఈ బలమునకు లక్ష్యరూపమైనది ధర్మమే. ప్రతి జీవియందు కేవలం జీవధర్మంగా ఉండునది. ఉపాధులయందు ఉపాధిగత ధర్మరూపంగా అధిష్టించినది. అంటే దేవతా ఉపాధులకు శాపానుగ్రహ రూపంగా లోకరక్షణయే ధర్మము. దేవతా ఉపాధులయందలి శాపానుగ్రహరూప శక్తిగా ఉంది. ఉపాధిగ్రహణము చేసిన జీవుల ఉపాధివృద్ధి కొరకైన హింస. ఇది జీవుల సహజ ధర్మము (ప్రకృతి). ఈ ధర్మ స్వరూపంగా లయకారిణిగా ఉన్న శక్తి. ఈ జీవహింస కేవలం ఆహార సముపార్జన కొరకు మాత్రమే అయిన ధర్మము. పరహింసార్థమైన అధర్మము. ఈ అధర్మము తిరిగి మనల్ని (జీవులను) ప్రపంచములోనికి త్రోస్తోంది. అంటే పునః సంసారాన్ని ఇస్తోంది. అదే ధర్మము అయితే చిత్తశుద్ధిని కలిగించి సాధన చతుష్టయ (శమదమాదులు, నిత్యానిత్యవస్తు వివేకం, ఇహాముత్ర ఫల వైరాగ్యం, ముముక్షత్వం) సంపత్తిన్ని కలిగించి మోక్షహేతువు అగుచున్నది. ధర్మాధర్మములుగా జీవులయందు అధిష్ఠించిన శక్తియే నీవు. ఇటువంటి నీవు...

నిరాకార అంటే ఈమెయందు నామము, రూపము, క్రియ అనునవి

లేవు. అజ్ఞానవశమున 'క్రియ, కారకము, ఫలము' అనువాటి రూపముగా ఈ జగత్తు 'ఆత్మ'యందు అధ్యారోపితమగుచున్నది. ఈ విధముగా ఆరోపింపబడి ఈ నిరాకార స్వరూపమే 'కర్తగా, భోక్తగా' భాసిస్తోంది. ఇదే విషయం ఇతఃపూర్వం **ప్రతివ్యక్త్యధిష్ఠాన సత్త్వైకమూర్తిః** అని చెప్పబడింది. నిజానికి ఈ నిరాకార స్వరూపం **"నిర్ద్వన్ద్వా"** అంటే రెండవది లేనిది. **నా న్యోఽతోఽస్తి విజ్ఞాతా** ఈ స్వరూపముకంటే వేరుగా ఇంకో తెలియువాడు లేడు. అమ్మా! నీవు సకల సంసార ధర్మములకు సాక్షివి. నీకంటే అన్యముగా ఇంకొకడు లేడు. అట్టి నీవు **'ఏకా'** క్రియా కారక ఫల రూపముగా విభాగించుకొన్న నీవు ఒకతెవే. ఈమెయే లయకారిణి అయిన కాళి. **సో పునరేకైవ దేవతా భవతి మృత్యుః ఏవ** అని శ్రుతి చెప్తోంది. నీవు సాక్షాత్తు పరబ్రహ్మవు. **ఏషః తే ఆత్మా అన్తర్యామి** అంటే నీవు అవయవ వికారములు లేని మరియు సంసారధర్మములకు అతీతముగా ఉందుదానవు. నీవు అజరము, అమృతము మరియు అభయము. అంటే పుట్టుట, వర్ధిల్లుట, క్షీణించుట అను వికారములు ఇతరములైన కామన, కర్మ, మోహము, క్రోధము మొదలైన కామ్యకర్మ రూపమైన మృత్యురూపములు లేనిదానవు. భావవికారములు లేనిదానవు. అట్టి నీవు పరమాత్మవు పరబ్రహ్మవు అని తెలియబడుచున్నావు.

ఇక్కడనుండి అద్భుతమైన తాత్త్వికతను (non-dualistic metaphysical insight) ప్రతిపాదిస్తూ అద్వైతసిద్ధాన్తఛాయలో, శక్తి (దేవి)ని పరబ్రహ్మతత్త్వముగా వివరించే శాక్త సంప్రదాయాల్లో కనిపించే ఉపాసనా సారాన్ని ఉపదేశిస్తోంది.

అగోత్రాకృతిత్వాత్ అనైకాన్తికత్వాత్
అలక్ష్యాగమత్వాత్ అశేషాకరత్వాత్।
ప్రపఞ్చాలసత్వాత్ అనారమ్భకత్వాత్
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౨

భావము... నీకు గోత్రము లేకుండుటవలన, ఆకృతి లేకుండుటవలన నీ స్వరూపము ఇదీ అని నిశ్చితము కానిదగుటవలన, ప్రమాణములకు అందని దానవు అగుటవలన, నీ ప్రాపఞ్చిక స్వభావం కారణముగాను, జగత్తును బీజరూపమున ధరించిన నీవు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్యా:

అగోత్రాకృతిత్వాత్ గోత్రాకృతి అంటే (మహాకాల స్వరూపమైన) పరమరహస్యమైన కాలము భూతములను పుట్టించుచు భువనముల వ్యాపించి, భూతములకు తండ్రిగా పుత్రుడుగా అగుచున్నాడు. ఈ భూతములనుండి ముందు పుట్టనున్న పదార్థరూపముగా ఉండునది ఈ కాలమే. ఈ వ్యాపకధర్మమే (పితృపుత్రాదుల రూపంగా) గోత్రాకృతి.

గోత్రాకృతి అంటే **'నామ జాత్యాదిభిః భేదైః అష్టధా యా వికల్పితా'** స్త్రీ, పుం. నపుంసక రూపమైన నామజాతి; సకర్మక అకర్మక భావార్థక రూపమైన ఆఖ్యాతజాతి; ఉపసర్గ, నిపాతముల రూపంగా అష్టవిధములుగా వ్యాపించినది; సర్వోత్పాదకుడు, సర్వగతుడు, పితృపుత్రాది రూపమున కనబడునది కాలమే. దీనికంటే ఉత్కృష్టమైన మరో తేజస్సు లేదు. ఈ గుహ్యమైన కాలమే **'స ఏవ సంభువనాన్యాభరత్, స ఏవ సంభువనాని పర్యైత్, పితా సన్నభవత్, పుత్రః ఏషాం తస్మాత్ వై నాన్యత్ పరమస్తి తేజః'** అని కాలసూక్తములో చెప్పబడిన స్వరూపమే. ఈ విధమైన వ్యాప్తి వంశానుక్రమము

అనైకాన్తికత్వాత్ దీనిని తార్కికులు హేత్వాభాస అని చెప్పేరు. సాధ్యాన్ని సాధించగల సామర్థ్య రాహిత్యం. నిశ్చయజ్ఞానానికి కావలసిన అంశాలలో ఏ ఒక్కటి లోపించినా అది హేత్వాభాసమే. 'అనైకాన్తికత్వము' అంటే ఇంకా

నిశ్చితము కానిది. దేనిగురించి అంటే... అమ్మా! నీ పరిపూర్ణతను గురించిన జ్ఞానం పూర్తిగా ఎవరికీ లేదు.

న వేదాధ్యయనై ర్యోగైర్నదానై స్తపనేజ్యయా। రూపం ద్రష్టుమిదం శక్యం కేవలం మత్కృపాం వినా॥ సాఙ్గోపాఙ్గముగా వేదములను అధ్యయనము చేసినను, హఠ, మన్త్ర, లంబికా, రాజయోగాదుల వలన, గొప్పగొప్ప దానములవలన, తీవ్రమైన తపస్సువలన, యజ్ఞయాగములు ఆచరించుటవలన నిన్నుగూర్చి తెలుసుకోలేరు. వీటివేటికీ నీన్నుగూర్చిన పరిపూర్ణ జ్ఞానము లేదు. **స తస్మిన్ ఏవాకాశే స్త్రియ మాజగామ బహుశోభమానా ముమాం హైమవతీం** కేనోపనిషత్తునందలి ఇతివృత్తం ఈ విషయాన్ని చెప్తోంది. అగ్ని వాయు ఇన్ద్రాదులు ఆ స్వరూపాన్ని గ్రహింపలేకపోయేరు. నీ స్వరూపమును గ్రహింప లేకనే అనాదియగు నిన్ను శక్తి మాయ ప్రకృతి అవిద్యా అను పదాలతో పిలుస్తున్నారు. కొందరు నీ స్వరూపాన్ని తపమని జడమని జ్ఞానమని విమర్శయని అంటున్నారు. ఇవ్వన్నీ నీ స్వరూపమునందు అధ్యారోపమును పొందేయి. కనుకనే పరదేవత నా కృపలేక నన్ను తెలుసుకొనుట సాధ్యము కాదని స్పష్టంగా చెప్పింది. **ప్రాదురాసీ న్మహాదేవీ స్వయం బ్రహ్మమయీపురా। రహస్యం శక్తిరూపస్య శక్తి మద్బ్రహ్మణో బహు। శ్రావయిత్వా మహాదేవీ దేవాన్ సాధ్వకృతార్థయత్॥** (శక్తిగీత. 1-4,5) తన స్వరూపముయొక్క పరమ రహస్యములను పరదేవతయే దేవతలకు తెలిపి వారిని కృతార్థులుగా చేసింది.

అలక్ష్యాగమత్వాత్ కేవల లక్షణచే తెలియబడు స్వరూపము కాదు. అమ్మా! కేవల ప్రత్యక్ష ప్రమాణమునకు అందని దానవు. నీ ఆవిర్భావమును గూర్చి ఎంతవాడు తెలిసికొనలేడు. అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనన్దమయ కోశములకు లక్ష్యము కానిది. **సప్త శీర్షణ్యాః ప్రాణాః సూర్యా ఇత్యాచార్యాః** అని శ్రుతి ప్రాణశబ్ద వాచ్యములగు శిరస్సునందు ఉండెడు ఛిద్రములగు కన్నులు రెండు, చెవులు రెండు, నాసిక రెండు, ముఖము అను ఈ ఏడు ఇన్ద్రియములు / భూతములు, వాటి భోగమైన రూపము మొదలగు విషయములను ప్రకాశింపజేయు తేజములు (సూర్యులు) ఏడు, వాటికి లక్ష్యమైన రూపము గన్ధము శబ్దము రసము; వీనిచే జనించు విషయ జ్ఞానమునకు

లక్ష్యము గానిదానవు.

లక్షణచే తెలియ సాధ్యము కానిదానవు.

అశేషాకరత్వాత్ ఏవిధమైన కర్మఫలములు లేకుండగ మిగిలియున్న దానవు. ఇన్ద్రియములు ధర్మము అర్థము అను పురుషార్థములను రెండు హస్తములుగా కలిగి పనిచేస్తాయి. ధర్మస్కన్ధములు మూడు. అవి యజ్ఞము, అధ్యయనము, దానము అనునవి **ప్రథమ స్కన్దము**. ద్వితీయ స్కన్దము తపస్సు. బ్రహ్మచర్యము తృతీయ స్కన్దము.

యజ్ఞము అంటే అగ్నిహోత్ర, దర్శపూర్ణమాసలు మొదలైన వైదిక కర్మలు.

అధ్యయనము అంటే నియమములతో కూడిన వేదాధ్యయనము. వల్లించుట, అర్థవిచారము, జపము, బోధించుట ఇత్యాదులన్ని.

దానము అంటే వేదియందు ఇచ్చేది కాకుండా యథాశక్తి యాచకులకు ఇచ్చు ద్రవ్య విశేషము. ఈ ప్రథమస్కన్ధము గృహస్థుని కొరకు నిర్దేశించేరు.

రెండవది తపస్సు. కృచ్ఛచాన్ద్రాయణాది వ్రతముల రూపంగా వానప్రస్థుని కొరకు.

మూడవదైన బ్రహ్మచర్యము, ఆచార్యుని గృహమందు నివశించు నైష్ఠికబ్రహ్మచారి నిమిత్తమైనది.

ఈ పైనచెప్పిన ధర్మములచే **సర్వే ఏతాః పుణ్యలోకాః భవన్తి** వారందరూ పుణ్య లోకములను పొందెదరు. ఈ కర్మానుష్ఠానమువలన జీవునియందు వాసనలు ఏర్పడి, కర్మఫలము అనుభవించి కర్మఫలము క్షయము కాగానే జీవుడు పునః సంసారంలోకి వస్తున్నాడు. **అశేషాకరత్వాత్** త్రిగుణాత్మక స్వభావంతో జీవులను సంసారచక్రంలో త్రిప్పుచుండు నీవే...

ఆరభ్యకర్మాణి గుణాన్వితాని భవాంశ్చ సర్వాన్ వినియోజయేద్యః। తేషామభావే కృత కర్మ నాశః కర్మ క్షయే యాతి సతత్త్వతోఽన్యః॥ గుణరహిత స్థితిలో పూర్తిగా కర్మఫలములను క్షయమొనర్చి సంసారచక్రాన్ని (జనన మరణము లను) నాశమొనర్చుచున్నావు.

ప్రపఞ్చాలసత్వాత్ ప్రపఞ్చ స్వరూపముగా జగద్రూపముగా ప్రకాశించు చున్న దానవు. **'మాయాన్తు ప్రకృతిం విద్యాత్'** ఏది జగద్రూపముగా ప్రకాశించు

చున్నదో అది 'మాయా'.
ఇన్ద్రియములచే గ్రహింపబడని స్వతస్సిద్ధమైన అనాదియైన ఆత్మ శక్తి **'మాయా'**. ఈ మాయ ఉన్నది కాదు. ఆత్మ తెలియబడిన నశించుచున్నది. కుందేటి కొమ్ములా లేనిది కాదు. ఉండుట లేకుండుట అను విరుద్ధ లక్షణములచేత ఉండి లేనిది అంటావేమో... అదియును కాదు. దానంజేసి మాయ లేనిది, మోక్షపర్యన్తము ఉండునది.
కొందరు ఈ మాయను ప్రకృతి విమర్శ మిథ్య అవిద్యా అని అంటున్నారు. **'తదేతజ్జడమ్'** ఈ మాయను శ్రుతి జడము అని చెప్తోంది.
ప్రాపఞ్చిక స్వభావం కారణంగా ఆ మాయాశక్తి త్రిగుణాత్మకమై నిగూఢముగా ఉన్నది. బ్రహ్మ విష్ణు రుద్రులు క్రమశః ఒక్కొక్కటిగా సత్త్వరజస్తమో గుణములు కలవారు కాగా, గుణత్రయ సామ్యావస్థ రూపిణిగా మాయ ప్రకాశించుచున్నది. నీవు మాయా ప్రకృతి మిథ్య తమస్సు జడము ఇత్యాది నామములచే ప్రకాశింపబడుటచే మాయకు తురీయబ్రహ్మ వ్యవహితావస్థితి శాస్త్రములందు ప్రతిపాదింపబడినది. మాయావిశిష్టమగు ఆ తురీయబ్రహ్మమే నీవైయున్నావు.
తమేకనేమిం త్రివృతం షోడశాన్తం శతార్ధారం వింశతి ప్రత్యరాభిః। అష్టకైః షడ్భిర్విశ్వరూపైక పాశం త్రిమార్గభేదం ద్వినిమిత్తైక మోహమ్॥ ఈ స్వరూపం ఎలా ఉంది అనేది పై కృష్ణయజుర్వేద శ్రుతి వివరిస్తోంది. సకల చరాచరాత్మక ప్రపఞ్చము దేనిచేత కల్పింపబడినదో, అదే, బ్రహ్మమునందు కల్పింబడిన దేవాత్మశక్తి (మాయ). ఇది సర్వసృష్టికి ఆధారము కనుక బ్రహ్మచక్రపు ఇరుసుగా చెప్పబడింది. ఇది త్రివృతం (సత్త్వ రజస్ తమో గుణాత్మకము) **మూడుచుట్లు;** షోడశాన్తము (ఇన్ద్రియదశకము, మనస్సు, పఞ్చభూతములు) **పదహారు కొసలు;** శతార్ధారం **ఏబది ఆకులు** {**అయిదు విపర్యయాలు** (యోగశాస్త్రరీత్యా అవిద్య అస్మిత రాగం ద్వేషం అభినివేశము (మరణభయము) లేదా తమస్సు మోహము మహామోహము తామిస్ర అన్ధతామిస్రములు), **ఇరవైఎనిమిది అశక్తులు** [అజ్ఞానము 1, క్షుధాది షడూర్ములు (క్షుధ తృష్ణ శోక మోహ జనన మరణములు) 6, కామాది అరిషడ్వర్గము 6, దేవతా త్రయం (కాలము సూర్య చన్ద్రులు) 3, కర్మలు (పుణ్య, పాప, నిష్కామ) 3, వచనాదానగమనవిసర్జనానన్దములు 5,

రక్త శ్వేత పీత కృష్ణ వర్ణములు 4]; **తొమ్మిది తుష్టులు** (జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు, కర్మ కర్తృ క్రియలు, భోక్తృ భోగ్య భోగములు) 9; **అష్టమదములు** ధన విద్యా కుల శీల రూప యౌవన రాజ్య తమో(ఆచార) మదములు. ఈమొత్తం కలిపి యాభై ఆకులు}; **ఇరవై ఏదురు ఆకులు** ఇవి పై ఏబది ఆకులను పట్టి ఉంచే చీలలు. ఇవి సప్త ధాతువులు (చర్మము రక్తము మాంసము మేధస్సు శల్యము మజ్జ శుక్లము), భోజనత్రయం (సాత్విక రాజస తామస), ప్రాగాది దశ దిగ్దేవతలు. **త్రిమార్గభేదం** మూడు (కర్మ ఉపాసనా జ్ఞాన) మార్గములు. ఈ సమష్టికి విశ్వమని పేరు. ఇది పాశముచేత బంధింపబడి ఉంది. అంటే రాగముచేత బంధింపబడి ఉంది. మోహముచే రెండవుతున్నది. పుణ్యపాపములు సుఖదుఃఖముల ద్వంద్వముగా అగుచున్నది. ఈ విధంగా ప్రాపఞ్చిక స్వభావం కారణంగా...

అనారమ్భకత్వాత్ సమస్త భూతముల కర్మలన్నియు బీజరూపమున యెచట నుండునో; ఇచ్ఛాజ్ఞాన క్రియలకు ఏది ఆశ్రయమో; ఆ పరమాత్మకు శరీరము లేదు. ఇన్ద్రియములు లేవు. తనతో సమానుడు, తనకన్న గొప్పవాడు లేడు. అతని దేవాత్మశక్తియే (మాయ) నానావిధముల వినబడుచున్నది. ఆ శక్తియే స్వభావసిద్ధంగా అన్ని పదార్థముల నెఱుంగునదియై అన్నింటినీ తన వశమందు ఉంచుకొని పాలించుచున్నది. ఏ మాయచేత జగత్తు కల్పింపబడిందో, ఆ మాయ బ్రహ్మమునందు కల్పింపబడినదిగా అగుటవలన మిథ్యయగుచున్నది. మిథ్యాస్వరూపానికి అధిష్ఠానముయొక్క ఉనికికన్న ప్రత్యేకమైన ఉనికి ఉండదు. కావున బ్రహ్మమందు తోచిన మాయ, మాయచేత కల్పింపబడిన జగత్తు బ్రహ్మమే అగుచున్నది. ఇతరమగు చరాచరాత్మకమగు వస్తువు ఏదియు కొంచమైనియు లేనిదిగా ఉన్నది.

జజ్ఞౌ ద్వావజావీశనీశావజా హ్యేకా భోక్తృభోగ్యార్థయుక్తా।
అనన్తాశ్చాత్మా విశ్వరూపోహ్యకర్తా త్రయం యదావిన్దతే బ్రహ్మమేతత్॥

వ్యక్తావ్యక్త విషయాలు, 'ఈశానీశా' యజమాని (ఈశ్వరుడు) సేవకుడు (జీవుడు), ఇద్దరూ 'అజౌ' జన్మించనట్టివారే. అనుభవించేవాడు, అనుభవించబడేది అనే సంబంధాన్ని కల్పించే ఒకతె, ఈమెకూడా **అజా** అంటే పుట్టనిది.

దానంజేసి ఈ మాయావిశిష్ట బ్రహ్మము అనన్తమైన విశ్వము రూపముగా గలదైనప్పటికీ **'అకర్తా భవతి'** కర్తృత్వభావన లేనిదిగా ఉంది. కావున సృష్ట్యారంభ పరిసమాప్తులు లేనిదిగా ఉంది.

ఇటువంటి నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

అసాధారణత్వాత్ అసమ్బన్ధకత్వాత్
అభిన్నాశయత్వాత్ అనాకారకరత్వాత్।
అవిద్యాత్మకత్వాత్ అనాద్యన్తకత్వాత్
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ 3

భావము – అసాధారణత్వం వలనను, దేనితోను సంబంధము లేనిదానవగుట చేతను, అంతటా ఉందుదానవు (సర్వవ్యాపినివి) అగుటవలనను, ఇదీ నీ ఆకారము అని చెప్పుటకు స్పష్టమైన ఆకృతి లేనిదానవు అగుటచేతను, అవిద్యా స్వరూపిణివి లేదా సమస్త విద్యలకు పరమందున్న దానవు, ఆద్యన్తములు లేనిదానవు అగుటచేతను నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్య:

అసాధారణత్వాత్ ప్రపఞ్చాలసత్వా దనారమ్భకత్వాత్ అగుటవలన అసాధారణయని చెప్పబడుతోంది.

నీ సహజస్థితికి ప్రపఞ్చ రూపప్రకాశము అనారమ్భకత్వము, అసాధారణత్వము అనునవి విశేషవాచకములు. సహజస్థితి ఏది అంటే కాలమే. ఏవిధంగా ఆభరణములు బంగారముయొక్క వికారమో, జగత్తు కాలముయొక్క వికారము. కాలముయొక్క అసాధారణ లక్షణమే జగత్తు. జగత్తు భూత భవిష్యద్వర్తమాన కాలత్రయాత్మకమైన వ్యాపారము కలది. ప్రళయకాలములోకూడా ఇది బీజరూపమున ఉన్నది. జగదుత్పత్తికి, చీకటి వెలుగులకు కాలమే ఆధారము. త్రస లిప్త విలిప్త నిమిషాది పరార్థాంతము జగద్వికారమే. కాలము లెక్కించునదే కాని, లెక్కింపబడేది కాదు.

పుణ్యపాపములు, సుఖదుఃఖములు ఇలా సమస్తమైన ద్వంద్వములు మరియు జరిగినది, జరుగుచున్నది జరగబోవునది అయిన జగత్తు అసద్రూపము. ఈ జగత్తు కాలమునందు సత్తారూపమున ప్రతిష్ఠితమైయున్నది. కాలము **సత్** భావము కలదైనది. ఈ సమస్త ద్వంద్వాత్మకమైన జగత్తు కాలమునందే లయమగుచున్నది. కావున కాలము **'విఘ్నము'** అని చెప్పబడుచున్నది.

త్రిగుణములు శాన్తావస్థయందున్న కాలము స్తంభాది బ్రహ్మపర్యన్తమైన చరాచరాత్మకమైన సమస్త విశ్వము ఈ కాలమునందు ఉద్భవించి అందే లయమగుచుండుటచే ఉత్థానపతనములకు వృద్ధిక్షయములకు అధిష్ఠానముగా అసాధారణమైన కాలమే ఉన్నది.

అసమ్బన్ధకత్వాత్ పృథ్వీ జల అగ్ని వాయు ఆకాశ మనో బుద్ధి అహఙ్కారములను ఈ ఎనిమిది ప్రకృత్యష్టకమను పేర ప్రసిద్ధిగలవి. ఈ ప్రకృతి 'అపర'.

అపర అంటే **'న పరా, నికృష్టా అనర్థకరీ సంసారబన్ధనాత్మికా'** అని ఆచార్య వాణి. పరకానిది లేదా పరకంటె తక్కువది, నికృష్టము, అశుద్ధము, అనర్థ కారకము, సంసారబన్ధనమే దీని లక్షణము. ఈ అపరప్రకృతికన్న విశుద్ధమైన అత్యంత విలక్షణమైన ప్రకృతికలదు. అది క్షేత్రజ్ఞ ప్రకృతి. దేహాది సంఘాతమును సాక్షిగా దర్శించు చైతన్యము. పిపీలికాది బ్రహ్మపర్యన్త జీవలోకమును జీవించునట్లుగా చేయు చైతన్యము.

ఈ ప్రకృతి (క్షేత్రజ్ఞ శక్తి) జగత్తులోనికి ప్రవేశించి జగత్తును ధరించుచున్నది. గుణవికారములైన త్రివిధభావనలచే మోహింపజేయబడుచున్న జగత్తు; గుణాతీతురాలు అవ్యయము అంటే షడ్భావవికార రహితురాలనైన నన్ను గుర్తించలేకున్నది.

జీవబహుత్వ ఈశ్వరబహుత్వ రూపమైన జగత్తు మాయా స్వరూపిణినైన నాచేతనే కల్పింపబడినది.

ఉపాధి భేదాద్భినాహం ఘటాకాశాదయో యథా। ఉచ్చనీచాది వస్తూని భాసయన్ భాస్కరా స్సదా॥ నదుష్యపి తథైవాహం దోషైర్లిప్తా కదాపిన। సూర్యుడు తన ప్రకాశంవలన ఉత్తమాధమ వస్తువులను ప్రకాశింపచేస్తూ వాటి గుణదోషము లతో తను దూషింపబడక సంబంధం లేకుండా ఏవిధంగా ఉంటాడో...

ఆవిధంగానే కాలస్వరూపిణినైన నేను సమస్త విశ్వముతో ఎప్పుడు స్పృశింప బడక దేనితోను సంబంధము లేనిదాననుగా ఉండుటచేతను,

అభిన్నాశయత్వాత్ ఈ జగత్తునకు సృష్టి స్థితి లయకారిణి శివా స్వరూపిణియు; బ్రహ్మ విష్ణు మహేశ్వరులు దేవర్షి పితృ గణము పాదరూపులై

మోయుచున్న దివ్యమంచయందు శయనించునది. అంటే సమస్త దృశ్యాదృశ్య ప్రపఞ్చము ఈమె 'మంచె' అయియున్నది. బ్రహ్మాది పితృగణ పర్యన్తమైన ఈ సమస్త సమూహము విశ్వమునకు సఙ్కేతము. ఇట్టి విశ్వమంతయు పరచుకుని యున్నది. **జగత్స్వదివ్యశక్తి భిశ్చ వేవిషత్యథాఽ ఖిలం** సకలతత్త్వాతీత స్వరూపిణి విశ్వకల్యాణకారిణి అయిన పరదేవత తన దైవీశక్తితో విశ్వమంతటను వ్యాపించియున్నది. సర్వవ్యాపిని అగుటవలన...

అనాకారకత్వాత్ ఇది నీ ఆకారమని చెప్పుటకు స్పష్టమైన ఆకారము లేనిదానవు. కాలమని, విష్ణుమని, మాయ, ప్రకృతి, శక్తి, మిథ్యా అని ఇలా అనేక విధముల శాస్త్ర తన్త్రములందు ప్రకటింపబడుటచే ఇది నీ ఆకారమని చెప్పలేకున్నాము.

ఒకతరి **'విద్యుత్కోటి సమానాభ మరుణం తత్పరం మహః'** కోటి మెఱుపుతీగల కాంతి, గొప్ప అరుణవర్ణము గలదిగా, సావయవిగా చతుర్భుజిగా, అష్టభుజిగా వివిధాయుధ ధారిణిగా సగుణస్వరూపంతో; **'స్వాత్మైవ లలితా'** అని అర్చనకు ఉపాసనకు యోగ్యమైన రూపంతో...

వేరొకతరి '**ఆద్యన్త రహితం తత్తు న హస్తాఙ్ఘ సంయుతమ్। న చ స్త్రీ రూప మథవా న పుంరూపమథోభయమ్'** పైన క్రింద ప్రక్కన పరిమితి లేని వ్యాప్తి, ఆది అన్తము లేనిది, ఇన్ద్రియములు లేదా హస్తాది అవయవములు లేనిది. స్త్రీ పురుష నపుంసక రూపమును కానిదిగా...

'మాయా వా ఏషా నారసింహీ సర్వమిదం సృజతి సర్వమిదం రక్షతి సర్వమిదం సంహరతి తస్మాన్మాయా మేతాం శక్తిం విద్యాద్యఏతాం మాయాం శక్తిం వేద' అని నృసింహోత్తర తాపిని మాయ యన్నను, శక్తియన్నను భేదము లేదని చెప్పింది. దేవ్యాథర్వ శిరస్సు **'సా బ్రవీదహం బ్రహ్మరూపిణీ మత్తః ప్రకృతి పురుషాత్మకం జగత్'** అని నిన్ను ప్రకృతిగా దర్శింపచేసింది.

కాళీతారాది ఉపనిషత్తులు హ్రీఙ్కార రూపిణిగా, ఓంకార రూపిణిగా, సచ్చిదానన్ద బ్రహ్మముగా చెప్తున్నాయి.

ఇదీ నీ ఆకారమని చెప్పుటకు స్పష్టమైన ఆకారము లేనిదానవు.

అవిద్యాత్మకత్వాత్ అవిద్యాస్వరూపిణివి అగుటవలన, మహాద్భుతమైన

ఆశ్చర్యకరమైన అనిర్వచనీయమైన రూపముకలదానవగుట వలన, ఎందుకు ఆశ్చర్యము అంటే ఈ అవిద్య **'సత్'** కాదు **'అసత్'** కాదు. ఉభయాత్మకం అంటే సదసత్ అని చెప్పుటకు లేదు. బ్రహ్మకంటే భిన్నముకాదు, అభిన్నముకాదు భిన్నాభిన్నముకాదు. ఇటువంటి అత్యాశ్చర్య స్వరూపము. అఘటిత ఘటనా పటిమ కలదానవగుటవలన, వేదశాస్త్రోపనిషద ఉపదేశములచే చతుష్ప్రాత్తులకు భిన్నముగా సంస్కరింపబడినా, అజ్ఞనా సజ్ఞమస్రక్చన్దనాది గ్రామ్యభోగములందు ఆసక్తిని కలిగిస్తోంది.

సుఖ చిదఖణ్డ విబోధమద్వితీయం। వియదనలాది వినిర్మితే నియోజ్య। భ్రమయతి భ్రమసాగరే నితాన్తం... అని ఆచార్యస్వామి మాయాపఞ్చకములో అంటారు. అంటే అఖణ్డ అద్వయ సుఖబోధస్వరూపమైన ఆత్మయందు ఆకాశాది పఞ్చభూత నిర్మితమగు ఈ జగత్తు (సంసారం) అనే భ్రమలో పడేసి, నిరంతరం అందులోనే ఆ జనన మరణరూప సంసారంలోనే తిరుగుతూ ఉండేటట్లుగా చేయడంలో సమర్థతగలది ఈ అవిద్య.

అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే అవిద్యవలన మృత్యువును దాటి విద్యవలన అమృతత్త్వాన్ని పొందుతారు. విద్య అంటే దేవతాజ్ఞానము. అంటే (దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవః సనాతనః) అహఙ్కారము ఆదిగా, స్థూలశరీరము అంతముగా గల జగత్తునందున్నప్పటికీ వృద్ధిక్షయములు లేకుండునట్టి జీవుని స్వభావం తెలియుట. అవిద్య అంటే అహఙ్కారము ఆదిగా స్థూలశరీరము అంతముగాగల జగత్తుకుగల వృద్ధిక్షయ ములకు సంబంధించిన జ్ఞానము ఈ జ్ఞానముగలవాడు మృత్యుభయము లేనివాడై అమృతత్త్వాన్ని పొందుతాడు.

అనాద్యన్తకత్వాత్ ఆది అంటే కారణము. ఆది లేనిది అనాది. ఆదికలది తన స్వరూపముచే క్షీణించును. నీవు సాక్షాత్తు పరమాత్మవు. అనాది గనుక నీయందు అవయవములు లేవు. కనుక నీకు అంతము క్షీణించుట లేదు. నీవు ఆద్యన్తములు లేనిదానవగుటవలన సాక్షాత్తు బ్రహ్మమే అయి ఉన్నావు.

యదా నైవ ధాతా న విష్ణుర్న రుద్రో
న కాలో న వా పఞ్చభూతాని చాత్మా।
తదా కారణీభూత సత్త్వైకమూర్తిః
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౪

భావము– ఎప్పుడు బ్రహ్మ విష్ణువు రుద్రుడు కాలము పఞ్చభూతములు మరియు ఆత్మ అంటే శరీరము మనస్సు లేనిదగుచున్నదో, అప్పుడు సర్వమునకు కారణభూతమగు (అందరకు జన్మనిచ్చునదైన) కేవలము నీవు మాత్రమే నిజమునకు ఉన్నదానవగుటచే నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్య:

న ధాతా అంటే ధాత కానిది. ధాతా అంటే పోషణ ధారణలను చేయువాడు. ఈ స్వరూపము ఆదిత్యుడు. స్వయముగా భగవతినుండి జనించిన మయూఖములతో ప్రకాశించువాడు.

ఈ మయూఖములు మూడువందల అరవై సంఖ్యగలవి.

అథాదిత్యః ఉదయన్ ప్రాచీం దిశం ప్రవిశతి తేన ప్రాచ్యాన్ ప్రాణాన్ రశ్మిషు సన్నిధత్తే। యద్దక్షిణాం యత్ప్రతీచీం యదుదీచీం యదధో యదూర్ధ్వం యదన్తరా దిశో యత్సర్వం ప్రకాశయతి తేన సర్వాన్ ప్రాణాన్ రశ్మిషు సన్నిధత్తే॥ తన కిరణములతో దిక్కుల ప్రాణాలను పట్టి నిలుపుతాడు. ఇతడిని విశ్వరూపుడని సర్వజ్ఞుడని సర్వజీవమూలమని సర్వజీవప్రాణభూతుడని, ఉనికిలో నానాత్వం గలవాడని, సహస్రమయూఖములు గలవాడని 'కేన' శ్రుతి చెప్తోంది. ఈ మయూఖములు కాలాత్మకములై మూడువందల అరువది దినములను కల్పించుకొని సంవత్సరరూపమును ధరించియున్నది.

సంవత్సరో వై ప్రజాపతిః ఈ సంవత్సరమే ప్రజాపతి అని శ్రుతి చెప్తోంది. ఇతనికి దేవయానము పితృయానము అని రెండు మార్గములు.

పఞ్చపాదం పితరం ద్వాదశాకృతిం దివ ఆహుః పరే అర్ధే పురీషిణమ్। అథేమే అన్య ఉ పరే విచక్షణం సప్తచక్రే షడర ఆహురర్పిత మితి॥ ఇతనికి అయిదు

పాదములు. పాదములు నిలుచుటకు, గమనానికి ఉపయుక్తమైనవి.
అధస్థ్సితత్వా ద్ధారణాచ్చ పాదాః అని కదా ఇవి పృథ్వి జల అగ్ని వాయు ఆకాశములను భూతపఞ్చకము.
సంవత్సరో వై ప్రజాపతిః మాసో వై ప్రజాపతిః అహోరాత్రో వై ప్రజాపతిః అన్నం వై ప్రజాపతిః తతో హ వై తద్రేతః పాదము అంటే తన గమనమునకు ఉపయుక్తమైనది. సంవత్సరము మాసము దినము (రాత్రి పగలు), అన్నము, రేతస్సు. వీటి సాహాయముతో నిరంతరము చరిస్తూ ఉంటాడు. కనుక ఈ అయిదు పాదములు. పన్రెండు రూపాలు. ఇవి చైత్రాది మాసములు. పై అర్ధ భాగముచేత వర్షములను కురిపించుటచేత తండ్రి. ఆరు ఆకులు అంటే వసంతాది ఋతువులు. ఏడు చక్రాలు అంటే రవి సోమ మఙ్గళాది ఏడు రోజులు లేదా తన ప్రకాశమునందు గోచరించు వర్ణ సప్తకము.
సర్వసృష్టికి అధిపతియైన కార్యకారణ భావగ్రహణ సామర్థ్య ప్రదాతయై కాలరూపంగా సంవత్సరము మాసము దినము అన్నము రేతస్సు అను అయిదు పాదములతో తిరుగుతూ ప్రకాశించువాడు. ఇతడు (ధాతా) వ్యష్టి; (హిరణ్యగర్భుడు) సమష్టి జీవనమునకు మూలము. ఈ స్వరూపము కానిదానవు.

నవిష్ణుః విశ్వమును వ్యాపించినవాడు కనుక విష్ణువు. అంటే భూనభోన్తరాళములను ఆక్రమించినవాడు. కనబడేది వినబడేది అంతా వ్యాపించి యున్నవాడు. విష్ణువు కానిది అంటే **యస్మాద్విష్ట మిదం తస్య శక్త్యామహాత్మనః తస్మాదేవోచ్యతే విష్ణుః విశేర్ధాతోః ప్రవేశనాత్॥** ఈ విశ్వమున క్షేత్రజ్ఞశక్తి ప్రవిష్టమై యున్న కారణంగా ప్రవేశార్థక విశ ధాతువును బట్టి విష్ణుః అని చెప్పబడుతోంది. విశ్వము నిరంతరము విస్తరిస్తూనే ఉంటుంది. ఈ క్షేత్రజ్ఞశక్తి దానియందు ప్రవేశిస్తూ వ్యాపిస్తూనే ఉంటుంది. విష్ణువు కానిది అంటే వ్యాపకత్వం లేనిదానివి. ఎందువలన, తను వ్యాపించవలసినది ఏదీ లేనిది. అంటే సర్వేసర్వత్రా వ్యాపించి తను వ్యాపించుటకు ఏదీ మిగిలియుండని కారణంగా విష్ణువు కానిదిగా ఉంది. అప్పుడు ఈ స్వరూపము స్థాణువు.

న రుద్రః ప్రళయకాలంలో సమస్తమును ఏడ్పించువాడు. జీవులయొక్క

మరణమునుండి జగత్ప్రళయము వరకు.

రుతి అంటే నాదము. దానియందు ద్రవించువాడు. నాదము అంటే వేదరూపమైన శబ్దము. దానిచే ధర్మములను పొందినవాడు, పొందిచువాడు. శబ్దముయొక్క ధర్మము అర్థబోధ. శబ్దార్థమును పొందించువాడు. నాదము అంటే ఓఙ్కారము. ఈ ఓఙ్కారనాదముచే తన స్వరూపమును బోధించువాడు. దానంజేసి వేదనాద ప్రతిపాద్యమైన పరతత్త్వమే రుద్రుడు. రుక్ అంటే తేజస్సు, అదిగలవాడు. రుత్ అంటే దుఃఖం, దుఖకారణములును. **రు ద్దుఃఖం దుఃఖ హేతుర్వా తద్రావయతినః ప్రభుః** అంటే ప్రతిబంధక శక్తి. ఈ ప్రతిబంధక శక్తినుండి భక్తులను రక్షించువాడు రుద్రుడు.

ప్రళయకార్యము లేనిదగుచు రుద్రుడు కాకున్నావు.

న కాలః కల్యతే సంఖ్యానయతే అనేన కాలః లెక్కపెట్టు స్వరూపం. ఏం లెక్కిస్తాడు అంటే ధర్మాధర్మములు ఆయువు. వీటిని లెక్కిస్తాడు. వీటియందు ప్రవర్తించునట్లుగా ప్రేరేపిస్తాడు. అటువంటి కాలస్వరూపము కానిదానవు. నీవు పఞ్చభూతములు స్థూల శరీరము మనస్సు ఇవేమీ కానిదానవు. అంటే కాల విభాగమునకు కారణమగు సూర్యుడు – జగత్ ఆవిర్భావమునకు ముందున్నది.

అంటే సర్వమునకు కారణభూతమగు (అందరకూ జన్మనిచ్చునదైన) కేవలం నీవు మాత్రమే నిజమునకు ఉన్నదానవు అగుటచే నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

న మీమాంసకా నైవ కాణాద తర్కా
న సాంఖ్యా న యోగా న వేదాన్తవేదాః।
న దేవా విదుస్తే నిరాకార భావం
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౫

భావము– అమ్మా! నీ నిరాకార భావమును (రూపాన్ని) మీమాంసకులుగాని, వైశేషికులు (కాణాదులు) కాని, తర్కవాదులుకాని, సాంఖ్యులుగాని, యోగులుగాని, వేదాన్తులుగాని, వేదములుగాని, దేవతలుగాని ఎవ్వరు తెలుసుకొన లేరు. నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్య –

న మీమాంసకాః మీమాంసకులు అంటే పూర్వమీమాంస పణ్డితులు. పూర్వమీమాంస జ్ఞానము స్వయం వ్యక్తమంటుంది. ఈ జ్ఞానాన్ని పొందే ఆరు మార్గాలను చెప్పింది. ప్రత్యక్ష అనుమాన ఉపమాన శబ్ద అర్థాపత్తి అనుపలబ్ధి అను ఆరు ప్రమాణాలను జ్ఞానవ్యక్తీకరణ సాధనాలుగా చెప్పింది. అనుపలబ్ధిని ప్రభాకరుడు ప్రమాణంగా అంగీకరించలేదు. ఇది ఆత్మలు, దేవతలు, స్వర్గం, నరకం, ఇన్ద్రియాతీత అంశాలను వాస్తవమైనవిగా అంగీకరిస్తుంది. జగత్తును అందులోని వస్తువులు శాశ్వతమైనవని చెప్తుంది.
జగత్తుయొక్క మనుగడ కర్మ నియమములచే నిర్వహించబడుతుంది. వేదములు శాశ్వతము అపౌరుషేయము అని చెప్పి, వేద విధులలో నిమగ్నం అవ్వాలని అదేసిస్తుంది. ఈ దర్శనంయొక్క ప్రధాన లక్ష్యము స్వర్గము. జగత్తుయందు సత్యత్వభ్రాంతిగల ఈ దర్శనము నిన్నుగూర్చి చెప్పగల సామార్థ్యం గలదికాదు.

నైవ కాణాద తర్కా కాణాదులు అంటే వైశేషికులు. వైశేషిక దర్శనము నిరీశ్వర దర్శనమే కానీ నాస్తికదర్శనముకాదు. ఎందుకంటే వేదప్రామాణ్యాన్ని ఆత్మను పునర్జన్మను కర్మసిద్ధాంతాన్ని అంగీకరిస్తుంది.
ఇది **అథాతో ధర్మం వాఖ్యాస్యామః** అని అరంభం అవుతుంది. ఇక్కడ ధర్మం అభ్యుదయములను నిశ్రేయసములను ఇచ్చేది. ఈ ధర్మమువలననే అర్థ కామములు చివరకు మోక్షము లభిస్తాయి. ధర్మం వలన తత్త్వజ్ఞానం సిద్ధిస్తుంది.

తత్త్వజ్ఞానమంటే పదార్థజ్ఞానమే.

ద్రవ్యం గుణం కర్మ సామాన్యం విశేషం సమవాయం అని పదార్థాలు ఆరు విధాలు. అభావమును చేర్చి కొందరు ఏడన్నారు. ద్రవ్యం పృథ్వీ జలం అగ్ని వాయువు ఆకాశం కాలం దిక్కు ఆత్మ మనస్సు. ఇవి మూర్తామూర్తములుగా సావయవి (పృథ్వీ జల అగ్ని), నిరవయవి (వాయు ఆకాశ కాల దిక్కు) అని రెండు విధాలు.

వీరికి **ఆత్మ** అంటే జీవాత్మ. ఇది అనాది అనంతం సర్వవ్యాపి 'అనేకం'. కాకపోతే వీరి ఆత్మ జడం. మనస్సంయోగము వలన ఆత్మ చేతనం అవుతుంది. **'గుణము'** దీనికి స్వాతంత్ర్యము లేదు. ద్రవ్యమును అంటిపెట్టుకొని ఉంటుంది. ఇవి రూపం (రంగు), రసం (రుచి), గన్ధం, స్పర్శ, సంఖ్య, పరిమాణం, పృథక్త్వం (ప్రత్యేకత), సంయోగము, విభాగం (వేర్పాటు), పరత్వం (ముందు), అపరత్వం (వెనుక), బుద్ధి, సుఖం, దుఃఖం, ఇచ్ఛ, ద్వేషం, ప్రయత్నం, గురుత్వం, ద్రవత్వం, స్నేహం, సంస్కారం, ధర్మం, అధర్మం, శబ్దం, లఘుత్వం అని ఇరువది అయిదు.

కాణాదులకు **కర్మ** అంటే చలనము. ఉత్క్షేపణము (పైకి), అవక్షేపణము (క్రిందికి), ఆకుంచనము (ముడుచుకొనుట), ప్రసారణం (విస్తరణ), గమనం. ఈ కర్మకూడా ద్రవ్యాశ్రయిగా ఉంది.

సామాన్యం వస్తువులలో ఉండే సామాన్య లక్షణం. ఇది ద్రవ్య గుణ కర్మలతో శాశ్వతంగా ఉంటుంది. గోత్వము, ఘటత్వము ఇలాంటివి. విశేషము సామాన్యం నుండి వేరుపరచునది. పశువర్గమునుండి మనుష్యులను వేరు చేసినట్లు.

సమవాయం వస్తుగుణాలమధ్య ఉండే అవినాభావ సంబంధం.

వస్తువును అంతకంతకు విభజిస్తూపోతే విభజనకు సాధ్యంకాని స్థితి కలుగుతుంది. ఈ స్థితిలో మిగిలే సూక్ష్మాతిసూక్ష్మమైన వస్తువు **అణువు**. ఇది నిరవయవి, అచ్ఛేద్యము. ఈ అణువులను ఎవరు ఉత్పత్తి చేయలేరు. ఇవి అనాదిసిద్ధము, నిత్యము.

వైశేషికులది అసత్కార్యవాదం. అంటే కార్యం వేరు, కారణం వేరు. ప్రతి

కార్యానికి కారణం ఉంటుంది. కారణంలో కార్యం మొదటినుంచి ఉండదు. కార్యం అనేది క్రొత్తగా పుడుతుంది. కార్యంలో కనబడే లక్షణాలు ఏవి కారణంలో కనబడవు. మట్టిలోనుండి వచ్చిన కుండ మట్టి లక్షణాలను కలిగి ఉండదు. కుండ రూపం మట్టిలో ఉండదు. విత్తులో చెట్టును చూద్దాం అంటే కనబడదు. కుండ చెట్టు ఇవ్వన్ని క్రొత్తగా పుట్టుకు వచ్చిన కార్యాలు అంటుంది. ప్రశస్తపాదుడు పదార్థముల తత్త్వజ్ఞానమే మోక్షకారణమని వచించాడు. మహేశ్వర ప్రేరిత ధర్మమునుండి ఆత్మజ్ఞానము లభిస్తుంది. మహేశ్వరునకు సంహారేచ్ఛ జనించిన అణుసంఘాతమున (Big bang) జగత్తు విశ్లిష్టమై వినిష్ఠమై పోవును. అప్పుడు చతుర్విధ పరమాణువులు మాత్రమే (పృథ్వీ జల అగ్ని వాయు) మిగిలియుండును. తరువాత పరమేశ్వరుని సంకల్పమువలన తిరిగి బ్రహ్మాండము సృష్టి అగును.

తర్కశాస్త్రము దీనికి న్యాయదర్శనము అని పేరు కూడా ఉంది. గౌతమ మహర్షి తాత్విక సమస్యలపై వాదోపవాదములకు సరిపడు నియమ నిబంధనలను న్యాయదర్శనముగా అందించారు. **ప్రమాణ ప్రమేయ సంశయ ప్రయోజన దృష్టాంత సిద్ధాంతావయవ తర్క నిర్ణయ వాద జల్ప వితండా హేత్వాభాసచ్ఛల జాతి నిగ్రహ స్థానానాం తత్వజ్ఞానా న్నిఃశ్రేయ సాధిగమః** ఈ షోడశపదార్థములను తెలుసుకుంటే సంసారం నుండి బయటపడతామని నిఃశ్రేయసం ప్రాప్తిస్తుందని ప్రతిపాదిస్తుంది.

ఈ వైశేషిక న్యాయదర్శనములు లోకంలో ప్రేళ్ళూనుతున్న నిరీశ్వర వాదములను నిరసించుటకు ప్రవర్తింపచేయబడ్డాయి. ఇది కార్యకారణభావాంగీకారముపై ఆధారపడింది. ఈ కార్యకారణ వైచిత్రి కేవల దృష్టకారణముచే సమర్థించు వీలులేదు కావున అదృష్టకారణమును అంగీకరించవలసి వచ్చింది.

సాంఖ్యము విశ్వ సృష్టికి మూలప్రకృతి ప్రధానకారణమని చెప్తుంది. ప్రకృతి సత్వము, రజస్సు, తమము అనే త్రిగుణములతోకూడి ఉంది. ప్రకృతి పురుషుల సంయోగంవలన బుద్ధి జనిస్తుంది. ఈ బుద్ధే జీవులను సంసారంలో బంధిస్తుంది. సాంఖ్యులు జ్ఞానముకు ప్రత్యక్ష ప్రమాణం (నిర్వికల్ప, సవికల్ప), అనుమానము, శబ్దము అను మూడు ప్రమాణములను అంగీకరించేరు. వేదాంతుల బ్రహ్మమువలే

వీరి పురుషుడు సర్వవ్యాపి నిరాకార ఆత్మతత్త్వం. ఇన్ద్రియగ్రాహ్యం కాదు. పురుషుడు శాశ్వతుడు. ఎవరు సృజించలేదు. పురుషుడు దేనిని సృజింపడు.

ప్రకృతి సృష్టికారణమైన శాశ్వతమైన అంశము. ఇది అనాది. దీనిని ఎవరు సృజించలేదు. కానీ ప్రకృతికి ఉన్న సృష్టిచేసే లక్షణంవలన ఈ చరాచరాత్మక మైన జగత్తు సృష్టింపబడుతోంది. ప్రకృతిజన్యమైన ఈ భౌతికస్వరూపాలే తనుకాని పురుషుని బంధిస్తున్నాయి. స్వస్వరూపజ్ఞానం కలిగినప్పుడు సంసార బంధంనుండి విముక్తి.

కపిలముని ఈశ్వరుని అంగీకరించలేదు. పరిణామము లేని ఈశ్వరుడు నిత్య పరిణామశీలయైన జగత్తుకు కారణమని చెప్పడం అసంబద్ధం కనుక ఈశ్వరుని అంగీకరించ లేదు. కపిలుని తరువాత కాలంలో ఆయన అనుయాయులు ఈశ్వరుని అంగీకరించేరు.

సాంఖ్యము 'సత్కార్యవాదము'ను ప్రతిపాదిస్తుంది. ఉన్నదేదో ఉంది. అది నశించదు. అంతా పరిణామమే. కారణంలో ఫలితం అంతర్లీనంగా ఉంటుంది. వీరిది ప్రకృతి పరిణామవాదం. దీని ప్రకారం సర్వము మూలప్రకృతి నుండి విభజితమై జగద్రూపంగా విస్తరించి తిరిగి మూలప్రకృతియందే లీనమగును. వైవిధ్యం ఘర్షణ అనేవి ప్రకృతిలో అన్తర్లీనంగా ఉన్న లక్షణాలు. వీటివలన ప్రకృతి ఇరువది నాలుగు తత్త్వాలుగా విభాగింపబడింది. వీటి మధ్య మథనక్రియ పరాణామమునకు మూలం. ఇందుకు మూడు ప్రధానతత్త్వాలు ఉన్నాయి. అవి సత్త్వము రజస్సు తమము. వీటివలన మహదహఙ్కారములు, మనస్సు దశేన్ద్రియములు పఞ్చతన్మాత్రలు పఞ్చమహాభూతములు ఏర్పడుతున్నాయి. వీటిమధ్య హెచ్చుతగ్గులవలన జీవుల పదార్థముల లక్షణాలు మారతాయి.

వేదాన్తులు బ్రహ్మమే సర్వకారణం వేరే పదార్థం లేదని చెప్తారు. సాంఖ్యం ప్రకృతి పురుషుడు ఇద్దరినీ అంగీకరిస్తుంది. శాశ్వతమైన దానినుండి అశాశ్వతమైనది జనిస్తుంది అంటే అంగీకరించదు.

యోగము అంటే చిత్తవృత్తుల నిరోధము. జడమైన మూలప్రకృతి పురుషుని సాన్నిధ్యంవలన పరిణామం చెంది ప్రకృతి జడం పుడుతుంది. మహత్ (బుద్ధి) దీనికి వృత్తులు (వికారాలు) ఉంటాయి. ఈ వృత్తులు నిరోధిస్తే సమాధి స్థితి

లభిస్తుంది. ఇదే మోక్షం అంటుంది.

న వేదాన్తవేదాః వేదాన్తులుగాని, వేదములుగాని ఎవ్వరు తెలిసికొనలేరు. వేదాన్తులు అంటే ఉత్తరమీమాంస వాదులు. అంటే అద్వైతులు. ఇది బ్రహ్మకాణ్డ. దీనికి ఆయువుపట్టు అధ్యాస లేక అవిద్య. అంటే ఉన్నది ఒకటైతే దానిని మరొక వస్తువుగా గ్రహించడం. రజ్జు సర్ప భ్రాంతి, శుక్తి రజత భ్రాంతి. స్థాణుపురుష భ్రాంతి. ఇటువంటివే. అద్వైతుల ప్రకారం వెండి సర్పము పురుషుడు ఇవి ఉన్నవని చెప్పడానికి గాని, లేవని చెప్పడానికిగాని వీలులేదు. ఆక్షణంలో అవి ఉన్నట్లు కనబడుతున్నాయి, క్షణాంతరంలో కలిగే జ్ఞానంవలన లేకుండా పోవచ్చు. ఈ స్థితిని శాస్త్రము **అనిర్వచనీయం** అంటుంది. దీనిని మీమాంస వాక్యాల సహాయంతో అంటే ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, గీతావాక్యముల సహాయంతో విచారణ చెయ్యాలి. దీనివలన నేను కర్తను భోక్తను అనే భ్రాంతి పోతుంది. ఆత్మానాత్మల అధ్యాస అనాది సిద్ధంగా వస్తోంది. ఈ అధ్యాస ఉన్నంత వరకే నేను కర్తను నేను భోక్తను అను లోకవ్యవహారమంతా అధ్యాస తొలగిపోతే ఇక లోకవ్యవహారం ఏమీ ఉండదు. ఈ వేదాన్త శాస్త్రమంతా అధ్యాస తొలగడానికే ఉపకరిస్తుంది. అధ్యాస – భ్రమ – అవిద్య ఇది తొలగిన తరువాత ఇన్ద్రియగ్రాహ్యమైనది ఏదిలేని కారణంగా అది అనుభవైకవేద్యమే దానిని చెప్పడానికి ఏదీ సామర్థ్యము గలది కాదు. కావున నిన్నుగూర్చి చెప్పుటకు ఉభయ మీమాంస శాస్త్రములు సామర్థ్యంగలవి కావు. దానంజేసి మీమాంసలు జగత్తు (పూర్వమీమాంస), అధ్యాస (ఉత్తరమీమాంస) ల చుట్టూ ఉన్నాయి.

వేదమే మన తత్త్వచిన్తనకు మూలం. వీటి ప్రతిపాదన విధానాన్ని అనుసరించి ఇవి నాలుగు (ఋగ్ యజుస్ సామ అధర్వ) అన్నారు. ఇవి మన్త్రబ్రాహ్మణ రూపంగాను, ఆరణ్యకోపనిషద్రూపంగాను ఉంది.

మన్త్రబ్రాహ్మణము అంతా ఇన్ద్రాగ్ని వరుణ రుద్ర విష్ణ్వాది దేవతా స్తుతులతో, వారి అనుగ్రహప్రాప్తికైన యజ్ఞయాగాది క్రియాకలాపాలతో ఉంది. ఇదంతా బహిర్యాగము. మిగిలిన ఆరణ్యకోపనిషద్రూపంగా ఉన్న భాగము తత్త్వచిన్తనకు ప్రాధాన్యతను ఇచ్చింది. ఇన్ద్రాగ్ని వరుణ రుద్ర విష్ణ్వాది దేవతా మూర్తులు

బాహ్యేన్ద్రియ, అన్తర ఇన్ద్రియ గ్రాహ్యమైన స్వరూపములు. మరి మహామాయా శివా స్వరూపమైన నీవు బాహ్యాభ్యన్తర ఇన్ద్రియగ్రాహ్యము కానిదానవు. బహిర్యాగ సాధ్యులైన హరిహర హిరణ్యగర్భేన్ద్రాదులు కాలమునకు లోబడియున్నారు. వీరు అన్తర్యాగ సమారాధ్యవు అయిన నీన్ను తెలియుట దుర్లభము. నీవు షడ్దర్శనాలుగా ప్రసిద్ధి పొందిన న్యాయ వైశేషిక సాంఖ్య యోగ పూర్వోత్తర మీమాంసా దర్శనాల చేత గానీ, విశేష బహిర్యాగ ప్రకాశ గల వేదములుగాని, బహిర్యాగ సాధ్య స్వరూపములుగాని నిన్ను తెలియలేరు. నీవు సాక్షాత్తు పరబ్రహ్మమే అయియున్నావు.



న తే నామ గోత్రే న తే జన్మ మృత్యూ
న తే ధామ చేష్టే న తే దుఃఖ సౌఖ్యే।
న తే మిత్ర శత్రూ న తే బన్ధ మోక్షౌ
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౬

భావము– నీకు ఏ పేరూ లేదు ఏ గోత్రము లేదు. నీకు చావు పుట్టుకలు లేవు. నీకు ఏ నివాసము లేదు. ఏవిధమైన క్రియాకలాపాలు లేవు. నీకు సుఖదుఃఖాలు లేవు. నీకు శత్రువులు లేరు, మిత్రులు లేరు. నీకు బంధ మోక్షములు లేవు. నీవు పరబ్రహ్మయొక్క ఏకైక స్వరూపం.

మానసౌకా వ్యాఖ్యా:

'న తే' అనే ఉపసర్గతో ఆరంభించేరు. 'నీకు లేదు' అని. ఇది కేవలము పరదేవతను ఉద్దేశించి చెప్పినది మాత్రమేకాదు. **'త్వం'** అనే సాధకుని లేదా దేవతాభిన్న స్వరూపుడైన బ్రహ్మజ్ఞానిని ఉద్దేశించినది. నీకు నామము లేదు. నీకు గోత్రము లేదు. నీవు పరబ్రహ్మవు కావున నీకు ఉపాధి సంబంధమైన లౌకిక గుర్తింపులు వర్తించవు. బౌద్ధము 'నామ' శబ్దమును నాలుగు విధాలైన మనోధర్మముల (వేదన, సంజ్ఞ, సంఖార (సంస్కార), విజ్ఞాన) సమష్టి అని చెప్పింది. **'నామ'** శబ్దమునకు సంజ్ఞ, కోపము అని అర్థము. ఇవి లేని దానవు. అంటే వీటి ప్రయోజనము రెండవదంటూ ఒకటి ఉంటే సిద్ధిస్తుంది. రెండవది లేని అద్వైతస్వరూపము అగుటచే సంజ్ఞా, కోపములు నీయందు ప్రయోజన శూన్యమై ఉనికిని కోల్పోయాయి. గోత్రము అంటే అధ్యయనార్థం గురుకులము నకు వచ్చినవారు ఆ గురుకుల సంబంధమైన గురువుల పారంపర్య బంధాన్ని సూచించేది. నీవు పరబ్రహ్మమే అగుటచేతను, నీ సర్వజ్ఞత్వ సర్వవ్యాపకత్వముల చేతను సర్వ వేద శాస్త్ర మన్త్ర తన్త్ర వాఙ్మయము నీనుండే ప్రకటమగుచుండుట చేతను. నీవు జ్ఞానశక్తియొక్క మూలాధారమగుట చేతను, నీవు సర్వ పరంపర లకు కేంద్రస్థానమగుటచే నీవు ఏ పరంపరకు చెందని దానవై "గోత్రము" లేనిదానవని చెప్పబడుచున్నావు.

న తే జన్మ మృత్యూ నీకు జన్మ లేదు, మరణము లేదు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అని కదా... నీకు పుట్టుకయే లేదు. పుట్టుట అనేది కాల విక్షేపమే. నీవు విమలకాల స్వరూపిణివి. మహాయుగాది కలాకాష్ఠ పర్యన్త కాలవిభాగ రూపమైన మలినములు లేనిదానవు. కావున నీకు 'కాలధర్మము' అంటుటలేదు. నీవు నిత్యసత్యము. ఆరంభాన్త రహితమైన అస్థిత్వముచే ప్రకాశించు సాక్షీ స్వరూపానివి.

న తే ధామ చేష్టే నీకు స్థలపరిమితి లేదు. నీకు ఉపాధి లేదు. నీయందు చలనాది ప్రవర్తనలు లేవు. నీవు ఉండదగిన నగరముగానీ, స్థానముగానీ లేదు. నీవు అపిరిచ్ఛిన్నమైన సర్వవ్యాప్తమైన శుద్ధచైతన్య స్వరూపానివి. కనుక అనుగుణమైన స్థానము, స్థానమునకు అనుగుణమైన ప్రవర్తన చలనము నీయందు లేవు.

న తే దుఃఖ సౌఖ్యే నీకు సుఖదుఃఖములు లేవు. సుఖదుఃఖాలు మనస్సుకు సంబంధించినవి. పరమశివుడు – పరాశక్తి – సదాశివతత్త్వము – ఈశ్వర తత్త్వము – శుద్ధవిద్యా తత్త్వము – మాయా – మహతత్త్వము – అహఙ్కారము – మనస్సు – ఇన్ద్రియములు – పఞ్చభూతములు. ఇదీ క్రమము. మహతత్త్వమునకు పైన అఖణ్డకాల శక్తిగా ఉన్న నీకు, అహఙ్కారమునకు క్రిందిదైన మనోగతభావనల స్పర్శలేనిదానవు అగుటచే నీకు సుఖము దుఃఖము అనునవి లేవు.

న తే మిత్ర శత్రూ నీకు స్నేహితుడూ లేదు,శత్రువు లేదు. నీవు అద్వైతానివి. ద్వైతసంబంధ భావనలకు అతీతమైనదానవు. నీకు భిన్నమైనది ఏదీ లేకుండుటచే, రెండవది ఉండిన రాగద్వేషములకు అవకాశము ఏర్పడును. రెండవది లేని అద్వైతివి అగుటచే స్నేహితులుగానీ, శత్రువులుగానీ లేని దానవు.

న తే బన్ధ మోక్షౌ నీకు బన్ధము లేదు. నీకు మోక్షమూ లేదు. బన్ధ మోక్షములు జీవలక్షణం. నీవు బ్రహ్మస్వరూపిణివి. అవిద్యామూలంగా మాత్రమే బన్ధబుద్ధి కలుగుతుంది. నీవు విద్యా స్వరూపిణివి.
మనస్సే బన్ధ మోక్షములకు కారణమని శ్రుతులు చెప్తున్నాయి. నీవు మనస్సునకు పైనున్న స్వరూపానివి. నీకు మనస్సు లేదు. కావున బన్ధ మోక్షములు లేనిదానవు.

న బాలా న చ త్వం వయస్యా న వృద్ధా
న చ స్త్రీ న షణ్ఢః పుమాన్నైవ చ త్వం
న చ త్వం సురీ నాసురీ కిన్నరీ వా
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౭

భావము– నీవు బాల కాదు. నీవు యువతివి కాదు. నీవు వృద్ధురాలవు కావు. నీవు స్త్రీ కాదు, పురుషుడవు కావు, నపుంసకుడవు కావు. నీవు సుర సంబంధివి కాదు, అసుర సంబంధివి కావు. నీవు కిన్నర స్త్రీవి కాదు. నీవు పరబ్రహ్మయొక్క ఏకైక స్వరూపమే అయియున్నావు.

మానసౌకా వ్యాఖ్యా:

న బాలా న చ త్వం వయస్యా న వృద్ధా నీవు బాలురాలవు కావు. బాలా లిఙ్గ వాచకము. బాలిక అని. **న బాలా** అన్నచోట **న** అంటే **తదన్యః** బాలికకంటే అన్యమైనది. శాక్తేయ సంప్రదాయంలో నాలుగు సంవత్సరాల పిల్ల 'కాళిక' – సంహారశక్తి. అయిదు సంవత్సరాల పిల్ల **'సుబ్రహ్మణ్యా'** – శుద్ధతత్త్వము. ఈ పిల్లలు ఇద్దరూ బాలా సంజ్ఞచేతనే సూచింపబడుతున్నారు.
ఇప్పుడు **బాలా** అంటే సంహారశక్తి అనుకుంటావేమో 'న–తదన్యః' అంటే సుబ్రహ్మణ్యా శుద్ధతత్త్వము. బాలా అంటే 'సుబ్రహ్మణ్యా' అనుకుంటావేమో **తదన్యః** అంటే 'కాళిక' సంహారశక్తి.
ఇప్పుడు **న బాలా** అంటే నీవు సంహారశక్తివి, శుద్ధతత్త్వానివి.
బాలోఽపి యో న్యాయనయే ప్రవేశ। మల్పేన వాఞ్ఛత్యలసః। ఎక్కువ కష్టపడ లేని వాడు తక్కువ శ్రమతో న్యాయశాస్త్రములో ప్రవేశాన్ని కోరే బాలుని కొరకు... అని బాల శబ్దమునకు కేశవమిశ్రుడు ఇచ్చిన నిర్వచనము. బాలత్వం అంటే సామర్థ్యశూన్యత. **న బాలా** అంటే సామర్థ్యశూన్యతకు అన్యమైనది – సర్వసమర్థత. **బాలా** అంటే శుద్ధచైతన్యానికి అస్పష్టరూపం. దీనికి అన్యమైనది **న బాలా** అంటే నిర్దోష శుద్ధచైతన్యరూపానివి. **అనధీత తర్కశాస్త్రత్వం బాలత్వమ్** అని నీకు ఎంత తెలిసినా ఎన్ని తెలిసినా, తర్కము తెలియకపోతే వాడిని పణ్డితుడు అనలేము. **అవిజ్ఞాతతత్త్వే అర్థే కారణోపపత్తితః తత్త్వజ్ఞానార్థమూహస్తర్కః** అంటాడు

గౌతముడు. అంటే వస్తువును వాస్తవముగా తెలుసుకోవడానికి చేసే ఊహనే తర్కమని అంటారు. అంటే విచారమే. **న బాలా** అంటే విచార రూపముగా మాత్రమే తెలియదగిన బ్రహ్మస్వరూపము.

న చ త్వం వయస్యా వయస్యా అంటే 'వయసా తుల్యా' వయస్సుచే సమానమైనది. నీ వయస్సుతో సమానమైన వయస్సు కలది లేదు. నీవు యువతివి కాదు. యువతివి కాదు అంటే వృద్ధురాలు అనుకుంటారేమో, **'న వృద్ధా'** వృద్ధురాలుకూడా కాదు. పిన్నలలో పిన్నకానీ, పెద్దలలో పెద్దకానీ ఎవరూ నీవయస్సుతో సమానులు లేరు. కావున నీవు బాలవా, యువతివా, వృద్ధా అని చెప్ప శక్యముగాని దానవు. బాల్య యౌవన వార్ధక్యాలు శరీర సంబంధమైన వికారాలు. నీవు ఆత్మస్వరూపిణివి. నీవు శరీరము కాదు. నీకు వయస్సు లేదు. వయస్సు కాలమును ఆశ్రయించుకు ఉంటుంది. కాలము నీ అధీనములో ఉంటుంది. కనుక నిన్ను కాలముచే కొలుచుట సాధ్యపడదు.

న చ స్త్రీ న షణ్ఢః పుమాన్నైవ చ త్వం నీవు స్త్రీ కాదు, పురుషుడవు కావు, నపుంసకుడవు కావు. ఇక్కడ లిఙ్గభావనలకు అతీతమైన బ్రహ్మతత్త్వమును ప్రకటిస్తున్నది. ఆత్మయొక్క నిర్లింగ, నిరుపాధిక స్వరూపాన్ని స్పష్టపరుస్తోంది. **'తదవ్యక్త స్వరూపత్వాత్** (1.3.14)' అని బ్రహ్మసూత్రము అది అవ్యక్తము అనిర్వచనీయము అని దేనిని చెప్పిందో ఆ బ్రహ్మస్వరూపానివి. ఫలానా చిహ్నము (లిఙ్గము) ద్వారా నిన్ను గుర్తించుట లేదా తెలుసుకొనుట సాధ్యము గాని దానవు. నీయొక్క స్థితి లిఙ్గాతీతము శరీర రహితము చైతన్యమాత్రము అయినది. నీవు బాలవు కాదు, యువతివి కాదు, వృద్ధవు కాదు, స్త్రీ పురుషుడు నపుంసకుడు కాదు. నీవు ఏవిధమైన మార్పులకు లోనుకాని నిర్వికారి.

న చ త్వం సురీ నాసురీ కిన్నరీ వా నీవు సుర సంబంధివి కాదు, అసుర సంబంధివి కావు. నీవు కిన్నర స్త్రీవి కాదు. దేవతలు అంటే ఇన్ద్ర అగ్ని వాయు వరుణాది శక్తులు. వీరు కాలాత్మకులు కర్మబద్ధులూను. వీరు మన్త్రాధీనులు. వీరు కాలమును కర్మను అతిక్రమించలేరు. నీవు కాలమునకు కర్మకు లోబడి యుండు దానవు కాదు.

సురులు అంటే ఐశ్వర్యయుక్తులు, ప్రకాశస్వరూపులు. హవిర్భాగములను

గ్రహించువారు. శుభములను పల్కువారు. అభీష్టఫలాలను ఇచ్చువారు. శ్రీమద్రామాయణంలో వాల్మీకిమహర్షి **'తతో దేవా స్సగన్ధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః। భాగ ప్రతిగ్రహార్థం వై సమవేతా యథావిధి'** వీరందరూ హవిర్భాగ ప్రతిగ్రహార్థం కలిసేరని చెప్పేరు. ఆ వాల్మీకిమహర్షి **'ఋషీన్యక్షాన్సగన్ధర్వా నసురాన్బ్రాహ్మణాం స్తథా। అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహితః॥'** అని చెప్పి అసురులకు ఋషి యక్ష గన్ధర్వాదులతో సంబంధాన్ని చెప్పి, అసురులు పైవాటికొరకు హవిర్భాగాలను సమర్పిస్తూ సురులను ప్రసన్నం చేసుకొని ఐశ్వర్యము ప్రకాశము (కీర్తి) మొదలైన సర్వాభీష్టాలను పొందు మర్త్యులని గ్రహించాలి. వీరు భోగాసక్తికి కట్టుబడి ఉండే శక్తులు. **'న కిన్నరీ'** నీవు కిన్నర స్త్రీవి కాదు. ఇక్కడ కిన్నర శబ్దము దేవవర్గకు సంబంధించినది కాదు. కిన్నరులు దేవతా విశేషమే అయితే **'న చ త్వం సురీ'** అనడంతోనే గ్రహిండబడింది కదా! పునః కిన్నరీ అని ఎందుకు చెప్తున్నట్లు... అంటే ఇక్కడ కిన్నరీ శబ్దముతో **స్వరాన్ని ఆధారము చేసుకొని కర్మానుభవమును పొందుతున్న పశువర్గము** అని గ్రహించాలి. దానంజేసి నీవు దేవ మనుష్య పశువర్గములకు చెందని దానవు. కేవలము నీవే పరబ్రహ్మస్వరూపురాలవై యున్నావు.

ఈ శ్లోకం అమ్మయొక్క ఘోరరూపాన్ని సుస్పష్టం చేస్తోంది. ఇది అమ్మయొక్క సత్యస్వరూపం. ఇక్కడనుండీ అమ్మయొక్క నిజరూపాన్ని కీర్తిస్తున్నారు. అమ్మయొక్క నిజరూపాన్నే దర్శింప చేస్తున్నారు. అమ్మ ఘోరరూప, ఉగ్రదేవత అని ఎందుకు చెప్తున్నాము, అన్నదానికి ఈ శ్లోకం సమాధానం. బాల్య యౌవన వార్ధక్యాలను శరీర సంబంధమైన వికారాలు నీయందు లేవు. కారణం నీవు ఉపాధి కాదు. నీవు దేవ మనుష్య పశు వర్గములకు సంబంధించిన దానవు కావు. వీరందరూ కాలాత్మకులు, కర్మబద్ధులు. ఈ దేవతోపాధులు జపము తపస్సు యజ్ఞము యాగము మొదలు, ఆభిచారికప్రయోగరూప కర్మానుష్ఠానాదుల వరకు వాటియందు అభిమానము కలిగి, వీటిని ఆచరించువారియందు, ఆచరణ సమయంలో దేవతలను ఉద్దేశించి నివేదించే హవ్యకవ్యములయందు ఆదరణను కలిగియున్నారు. యజ్ఞయాగాది కర్మానుష్ఠానాదులను నిరసించు వారియందు ద్వేషమును కలిగి ఉంటున్నారు. వీటికి సంబంధించిన వైదిక, పురాణ ప్రమాణాలు

ఉండనే ఉన్నాయి. దానంజేసి ఈ దేవతోపాధులు రాగద్వేషాదులు కలవారనే చెప్పాలి. కారణం వీరు మనస్సుకు సంబంధిం చినవారు. నీవు మనోమయ కోశమునకు ఆవలి దానవు. కనుక నీకు రాగద్వేషములు లేవు. కనుక నీ కరుణ కర్మానుష్ఠానపరులయందు, తద్విరోధులయందు ఒక్కలాగుననే ఉంటోంది. నీ కరుణ నీ ఉపాసకులకు నిన్ను ధ్యానించువారలకు రాగద్వేషాతీతమైన సహజస్థితిని ఇస్తోంది. మిగిలిన దేవతోపాసనలు క్రమశః ముక్తిని ఇస్తున్నాయి. ఈ దేవతకు జప హెూమక్రియాదులు ఏమీ లేవు. ఈ దేవతా స్వరూపానికి ఆయుధాలే లేవు. ఉన్మత్తానన్దమే స్వరూపం. ఇది శుద్ధబ్రహ్మము. ఈ స్వరూపము ఉగ్రము ఘోరరూపము. ఈమెను ధ్యానించువారలకు తత్-క్షణమే మోక్షమును ఇస్తుంది. మోక్షము అంటే అదేదో పదార్థమో, సంపాదించి దాచుకోదగిన అపూర్వవస్తు సంపత్తియో కాదు. మోక్షము అంటే విడుదల. దేనినుండి విడుదల అంటే అన్నిటినుండి విడుదల. అన్ని బంధములనుండి విడుదల. అన్ని సంపదలనుండి విడుదల.

కనుకనే ఈ దేవతా ఉపాసనను ఉగ్రము, ఘోరము అని చెప్పేరు. ఎందుకంటే ఉపాసకుడు ఆక్షణమే సంసారమునందు సత్యత్వభ్రాంతి పోయి రాగరహితుడై బ్రహ్మానుభవాన్ని పొందుతాడు. సర్వబంధములనుండి ముక్తుడు అవుతాడు. అంటే సర్వ సంపదలనుండి, భార్యా పుత్ర మిత్రాది సర్వబంధములనుండి తెగిపడతాడు. మనకు దగ్గరలో ఒక విస్ఫోటనము జరిగినప్పుడు సమీపంలో ఉన్నవారి దేహమునుండి తెగిపడిన అవయవముల వలె ఉంటాయి బంధాలు. సంసారి రాగద్వేషములతో పెనవేసుకొని ఉంటాడు. కనుక అటువంటివారికి ఈవిధమైన ఆరాధనలను తీవ్రము ఉగ్రము ఘోరము అని నిషేధము విధించారు. నేను రాగద్వేషాదులను జయించేసాను. నన్ను తిట్టినా పొగిడినా నేను పట్టించుకోను, ముఖంపై ఉమ్మినా తుడుచుకు వెళ్ళిపోతానే కాని, తిరిగి కోపం ప్రదర్శించను అంటారేమో... అటువంటి వారుకూడా శౌచాదులయందు శ్రద్ధకలిగి ఉంటారు. శౌచాదులయందు అత్యంత శ్రద్ధ కలిగి ఉండడంకూడా రాగ విశేషమే.

అత్యంత సహజస్థితిని ఉన్నది ఉన్నట్లుగా గ్రహించుటకు సిద్ధంగా ఉండాలి.

అదీ రాగద్వేషములకు అతీతముగా ఉండడము అంటే. నేను సంసారంలోనే ఉంటాను. నాకు బ్రహ్మజ్ఞానము కావాలి, మోక్షము కావాలి అనడం; వంట పూర్తికాకుండానే అథిదిని భోజనానికి కూర్చోమని వడ్డనకు ఉపక్రమించడం వంటిది. ఇది తృప్తిని ఇవ్వకపోగా, విపరీతఫలాలను ఇస్తుంది.



జలే శీతలత్వం శుచౌ దాహకత్వం
విధౌ నిర్మలత్వం రవౌ తాపకత్వం।
త్వమేవామ్బికే యస్య కస్యాపి శక్తి
స్త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౮

భావము– అమ్బా! జలమునందలి శీతలత్వము, అగ్నియందలి దాహకత్వము, కాలమునందలి నిర్మలత్వము, సూర్యునియందలి తాపకత్వము నీవే. ఈ సృష్టిలో ఎవరికి ఏ శక్తి ఉందో అదంతా నీవే. నీవు పరబ్రహ్మయొక్క ఏకైక స్వరూపం.

మానసౌకా వ్యాఖ్యా:

ఇక్కడ జలం శుచి రవి అనునవి సృష్టి లయ స్థితి కాలములకు ప్రతీకలు.

జలము – శుక్రము – సృష్టి.

శుచి – అగ్ని – పవిత్రీకరణ, పఞ్చీకరణ – లయము.

రవి – తాపకుడు – స్థితి.

విధి – కాలము, నియమము – నిర్మలము.

జలే శీతలత్వం – జలమందలి ప్రాణోత్పత్తి సామర్థ్యం. సృష్ట్యారమ్భ సామర్థ్యము లేదా జగదుత్పాదనా సామర్థ్యముగల 'బీజము' నకు జలమని పేరు.

ఆపోవా ఇదగ్ం సర్వం విశ్వాభూతాన్యాపః। అను శ్రుతి దీన్నే చెప్తోంది.

జలము అంటే నీరు. నీటియందు శైత్యము అనే శక్తి ఉంది.

దీనివలన ఉపాధిగత ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇది విశ్వపరిణామ ప్రక్రియలో ఒక భాగము. మహావిస్ఫోటనము జరిగినప్పుడు ఈ శీతలీకరణ (ఉష్ణశక్తి బదిలి) ద్వారానే విశ్వావిర్భావము ప్రారంభం అయింది. బ్రహ్మాణ్డాల ఆవిర్భావాల నుండి జీవుల పుట్టుక వరకు ఇదే ప్రకియ.

జలమందలి విశ్వపరిణామ ప్రక్రియలో భాగమైన శైత్యము నీవే.

శుచౌ దాహకత్వం – అగ్నియందలి పావకత్వము. పఞ్చభూతాత్మకమైన సృష్టి సంగము వలననే ఉత్పన్నమైనది. **సఙ్గాత్ పాపాని జాయన్తే** అనికదా!

సఙ్గము వలన ఉద్భవించిన జగత్తునందు పాపము (మాలిన్యము) ఉంది. ఈ పాపమునకు మాలిన్యమునకు **'ఉచ్ఛిష్ట'**మని పేరు.

ఆనన్దానుభవానన్తర శేషశక్తి లేదా సంగమాన్తర తృప్త్యనన్తర విసర్జితమునకు ఉచ్ఛిష్టమని పేరు.

నాద బిన్దు కలాత్మకస్య పరశివస్య తృప్త్యనన్తరం విసర్జిత విశ్వమిద ముచ్ఛిష్టం అని మృగేన్ద్రాగమము చెప్తోంది.

ఉచ్ఛిష్టమేవ విశ్వ సృష్టిః అని శాక్తాగమము విశ్వమంతా ఉచ్ఛిష్టమే అని చెప్పింది.

ఉచ్ఛిష్టే నామరూపం చోచ్ఛిష్టే లోక అహితః॥ ఉచ్ఛిష్ట ఇన్ద్రశ్చాగ్నిశ్చ। ఈ జగత్తులోని ప్రతి నామము, ప్రతి రూపము కూడా ఉచ్ఛిష్టమైనదే. లోకమంతా ఉచ్ఛిష్టములోనే స్థితమై ఉంది. ఇన్ద్రుడు అగ్ని వంటి దేవతలు ఉచ్ఛిష్టస్వరూపులే. అని స్తంభాది బ్రహ్మపర్యన్తమైన ఈ జగత్తు పరమేశ్వర ఉచ్ఛిష్టమే అని శ్రుతి చెప్తోంది.

ఉచ్ఛిష్ట భోజినీ దేవీ తేన వై జగదుద్భవమ్।
తస్యాం తుష్టే జగతుష్టం తస్యాం క్రుద్ధే ప్రణశ్యతి॥

ఉచ్ఛిష్టభోజినీ దేవి (కాస్వరూపమైన కాలిక) సన్తుష్టురాలైతే జగత్తు సంతోషముగా ఉంటుంది. ఆమె కుపితురాలైతే జగన్నాశం సవభవిస్తుంది. ఇక్కడ పరాశక్తి ఉచ్ఛిష్టమే జగత్తని చెప్పబడుతోంది. మహాకాలి ఉన్మత్తానన్దానుభవానన్తర శేషమే అంటే తృప్త్యనన్తర అభివ్యక్తికి **ఉచ్ఛిష్టము** అని పేరు. ఇది **అవశిష్టశక్తి.**

'ఆత్మన ఆకాశస్సమ్భూతః', 'ఆనన్దో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనన్దాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే।' అని భృగువల్లి ఆనన్దానన్తర అభివ్యక్తి అవశిష్టశక్తి...

ఇది **ఉచ్ఛిష్ట**మని తన్త్రములు చెప్తున్నాయి. **జగత్త**ని వేదాన్తులు అంటున్నారు. ఈ ఉచ్ఛిష్టము లేదా అవశిష్టశక్తి – జగత్తు తన అభివ్యక్తికి కారణమైన దాన్ని తెలుసుకొనె ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. చివరికి అదే ఆనన్దమైపోతుంది. మహదానన్దానన్తర అభివ్యక్తి అయిన జగత్తు (ఉచ్ఛిష్టము)నందు ఆ ఆనన్దమునకు దృష్టి (రాగము, ద్వేషము) ఉండదు. ఎందుకంటే తను నిత్యము ఆ ఆనన్దావస్థ లోనే ఉంటుంది. తన సమీపంలో ఉన్నవాటిని తనలో కలిపేసుకుంటుంది.

శుచౌ పావకత్వం అంటే అగ్ని ఈ ఉచ్ఛిష్టదోషాన్ని పోగొట్టి పరిశుద్ధుని

చేస్తాడని. **అన్నం హి శుద్ధిం ఆప్నోతి తేజసా** అన్నానికి తేజస్సు (అగ్ని) శుద్ధిని కలిగిస్తుంది అని ఉపనిషత్తు చెప్తోంది. అగ్ని ఉచ్ఛిష్టాన్ని శుద్ధి చేస్తాడని ఆపస్తంబుడు చెప్పేరు. **అగ్నిర్హ వై శోచిషా పాప్మాన మపహన్తి।** అని శతపథ బ్రాహ్మణము చాలా స్పష్టంగా చెప్పింది.

అగ్నౌ హుతం శుద్ధిమీయాత్ ఉచ్ఛిష్ట దోషనాశినీ అని అంటుంది కాలికా పురాణము.

రవౌ తాపకత్వం – జలమందలి ప్రాణోత్పత్తి సామర్థ్యం.

విధౌ నిర్మలత్వం – సృష్టి స్థితి లయములు కాలమునందు జరుగు నిరంతర ప్రక్రియ. కానీ కాలమునకు వీనితో లేశమాత్ర సంబంధము కూడా ఉండదు. కావున కాలము నిర్మలము.

పాపౌ క్ష్వేడముగ్రం పురా యన్మహేశః
పునః సంహరత్యన్తకాలే జగచ్చ।
తవైవ ప్రసాదాన్న చ స్వస్య శక్త్యా
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౯

భావము– అమ్మా! పూర్వము మహేశ్వరుడు భయంకరమైన విషపానము చేసాడన్నా (చేసి రక్షించాడన్నా), తిరిగి అన్తకాలములో జగత్తును లయం చేస్తున్నాడన్నా అది అతని శక్తి కాదు. అది నీ అనుగ్రహమే. నీవు పరబ్రహ్మయొక్క ఏకైక స్వరూపం.

మానసౌకా వ్యాఖ్యా:

సముద్ర మంథన సమయమున భయఙ్కరమైన విషాన్ని త్రాగాడు. త్రాగి జగత్ సంక్షోభాన్ని నివారించాడు. జగత్తును సంహరిస్తున్నాడు. ఇక్కడ జగత్తు అంటే సంసారమే. ఈ సంసారమునుండి ముక్తిని కలిగిస్తున్నాడని భావము. అసలు ఈ విషము ఎలా పుట్టింది...

బలవంతులు ధార్మికులు అయిన దితి మరియు అదితి పుత్రులు ముసలితనము మరణము రోగములు లేకుండా ఉండటము ఎలా, అని ఆలోచించి దైత్యులు ఆదిత్యులు (అదితి పుత్రులు) సాగర మథనమును చేయాలని నిశ్చయించేరు. వాసుకి త్రాడుగా మంథరము కవ్వముగా చేసి బహుకాలము మథించేరు. అప్పుడు సర్పముయొక్క శిరస్సులు అధికమైన విషమును క్రక్కుచూ దంతాలతో శిలలను కరుస్తున్నాయి. **ఉత్పపాతాగ్ని సంకాశం హాలాహల మహావిషమ్** పైకి ఎగసి పడుతున్న అగ్నితో సమానమైన హాలాహలం అనే గొప్ప విషం బయలుదేరింది. **తేనదగ్ధం జగత్సర్వం సదేవాశుర మానుషమ్** అని రామాయణములో విశ్వామిత్రమహర్షి అంటారు. ఎప్పుడైతే ఉపాధులయందు మమత్వ దృష్టి ఏర్పడిందో, అప్పుడు ఉపాధికొరకైన ప్రయత్నం ప్రారంభమైంది. దైతాదిత్యులకు కూడా ముసలితనము రోగము మరణము ఉన్నట్లుగా శ్రీమద్రామాయణము చెప్తోంది. ఇవి లేకుండా చేయాలనే కోరిక మహాదుఃఖానికి

కారణం. కోరికను సిద్ధింప చేసుకునే ప్రయత్నంలో బహుప్రయాస ఉంది. కామ్యకర్మ ఒక్కనాటికీ సుఖహేతువు కాదు. బహుప్రయాసకోర్చి కర్మ చేసిన వారికి, ఫలానుభవ సమయం (అంటే కర్మవిరామ సమయము)లో దుఃఖాభావ ముచేత సుఖముగా ఉన్నాననుకొంటాడు. ఫలముయొక్క క్షీణదశలో సుఖరూప భ్రాంతులు తొలగిపోయి దుఃఖం యథాతథంగా ఉందనే సత్యం తెలుస్తుంది. క్షుత్తు (ఆకలి) ఉపాధి ధర్మము. తన్నివారణకై శతాధిక ప్రయత్నాలు. ఇవి నిజానికి క్షున్నివారణ ప్రయత్నాలు కావు. జిహ్వేన్ద్రియ కామాన్ని పోషించే ప్రయత్నం. దీనికై అధికసమయం బహుప్రయాసతో అనేక పదార్థములను వండుకొని భోజనానికి కూర్చుంటాం. ఈ ఫలానుభవ సమయమే (వంట) కర్మ విరామసమయము. ఇక్కడ పదార్థముల రుచిని ఆస్వాదిస్తూ దుఃఖాభావాన్ని పొంది, ఆహా! ఎంత రుచిగా ఉన్నాయి పదార్థములు, కడుపు నిండా తిన్నాను. ఇక ఆకలి తీరిందనుకుంటాడు. ఆ ఫలం క్షీణదశకు చేరుకున్న వానికి మహాదుఃఖం అనుభవంలో అలానే ఉంది. అందుకే ఆచార్య శఙ్కరులు అన్నం సిద్ధవస్తువన్నారు. నిజానికి వీడు సుఖస్వరూపుడు. వీడికి ఆకలి సుఖాభావం. దీనికొరకు ఎటువంటి ప్రయత్నము లేదు. దొరికిన దానితో తృప్తి. ఇదే శాస్త్రోపదేశంగా ఉంది.

క్షీరసాగర మథనములో దైత్యాదిత్యులు మనోవృత్తులు. పూర్వం జీవునియందు మంచి చెడు అని రెండు లేవు. ఎందుకంటే జీవుడు అకామముగా నిస్స్వార్థంగా ఉన్నాడు. ఇప్పుడు అశాశ్వతమైన దానియందు శాశ్వతత్వాన్ని కోరి ప్రయత్నిస్తున్నాడు. ఇక్కడ కోరిక ఉంది. స్వార్థం ఉంది. ఇది దేవాసుర మనుష్య సహితమైన జగత్తు (అంటే మనోవృత్తులు) దగ్ధమైపోవడం (శాన్తించడం). ఇది అపునర్భవమైన స్థితికాదు. కనుకనే శాశ్వతానన్దము కొరకు మథనము. ఈ ప్రక్రియలో మొదట బయటకు పోవలసినది కామము. ఈ కామము స్వార్థం అయితే, ముందే పోవాలి. ఇదే హాలాహలం. మరి స్వార్థం పరార్థమైతే అనే శంకకు అవకాశము ఉంది. పరార్థమైన కామము క్రమముక్తికి ఉపకరించు వ్యభిచారి భావన అని చెప్పొచ్చు. ఇది తినాలనిపించే అపథ్యము. ఇదీ వదిలిపెట్ట వలసినదే. మహానన్దానుభవ ప్రాప్తికైన ప్రయత్నములో ముందు పోవలసిన

స్వార్థ కామములనే 'హాలాహలము'ను గ్రహించి రక్షించవలసినవాడు ఈశ్వరుడే. **ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైతవాసనా** అని కదా!

దేవసుర మనుష్య సహితంగా సర్వజగత్తు దగ్ధమైపోయిందని చెప్పేరు కాదా. అంటే స్వార్థకామనలతో ఉన్నవారు నశించి పోతున్నారు. **తతో దేవా సురాస్సర్వే మమన్థుః** మళ్ళీ ప్రయత్నం ప్రారంభం అయింది. అదెలా సాధ్యం. అందరూ నశించి పోయేరుకదా... అంటే **తేన దగ్ధం జగత్ సర్వం స దేవాసుర మానషమ్।** అనడంలోనే ఉంది రహస్యం. దేవాసుర సహితముగా మనుష్య జగత్తు అంతా దగ్ధమైపోయింది. ఈ దేవాసురులు మనుష్య సంబంధమైనవారు. ఇవి మనోవృత్తులు.

మనుష్యులు కర్మ చేసేరు. అది ఫలాన్ని ఇచ్చింది. లభించిన ఫలమునందు అనిష్టత. పైగా ప్రతికూలంగా ఉంది. ఇప్పుడు యజమాని మహాదుఃఖాన్ని పొందుతాడు. ఇష్టఫలావాప్తి కాలేదు. అక్కర్లేనిది ఒకటి వచ్చి కూర్చొంది. ఇప్పుడు మనోవృత్తులు అన్నీ నశించిపోయేయి. ఇది మనం చెప్పుకునే శ్మశానవైరాగ్యం, పురాణవైరాగ్యముల వంటిది. సహజంగా నశించిపోవుట కాదు. ఇది అనిష్టఫలావాప్తి రూప దుఃఖమువలన వచ్చింది. దుఃఖోపశమనము కాగానే తిరిగి అదే కర్మయందు పునఃపునః ప్రవర్తిస్తూ ఉంటాడు. కనుకనే పునః మన్థనాన్ని చెప్పేరు. ఇందులో కవ్వముగా ఉన్నట్టి పర్వతము జారి పోయింది. అంటే అమృతత్వాన్ని పొందే దిశలో ఉపకరణాలు అనుకున్నవి జారిపోతున్నాయి. ప్రయోజన శూన్యముగా ఉన్నాయి.

అమృతస్వరూపాన్ని శ్రుతుల సహాయముతోనే తెలుసుకోవాలి. మనస్సుయొక్క సద్వృత్తులు వేదాన్ని ఆశ్రయించేయి. **తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి** అను శ్రుతిచే ఉపనిషత్ జ్ఞానముచే బ్రహ్మ తెలుసుకోదగినవాడు. అని చెప్పుటచే బ్రహ్మజ్ఞానమునకు సాధనములు వేదములని దేవతలు మృత్యుభయమువలన వేదవిద్యను ఆశ్రయించేరు. **దేవావై మృత్యోర్బిభ్యతః** అని ఛాన్దోగ్యశ్రుతి చెప్తోంది. **పర్వతాగ్రేతు లోకాత్మా హస్తే నాక్రమ్య కేశవః** (వా.రా) లోకాత్మా పురుషోత్తముడు అయిన కేశవుడు పర్వతశిఖరాన్ని చేతితో పట్టుకున్నాడు. కూర్మరూపుడైన హృషీకేశుడు పర్వతాన్ని మోస్తున్నాడు. కేశవుడు హృషీకేశుడు ఇద్దరా ఒక్కరా...!

బ్రహ్మసూత్రభాష్యం గుహాధికరణములో హృదయగుహను ప్రవేశించిన ఆత్మలు రెండు నిశ్చయముగా ఆ విధముగా చేడబడుటచే అనుచోట జీవాత్మ పరమాత్మలనియే భావమని ఆచార్య స్వామి ప్రతిపాదించారు. ఇక్కడ ఒకరు తిప్పుచున్నట్లు ఒకరు మోస్తునట్లు కనబడుతున్న ఆధారాధేయములు రెండూ పరమాత్మయే అయినప్పుడు మోయడం లేదు, తిప్పడం లేదు. ఈ తాబేలు సర్వగతమగు నిత్యచైతన్య స్వరూపుడు. అనాదిసిద్ధము. సనాతనుడు. ఈ విషయము **అన్తరతః కూర్మం భూతగ్ంం సర్పంతం। తమబ్రవీత్। మమ వై త్వఙ్మాగ్ంం సా సమభవత్। నేత్రబ్రవాత్। పూర్వమేవాఽ హమిహాఽ ఽ సమితి। తత్పురుషస్య పురుషత్వం।** అను అరుణమన్త్రము చెబుతోంది. కూర్మరూపమగు ఈ సర్వమును సృష్టించుటచే ఈ సర్వజగత్తు స్వతస్సిద్ధమగు బ్రహ్మమే అను విషయం తస్మాదిదగ్ంం సర్వం బ్రహ్మ స్వయం భ్వితి అను వాక్యము చెబుతోంది. కూర్మము బ్రహ్మమే, కనుకనే వాల్మీకిమహర్షి కమఠ మన్నారు. ఇదే సర్వులచేత కోరబడుస్వరూపమై ఉంది.

రెండవవాడు హృషీకేశుడు. ఇన్ద్రియాధిష్ఠాన దైవము జీవుడు. ఈ జీవుడు వివేకవంతుడైతే సర్వవ్యాపకుడైన బ్రహ్మను పొందుతాడు. లేని సందర్భములో మరల కామ్యానుగుణమైన కర్మలను చేస్తూ సంసారములో కొట్టుకుపోతూ ఉంటాడు. ఇలా చాలా సంవత్సరాలు మథనం జరిగింది. ధన్వన్తరి అప్సరసలు ఉచ్చైశ్రమ వారుణి కౌస్తుభము మరియు ఉత్తమమైన అమృతము బయటకు వచ్చాయి. ఇతర స్థలాలలో ఇంకా చాలానే వచ్చాయి అని చెప్పేరు. దానంజేసి సుఖస్థానాలైన సర్వము అని చెప్పుకోవాలి. ఈ మొత్తం ఉపాఖ్యానం **అసతో మా సద్గమయా। తమసో మా జ్యోతిర్గమయా। మృతోర్మాఽ మృతం గమయ।** అసత్తు నుండి సత్తును పొందటానికి చేసే ప్రయత్నం. ఇక్కడ అసత్తు అంటే అజ్ఞానజములైన సర్వకర్మలు మరియు లౌకిక (ఇన్ద్రియ) జ్ఞానోద్భవములైన భోగములు. ఇవి మృత్యువు అని చెప్తున్నారు. అలాగే చీకటినుండి వెలుగుకు గొనిపొమ్మని ప్రార్థిస్తున్నాడు. ఇక్కడ చీకటి మృత్యువు. శాస్త్రమును ఆధారము చేసుకొని కర్తృత్వభావనతో కర్మలను చేయటం. ఇది శాస్త్రీయమైన అజ్ఞానం. ఇది అసురభావం. ఈ అజ్ఞానమును కప్పివేయునది అంటే అందుండి

బయటకు రానీయనిది తమస్సు. ఇది మృత్యువు. ఈ అసుర భావమునుండి అమరత్వాన్ని పొందించమని మన్త్రార్థము.

లోకంలో ధనాన్ని కోరేవాడు నేను దరిద్రుణ్ణి అని భావన చేసుకుంటాడు. అసలు లేకనో... ఉన్నది చాలకనో.

అదే విధంగా సుఖస్వరూపడైనవాడు తాను దుఃఖిని అని భావించుకొని సుఖాన్వేషణ చేస్తాడు. సుఖాభావము వలన కలిగిన హాలాహల రూప దుఃఖాన్ని చూసి భయపడతాడు. ఈశ్వర స్వరూపుడైన గురువు ఇది దుఃఖమే (విషమే) కాదు... అని నోట్లో వేసుకొని చక్కా పోయాడు.

తిరిగి మథింపు మొదలైంది. సుఖస్వరూపంగా సహకారి భావనగల సాధారణలు (వ్యభిచారీ వృత్తులు) ధన్వంతరి మొదలు కౌస్తుభాదుల వరకు...

దేవాలయం మీది శృఙ్గార శిల్పాల వంటివి.

ఇక్కడితో ప్రయత్నాన్ని నిలిపెస్తే మృత్యువు.

ఇంకా ప్రయత్నాన్ని కొనసాగిస్తే అమృతం.

ఈ విధంగా ఈశ్వరుడే సాధకునియందలి కామము స్వార్థము అను హాలామలమును హరించి, అన్త్యకాలములో (కామనాశూన్యమైన శుద్ధాన్తఃకరణులను) అమృతము వైపు నడిపిస్తాడు. ఈశ్వరుడు ఈ పనిని మహాకాళివైన నీ అనుగ్రహంతోనే చేస్తున్నాడు. నీవే పరబ్రహ్మవై ఉన్నావు.

**కరాలాకృతీన్యాననాన్యాశ్రయన్తీ
భజన్తీ కరేష్వస్త్ర బాహుల్యమిత్థమ్।
జగత్ప్రీణనాయాసురాణాం వధాయ
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౧౦**

భావము– అమ్మా! ఇతరములైన అనేక రకములైన భయఙ్కరమైన ముఖాకృతులు ఆశ్రయం పొందుతున్నాయి. జగత్తును రక్షిస్తూ అసురులను వధించుటకు చేతులయందు అనేక అస్త్రములను ధరించుదానవు. నీవు పరబ్రహ్మయొక్క ఏకైక స్వరూపము.

మానసోకా వాఖ్యా:

కరాలాకృతీన్యాననాన్యాశ్రయన్తీ భయంకరమైన ఆకృతిగల ముఖములు కలది. కరాలాకృతి అంటే కేవలం భయానకత్వానికి ప్రతీక అని మాత్రమే కాదు. కృ (చేయుట) అల్ (విస్తృతంగా వ్యాపించినది) అంటే ఉగ్రకార్యాలను విస్తృతంగా నిర్వర్తించునది. సంహారమును దయారహితముగా చేయునది. కోరలు కలది కనుక కరాలాకృతి.

భయఙ్కరమైన అనేక ముఖములు కలది అని చెప్పుటచేత, లక్షణావ్యాప్తిచే అనేకమైన కళ్ళు నోళ్ళు అనేకమైన చేతులు తొడలు కాళ్ళు పొట్టలు మరియు భయఙ్కమైన కోరలతో వికృతముగా ఉంది. (కరాలం – వికృతం, శఙ్కర భగవత్పాదులు) అని గ్రహించాలి.

ఇటువంటి స్వరూపంతో ప్రపఞ్చాన్ని (ఒక నియమమును అనుసరించి కర్మరు ఆచరించునవి. చాచరము సర్వము) సంతోషపరుస్తూంటావు, మరియు రాక్షసులను (నియమమును అతిక్రమించి చరించు (చరాచరములు) వాటిని) సంహరిస్తూంటావు.

ఇక్కడ మనకు జగన్మాతయొక్క (మహాకాలీ) విశ్వరూప ప్రకటనను చేస్తున్నారు. ఆ మహాకాలీ విశ్వరూపాన్ని దర్శింపచేస్తున్నారు.

మహాకాల స్వరూపిణి అయిన ఈ శక్తి తనే సంతోషపరుస్తుంది తనే సంహరిస్తుంది.

ఇదే భగవద్గీతలో...

అనేక వక్త్రనయనమనేకాద్భుత దర్శనమ్।

అనేక దివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్॥ 11-10

అనేకములైన ముఖములు కన్నులు అనేకములగు అద్భుతమైన విస్మయము గొల్పే దర్శనములు (దృశ్యములు); దివ్యమైన ఆభరణములు, దివ్యమైన అనేకమగు ఆయుధములతో; దివ్యమైన సర్వమూను...

దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్॥11-20

దిక్కులు సర్వమూ వ్యాపించిన అద్భుతమైన ఉగ్రమైన నీయొక్క రూపము చూచి లోకత్రయం వణుకుచున్నది.

రూపం మహత్తే బహువక్త్రనేత్రం మమాబాహో బముబాహూరు పాదమ్।

బహూదరం బహుదంష్ట్రాకరాళం దృష్ట్వా లోకాః ప్రవ్యథితాస్తథాహమ్॥ 11-23

అతిశయించిన ప్రమాణముగల నీయొక్క రూపము, చాలా నోర్లు కన్నులు గొప్పబాహువులు గల ప్రభూ, అనేకములైన చేతులు తొడలు కాళ్ళు ఎన్నెన్నో పొట్టలు అనేకములైన భయంకరమైన దన్తములు (కోరలు)తో వికృతముగా ఉన్న నిన్ను చూస్తూ... సమస్త లోకములు భయకమ్పితులై పోతున్నారు.

దంష్ట్రాకరాళాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానలసన్నిభాని॥ 11-25

ప్రళయకాలంలో లోకములను తగులబెట్టు ప్రజ్వలించే అగ్నిలా, భయఙ్కరమైన కోరలతో ఎన్నో నోర్లతో ఉన్న నిన్ను చూసిన పిదప...

అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావనిపాలసంఘైః।

భీష్మోద్రోణః సూతపుత్రస్తథాసౌ సహాస్మదీయైరపి యోధముఖ్యైః॥

వక్త్రాణి తే త్వరమాణా విశంతి దంష్ట్రాకరాళాని భయానకాని।

కేచిద్విలగ్నా దశనాన్తరేషు సందృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గైః॥ 11-27

ధృతరాష్ట్రుడి కుమారులందరూ, వారి సహచర రాజ సమూహాలతో సహా, భీష్ముడు ద్రోణుడు కర్ణుడు ఇంకా స్వపక్షమున ఉన్న యోధులుకూడా తలక్రిందులుగా నీ భయఙ్కరమైన నోళ్లలోకి త్వరితగతిని ప్రవేశిస్తున్నారు. కొందరి తలలు నీ భీకరమైన కోరలమధ్యలో చిక్కుకొని చూర్ణం చేయబడిన తలలతో తినబడిన మాంసమువలె కనిపిస్తున్నారు.

నానారకముల వేగములు గల నదులు ఏవిధంగా సముద్రములో ప్రవేశిస్తున్నాయో ఆవిధంగా ప్రవేశిస్తున్నారు. బాగా మండుచున్న అగ్నిని వేగముగా ప్రవేశిస్తున్న రెక్కల పురుగులవలె వచ్చి పడుతున్నారు.
లేలిహ్యసే గ్రసమానః సమన్తాత్। లోకాన్సమగ్రాన్వదనైర్జ్వలద్భిః। 11-30
నీయొక్క భయఙ్కరమైన నాలుకలతో అన్ని దిక్కులా ఎన్నెన్నో ప్రాణులను గ్రసించివేస్తూ నీయొక్క ప్రజ్వలిత నోళ్ళతో వారిని కబళించి ఆస్వాదిస్తున్నావు. ఆఖ్యాహి మే కో భగవానుగ్రరూపో ఇంతకూ... ఇంత క్రూరంగా ఉన్నావు. ఎవరు నీవు అంటే... **కాలోఽస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధో** లోకక్షయమును చేసే కాలమును నేనే. అని తన తత్త్వమును చెప్పేరు.
అర్జునుడు చూస్తూన్న ఈయొక్క కృష్ణుని విశ్వరూపము శ్రీకృష్ణుడియొక్క ఇంకొక వ్యక్తిత్వమే అయినా అది శ్రీకృష్ణుడితో అభేదమే. అయినా ఆ స్వరూపము అర్జునుడికి శ్రీకృష్ణుడిపట్ల ఇంతకు ముందున్న సఖ్యభావమును హిరంచి వేసింది. అంతేకాక అర్జునుడికి ఆయనంటే భయం కలుగుతోంది.
అర్జునుడు నేను ధనుర్బాణాలను విడిచి సన్న్యసిస్తానన్నాడు.
పరమాత్మ ఉపాసకునియందు అనుగ్రహ బుద్ధిచే దేవతా గురు పుత్ర మిత్రాది సర్వబంధములు తెగిపోవడం అంటే ఎలా ఉంటుందో భక్తుని అనుభవంలోకి తీసుకుని వచ్చాడు. ఆ అనుభవం ఇష్టానికి భిన్నంగా ఉంది. భరించలేని భయాన్ని కలుగచేస్తోంది. లోకంలోకూడా ఉపాసకునియొక్క సాధనా సామర్థ్యాలకు అనుగుణంగా దేవతా దర్శనానుభవములు దృఢమైన సమదృష్టిని కలుగజేసి తత్త్వ (సత్యస్వరూప) దర్శనమున ఆనన్దానుభవాన్ని పొందుతాడు. దృఢమైన సాధన సమ్పత్తి లేనివానికి ఈ తత్త్వ (సత్యస్వరూపము) దర్శన రూప అనుభవము భయాన్ని చిత్తవిభ్రమమును కలుగజేస్తుంది.
సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్। సభూమిం విశ్వతో వృత్వాత్యతిష్ఠత్ దశాఙ్గులమ్। సర్వోత్కృష్టమైన భగవానుడికి వేలకొలది తలలు వేలకొలది కళ్ళు మరియు పాదములు ఉన్నాయి. ఆయన విశ్వమును ఆవరించియున్నాడు. కానీ దానికన్నా అతీతుడు. సర్వజీవులలోనూ నాడీకన్దమునకు పదివేళ్ళ పైన ఆయన ఉన్నాడు. ఆయనను దర్శించేవారు, ఆయనచే దర్శింపబడేవారు

భీతిల్లి పోయేవారు మరియు భయము పుట్టించేవారు అందరూకూడా ఆ భగవంతుని విశ్వరూపమునందు భాగమే.

భయాదస్యాగ్నిస్తపతి భయాద్ తపతి సూర్యః భయాదిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః। (కఠోపనిషత్తు) ఆ పరమాత్మ విశ్వరూపమును చూసిన అర్జునుడో మీరో నేనో కాదు భయపడటం, నిరంతరం ఆ స్వరూపమును ఎఱుకలో గల అగ్ని గాలి ఇన్ద్రుడు యముడు వీరు భయము కలిగి, వారివారి ధర్మములను నిర్వర్తిస్తున్నారు.

మహాకాలముయొక్క నిజమైన దర్శనము అంటే విశ్వరూపదర్శనము ఈ విధము గానే ఉంటుంది.

మహాచణ్డ యోగేశ్వరీ గహ్యకాలీ
కరాలీ మహాడామరీ చణ్డహాసా।
జగద్గ్రాసినీ చణ్డకాపాలినీ చ
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౧౧

భావము– అమ్మా! మహాచణ్డయోగేశ్వరీ గుహ్యకాలీ, కరాలీ, మహాడామరీ, చణ్డహాసా, జగద్గ్రాసినీ, చణ్డకాపాలినీ ఇవి నీకున్న అనేక నామాలు. కానీ వాస్తవానికి నీవు పరబ్రహ్మయొక్క ఏకైక సిద్ధస్వరూపం. జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణమే సిద్ధి. అటువంటి జ్ఞాననిష్ఠుల దర్శనస్వరూపము అనుభవైకవేద్యమైన ఒకేఒక తత్త్వము నీవే!

మానసౌకా వ్యాఖ్యా:

మహాచణ్డ అంటే ప్రబలమైన క్రోధము. వినాశకర శక్తి, నాశకారి. మానసిక భౌతిక ప్రపఞ్చాన్ని ఖండించు శక్తిగా భావించవచ్చు. ఇది యోగమార్గములో కాపాలిక ప్రణాలికను సూచిస్తుంది. ఇది క్రోధభావననుండి పరమశాన్తికి ప్రయాణము చేసే దారి. **చణ్డ** అనేది అహఙ్కారమును నాశనము చేసే తేజోమయ రూపము. ఇది కుణ్డలినీ శక్తియొక్క పరాకాష్ఠను సూచిస్తుంది. **మహాచణ్డ** ఇది మూలాధార స్థితిలో యథేచ్ఛగా ఉద్భవించే ఉగ్రత.

యోగేశ్వరీ యోగినీ గణముల అధికారిణి. సమస్త యోగశక్తుల నియన్త్రణ కర్త. మూలాధారమున అగ్ని వేధచే మేల్కొల్పబడిన కుణ్డలిని. ఈ శక్తి మహాక్రోధి. సుషుమ్ణామార్గమున ప్రకాశించు సర్వ జగత్తుయొక్క అస్తిత్వమును అంటే జగత్సత్యత్వభ్రాన్తిని నాశనము చేస్తూ, సమాధిస్థితిని పొందించి యోగరూపిణిగా మారుతుంది. యోగేశ్వరీ అనగా **నాద బిన్దు కలా** అన్నింటినీ నియన్త్రించు మహాశక్తి.

గుహ్యకాలీ అతిరహస్యమైనది. వేదములుకూడా నిన్నుగూర్చి చెప్పుటకు సమర్థములు కావు. ప్రకటమూన కాలమనే భావనను అధిగమించిన శక్తి. **గుహ్యకాలీ** అనగా మహిరంగముగా తెలియని (ప్రత్యక్షాది ప్రమాణములకు అందనిది) అన్తర్గత యోగానుభవముతో మాత్రమే గ్రహించదగిన మూలప్రకృతి.

గుహ్యకాలీ అనేది తురీయాతీత స్థితికి ప్రతీక. కాలము, కార్యము, కారణము అనే త్రికమును దాటి శూన్యాత్మక నిర్విచార స్థితిలో అనుభవమైయ్యేశక్తి.

కరాలీ ఉగ్రమైన దంతముల వలన (కోరలవలన) భయఙ్కరముగా కనిపించేది. ఇది గుహ్యకాలియొక్క క్రియాశక్తి రూపము. శబ్దబ్రహ్మరూపముగా ఓఙ్కారము యొక్క నాదాన్తమునకు తీసుకొని పోవు శుద్ధచిద్రూపము కరాలీ. **కరాలీ** అనునది నవకాలికలలో ఒక రూపము. ఈ శక్తిని అగ్నిరూపిణిగా పరిగణిస్తారు.

మహాడామరీ కాల నాశకత్వాన్ని (మహాయుగాది కలాకాష్ఠా పర్యన్తము ఖణ్డకాలము) సూచించే శక్తి. మహాడామరీ అనన్తమైన సర్వవ్యాపకమైన అఖణ్డ మైన కాలమును మూలప్రకృతిని అనుగ్రహించు మహాశక్తి. ఆత్మజ్ఞానంతో కాలమనే భావనను అశేషముగా దహించి, తాను ఒక నిర్వికారంగా స్థిరమయ్యే ప్రబలశక్తి. ఇది శబ్దతత్త్వాన్ని బంధించి దానిని ఉద్దీపనము చేసి మౌనములో విలీనము చేసే తాన్త్రికప్రకియ.

ఈ మహాడామరీతత్త్వము శామ్భవీముద్రాభ్యాసం వలన సిద్ధిస్తుంది. దీనివలన శబ్దసృష్టిని దాటి మనస్సును నిశ్చలము చేసి, మనోనిశ్చలత్వము ద్వారా బ్రహ్మలీనస్థితిని అనుభూతి చెందటం.

మహాడామరీ ఉగ్రశక్తి. ఇది నవకాలికలలో ఒకటి. మూఢత మాయా కాలతత్త్వం వంటి బన్ధకాలను హరించే మహాశక్తి. శబ్దబ్రహ్మమను భ్రాన్తినుండి, ఈ శబ్దబ్రహ్మ మూలముగా ఏర్పడే జగత్తునుండి విముక్తిని ఇచ్చునది. ఇది కాళీతన్త్రములో శబ్దబ్రహ్మలయ ప్రక్రియకు సఙ్కేతము. శబ్దాన్ని నిశ్చల బిన్దువులో లీనం చేసే అనుభవస్థితి. శామ్భవీముద్ర కేవలము ఒక భౌతికముద్ర కాదు. ఇది చైతన్య స్థితి. ఈ ముద్రా సాధన **మహాడామరీ** అనుగ్రహాన్ని సిద్ధింపచేయటం ద్వారా... దృష్టి స్థిరత్వము, ఇన్ద్రియనిగ్రహముతో కూడిన **సాక్షిత్వబోధ**. శబ్దం పుట్టేముందు ఉండే అవికల్ప శుద్ధచైతన్యస్థితి అనుభవంలోకి వస్తుంది.

యత్ర శబ్దో న భవతి తత్ర డామరీ వసతి ఎక్కడ శబ్దప్రవాహం లేదో, అక్కడే డామరీతత్త్వం విరాజిల్లుతుంది. ఈ ముద్రా సాధకుడు శబ్దమునకు పూర్వస్థితి అయిన **పరావాక్ స్థితిలో** ప్రవేశిస్తాడు. అర్థవ్యూహాలు శబ్దసృష్టి ఏ నిరాకారంలో

లీనమైపోతున్నాయో అదే మహాడామరీ శక్తి. అభినవగుప్తుడు తన తన్త్రాలోకంలో శామ్భవీముద్రద్వారా వాక్ప్రవాహం లీనమయ్యే స్థితిలో మహాడామరీశక్తి అనుభవం అవుతుంది అని చెప్పేరు.

చణ్డహాసా ఉన్మత్త (ఉన్నత) ఆనన్దస్వరూపము. ఇది పరమానన్దస్థితి. మహాకాళీ ఘోరరూపాన్ని (తత్త్వికతను) దర్శించిన తరువాత అనుభవంలో ఏర్పడే స్వచ్ఛత. ఈ స్వరూపం సంసారులకు ఘోరము, భయఙ్కరము చిత్తవిభ్రమ హేతువు. మరి ఈ ఉన్మత్తానన్దావస్థ ఎవరిది అంటే...

స్వేచ్ఛా విహారము, స్వతన్త్రజీవనము, తాను పొందిన బ్రహ్మ సంస్మరణము (తత్త్వానుభూతి) కలవానిది. ఇతడు సామ్బరుడుగా దిగమ్బరుడుగా ఉండవచ్చు. ఇతనికి ధర్మాధర్మముల భేదముగానీ ఇది పవిత్రము, ఇది అపవిత్రము అనిగాని, మేధ్యామేధ్యములు అనే భావనగాని లేనివాడు.

ఇతని జీవిత చర్యలే సాంగ్రహణేష్టి, అశ్వమేధ యాగాల నిర్వహణ. ఇతని జీవితం మొత్తం పరమ యజ్ఞంగా మారిపోతుంది. ఇతనే మహామఖుడు. మహాయోగి. మనకు ఇతని జీవితం చిత్రంగా అనిపిస్తుంది. ఇతను మూఢుడిలా ప్రపఞ్చ విషయాలలో మునిగిపోడు. ఎలా అంటే అన్ని రసములను సమానంగా గ్రహించు సూర్యునకు ఏ రసమందు విశేషమైన రాగము లేనట్లుగా; సర్వభక్షకుడైన అగ్నికి ఏ పదార్థమునందు విశేషమైన రాగము లేనట్లుగా పరమశుద్ధుడై ఉంటాడు.

ఇతడు అనాసక్తుడై విషయాలను అనుభవిస్తాడు. జీవితాన్ని యజ్ఞంలా తపస్సులా సాగిస్తాడు. స్వస్వరూపానుసన్ధానముచే ప్రపఞ్చస్వరూపమును బాగుగా విచారించి దండ కమండలు కటిసూత్ర కౌపీన ఆచ్ఛాదనలను, స్వవిద్యుక్త క్రియాదికములను సర్వమును విడిచిపెట్టి; దిగమ్బరుడైగాని, వివర్ణము జీర్ణము అయిన వస్త్రమును కలిగిగాని, అజినమునుకూడా అమన్త్రకముగా విడిచి, క్షౌరాభ్యంగ స్నాన ఊర్ధ్వపుండ్రాదికములను కూడా విడిచి, వైదిక లౌకిక కర్మలను విడిచి; పుణ్యాపుణ్యములు శీతోష్ణములు, మానావమానములు, సుఖదుఃఖములు విసర్జించి; దేహాది వాసనాత్రయము (లోకవాపన, శాస్త్రవాసన దేహవాసన) ను, అరిషడ్వర్గమును దహించి తన

దేహమును దుర్గంధభూయిష్టమైన పీనుగువలె చూస్తూ, దొరికిన దానితో తృప్తిపడుచు ప్రాణములను నిలుపుకుంటూ, తన సర్వవిద్యాపాండిత్య ప్రపఞ్చాన్ని భస్మమొనర్చి, తను రహస్యంగా ఉంటూ, దుఃఖమునకు వ్యాకులత, సుఖమునందు ఆనందము లేనివాడై, రాగమునందు నిఃస్పృహ కలిగి, వర్ణాశ్రమాచారములను వదిలిసర్వదా సంచారశీలుడై కేవలము దేహధారణార్థమైన స్వల్ప ఉపకరణములను కలిగి బాలుడివలె ఉన్మత్తుడివలె పిశాచమువలె సంచరిస్తూ నిరాలమ్బధ్యానమును ఈశ్రయించినట్టి వాని ఆనందము లేదా అట్టివానికి మాత్రమే అనుభూతమగు ఆనన్దస్వరూపిణి **'చణ్డహాసా'**.

జగద్గ్రాసినీ జగత్తును కబళించునది. సృష్టి స్థితి లయములను తనలోనే చేర్చుకునే శక్తి. ఇది లయకారిణి. అన్తిమ సమాధిస్థితి. పఞ్చకోశాలు శరీరభావన అంతా నశింపచేసి "అహమేవ" స్థితిని మాత్రము మిగుల్చునది. **చణ్డకాపాలినీ** ఉగ్రముగా ధ్వనించే కపాలాలను ధరించినది. తీవ్రమైన కార్యములచేత కపాలిని – కపాలములను ధరించునది. కపాలము అంటే శిరస్సును రక్షించునది. ఏది జరాది వికారములచే పీడింపబడుతుందో దానిని రక్షించునది. అంటే కాలగతమున ప్రాప్తించు సర్వవికారములు లేకుండా చేయునది. ఎలా అంటే... తన ఉగ్రకృత్యముల ద్వారా అంటే రాగద్వేషములకు అతీతంగా కాలగతమైన సర్వవికారములనుండి ఉపాసకులను రక్షించునది. అలా రక్షింపబడిన వాని శిరస్సులనే మాలగా ధరించినది. (తనను తెలిసిన వారిలో బ్రహ్మకన్న శ్రేష్ఠుడు లేడు. కనుక ఆ బ్రహ్మయొక్క ఆయువు తీరిన పిదప ఆ బ్రహ్మకపాలమునే మాలాగా ధరించినదని తంత్రములందు చెప్పేరు) దానంజేసి కాలాతీత స్థితిని పొందిన సిద్ధులు ఆ శక్తిస్వరూపానికి హారమువలె చుట్టూ ఉన్నారు అని. ఇటువంటి గుహ్యకాలీ! కేవలము నీవే పరబ్రహ్మ రూపమున స్థిరముగా ఉన్నదానవు. భయంకరము శక్తిమయము విచిత్రము అనిపించే ప్రకృతియొక్క విభిన్నరూపాలన్నీ చివరికి నీలోనే కలిసిపోతాయి. నీవే పరబ్రహ్మ. నీవే ప్రకృతి. నీవే శివత్వం. **"త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా"** అనేది తన్త్ర మన్త్ర యన్త్ర భయఙ్కర రూపాలవల్ల శుద్ధత సాధించిన తరువాత ఏర్పడే స్వరూపజ్ఞానాన్ని తెలియజేస్తుంది.

రవన్తో శివాభిర్వహన్తీ కపాలం
జయన్తీ సురారీన్ దమన్తీ ప్రమత్తాన్।
నటన్తీ తపన్తీ చలన్తీ హసన్తీ
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ ౧౨

భావము– శివాశక్తులు (శివుని శక్తి విశేషాలు) వెంటాడుతూ అరుస్తూ, చేతిలో కపాలము ధరించి దేవతా శత్రువులను జయిస్తూ దుష్టులను నాశనం చేస్తూ నృత్యం చూస్తూ, తపింపజేస్తూ కదులుతూ నవ్వుతూన్న నీవే పొందదగిన పరబ్రహ్మయొక్క ఏకైక సిద్ధస్వరూపం. అనుభవైకవేద్యమైన ఒకేఒక తత్త్వము.

మానసోకా వ్యాఖ్యా:

రవన్తో శివాభిర్వహన్తీ కపాలం శివుడు అంటే గుణాతీతుడు. నిర్వికారుడు. త్రిగుణాతీత నిర్వికార తేజస్సు శివా అనునది. ఈ స్థితిలో సృష్టిలేదు. కేవలం శుద్ధస్ఫటిక సన్నిభమైన స్వరూపము 'శివము'.

యదేతత్ హృదయం మనశ్చైతత్ సంజ్ఞానమాజ్ఞానం విజ్ఞానం మేధా దృష్టి ధృతిర్మతి మనీషా జూతిః స్మృతిః సఙ్కల్పః క్రతురసుః కామో వశః ఇతి సర్వాణ్యేతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవన్తి. ప్రజ్ఞానం బ్రహ్మ।

ప్రజ్ఞానమునకే కామమని పేరు. కామము అంటే సృష్ట్యున్ముఖమైన శివుని సఙ్కల్పశక్తి. శివుడంటే జగత్తు (సంసారము) నకు ముందువాడు.

జగతః సిసృక్షావాన్ ఈశ్వరః కామపద వాచ్యః జగత్తు సృష్టించాలనుకునే సంకల్పము (కామము) తో కూడినవాడు **కామః**.

అకామోహి శివః। తస్యైవ అవిభాజ్యా శక్తిః 'శివా' శివుని అవిభాజ్య శక్తి శివా. **చణ్డికా శక్తిరత్యుగ్రా శివా శత నినాదినీ।** శివా స్వరూపము అత్యుగ్రము. శివమును చేయునది. మంగళములను చేయునది కనుక శివా. అంటే జగత్తునందు సత్యత్వ భ్రాన్తిని తొలగించుట. అంటే సంసారమునుండి ఉ ద్ధరించుట.

శివ – అకామ (పూర్వం సంసార మండలమునందు (జగత్తు) నామరూపము

లచే విభాగము చేయబడిన నానాత్వము ఏదీ కూడా లేని, మనస్సు మొదలగు వాటి పుట్టుకకు ముందు) శక్తులతో కలిసి స్వస్వరూపానందములో నివసించే శుద్ధచైతన్య తత్త్వములు. వీటిని బృహదారణ్యక శ్రుతి **నైవేహ కిఞ్చనాగ్ర ఆసీన్మృత్యునైవేద మావృతమాసీత్** మృత్యువు అంటే; తన్త్రములు **ఘోర** స్వరూపములు అన్నాయి.

ఆద్యాకాళీ విభూతులు పది వేర్వేరు శక్తులుగా కాళీ తారా త్రిపురసున్దరీ భువనేశ్వరీ భైరవీ ఛిన్నమస్తా ధూమావతి బగలాముఖీ మాతఙ్గీ కమలాత్మికా మరియు చిన్తామణికాళీ సిద్ధిదాత్రీకాళీ కామకళాకాళీ హంసకాళీ గుహ్యకాళీ

మహేశ్వరీ చ చాముణ్డా వారాహీ నారసింహికా

వజ్రాఙ్గీ వజ్రకఙ్కాలీ నృముణ్డా ప్రగ్విణీ శివా॥ ఇవికాక

కాళరాత్రి, మహారాత్రి, రాత్రి, దారుణారాత్రి అనునవి.

కాళికా ద్వివిధా ప్రోక్తా కృష్ణారక్తా ప్రభేదతః।

కృష్ణాతు దక్షిణా ప్రోక్తా రక్తాతు సున్దరీ మతా॥

లలితాత్రిపుర (షోడశీ)కి రక్తకాళీ అని సంజ్ఞ. తిథులకు అధిదేవతలైన నిత్యాదేవతలు మహాకాల (షోడశీకలా) స్వరూపిణిని సేవిస్తాయి. ఇవి శివా స్వరూపాలు. ఈ శివశక్తులు కపాలం చేతపట్టి సంతోషంతో ఉల్లాసముగా శబ్దాన్ని చేస్తున్నాయి. కపాలం అంటే శిరస్సును రక్షించునది. అంటే మన ఆలోచనలకు బుద్ధికి అహ్కారాది గుణములకు సంకేతము. శుద్ధచైతన్య శివశక్తులు ప్రపఞ్చముయొక్క క్షణభంగురతను, బుద్ధి అహఙ్కారాది సాంసారిక వాసనలు హరింపబడునట్లు, బ్రహ్మతత్త్వాన్ని జగత్ప్రళయాన్నిగూర్చి ఉల్లాస ముగా పాడుతున్నారు. (బిన్దునాదకళాతీత స్థితి) శుద్ధచైతన్యముతో కూడిన రుద్రనాదము ద్వారా దేవి... బుద్ధి అహఙ్కారాదికమైన మానసిక సంస్కారము లను (కపాలాన్ని) హరించివేస్తుంది. ఇది కాపాలిక సాధనామార్గము. అహఙ్కారమును తీసుకుని ఆహుతి చేపే స్వరూపము.

జయన్తీ సురారీన్ దమన్తీ ప్రమత్తాన్ జయన్తీ సురారీన్ దేవతలకు శత్రువులైన రాక్షసులను జయించిన దానవు (విజయినీ).

ద్వయా హ ప్రాజాపత్యా దేవాశ్చాసురాశ్చ సురులు అసురులు ఇద్దరూ ఒకరి

సంతానమే. ప్రజాపతి అంటే యజమాని. దేవతలు అంటే యజమానియొక్క ప్రాణములు, వాక్కు మొదలగు ఇన్ద్రియములే. **శాస్త్రజనిత జ్ఞానకర్మభావితాః ద్యోతనాద్ దేవాః భవన్తి। తే ఏవ స్వాభావిక ప్రత్యక్షానుమాన జనిత దృష్ట ప్రయోజన కర్మ జ్ఞాన భావితాః అసురాః। స్వేషు ఏవ అసుషు రమణాత్।** శాస్త్ర విహితమైన ఉపాసన కర్మలచే సవస్కృతములైన ఇన్ద్రియములు సత్త్వగుణ ప్రకాశము కలవిగా నుండుటచే దేవతలు అనబడుచున్నాయి.

స్వభావ (అజ్ఞాన) సిద్ధములైనట్టియు, ప్రత్యక్ష అనుమానాది ప్రమాణములచే కంటికి కనబడు ప్రయోజనము గల కర్మజ్ఞానములచే ప్రసిద్ధమైనప్పుడు ఆ ఇన్ద్రియములే అసురులు. తమ ప్రాణములయందు తామే రమించుటవలన అసురులు. తమ శక్తిని (స్వార్థం) కొరకు మాత్రమే ఉపయోగించువారు అసురులు. వీరు సంఖ్యాపరంగా ఎక్కువగా ఉంటారు.

దమన్తీ ప్రమత్తాన్ ఇక్కడ మదించిన వాడు అంటే కేవల అసురగణాలు కాదు. జ్ఞానమును నాశము చేసే మనస్సులోని హింస అసత్యము భోగలంపటత్వ వికారములు. పఞ్చకోశాన్తర్గత శక్తి వికారాలు కూడా. ఇటువంటి ఇన్ద్రియములతో కూడిన బలీయమైన మనస్సును నిగ్రహించునది. ఈ శక్తి పాపాన్ని మాత్రమే నశింపచేయదు–

జ్ఞానావరోధకమైన అనవసరమైన మానసిక స్థితులను కూడా వదిలిస్తుంది. ఈ క్రియలు యోగిలో తీవ్రవైరాగ్యమును అర్థకామములనుండి విముఖతను కలిగిస్తాయి.

నటన్తీ తపన్తీ చలన్తీ హసన్తీ అను నాలుగు రకముల ఉపాసనాలను లేదా ధ్యాన పద్ధతులను విధిస్తున్నారు.

నటన్తీ నాట్యము చేయునది. కాళీ తాణ్డవము. కాళీ తాణ్డవమనేది నివృత్తి ప్రత్యాహార లయ స్థితులకు సఙ్కేతము. నాట్యము అంటే...

నానా భావోపసమ్పన్నం నానావస్థాన్తరాత్మకమ్।

లోకవృత్తానుకరణం నాట్యమేతన్మయా కృతమ్॥ అనేక భావములతో సమృద్ధమైనది. వివిధ అవస్థలతోకూడి, లోక వ్యాపారమున నుకరించుటయే నాట్యము. గుహ్యకాలిక నాట్యమునకుముందు ఆవిర్భవించినది. హృదయగుహ

లో మనోఫలకముపై ఆవిష్కరింపబడు స్వీయవక్తీకరణ మరియు సజ్కేతభాషణ అన్నది ప్రాథమిక అవ్యక్త కళారూపము. దీనిని యోగులుకాని సామాన్యులు దర్శించలేరు. బహిర్వ్యక్త కళారూపము నాట్యము – స్పన్దన. ఇది లోకవ్యాపారా నుకరణ రూపముగా ఉంటుంది. జగద్వ్యాపారము అంటే సృష్టి స్థితి లయములు. కాళీ (ఆద్యాశక్తి) లాస్యతాణ్డవకేళీ వినోదిగా స్తుతింపబడుతోంది. **నటన్తీ** నృత్త నృత్య నాట్య సమష్టి. నృత్తము నందు అంగ ప్రత్యంగముల కదలికలు మాత్రమే. ఇది రసభావ విహీనమైన స్వాభావిక గతులు.

నృత్యము భావాశ్రయన్తు నృత్యం స్యాత్ అని భావముతో కూడినది. రసభావములతో కూడిన ఆంగికాభినయము నృత్యము.

నాట్యము నృత్త నృత్యములతో కూడిన గీతము. ఈ నాల్యము త్రైలోక్య భావానుకీర్తనము అంటే మూడు లోకాలలో ఉన్న సర్వజనుల – సర్వజీవుల సర్వభావాలను ఇది ప్రకాశింపజేస్తుంది. ఆద్యాభగవతీ లాస్యతాణ్డవకేళీ ధ్యానములో ఉన్న యోగికి సర్జగత్తునందు అణువణువు లాస్యతాణ్డవకేళీ దర్శనమే.

మేఘావృత ఆకాశం క్రింద నెమలి నాట్యము...

ఆవుదూడ అంబారవముతో చెంగుచెంగున వేసే గెంతులు...

పక్షుల కిలకిలారావాలతో చేసే నృత్యాలు...

మందనుండి తప్పిపోయిన దూడకోసం తల్లిచేయు అంబారవము...

సహచర వాయసమో వానరమో పోతే కోలాహలంతో అవి చేసే రోదన...

మలయమారుతాలు..., మేఘగర్జనలు..., సముద్రపు ఘోషలు...

ఉత్సవ సమయ సంకీర్తనలు... ప్రేత సన్నిధిలో రోదనలు...

చూసే కన్ను (జ్ఞాననేత్రం) ఉండాలేకాని, ఇలా ప్రకృతియందు సమస్తము కాళీ లాస్య–తాణ్డవమే.

ఈ నాట్యదర్శనము జీవుల సంస్కార విశేషమును అనుసరించి ఆయా జీవుల యందు వారి మనోవాసనలకు అనుగుణముగా దర్శింపబడుతుంది. ఒక చలనచిత్రమునో నాటకమునో చూస్తూన్న ప్రేక్షకుడు, తన సంస్కార విశేషముచే ఏవిధంగా ఆ చలనచిత్రమునందలి విషయములు తను దర్శించి అనుభూతి

చెందుతున్నాడో, అదే విధంగా... ప్రేక్షకుని సంస్కారాన్ని బట్టి...
కొందరు నాయకుని ఇష్టపడతారు.
కొందరు ప్రతినాయకుని, మరికొందరు నాయికను ఇష్టపడుతూంటారు.
కొందరు అందులో విలువలను ధర్మమును చూస్తారు.
కొందరకు ఉద్రేకపూరితమైన యుద్ధాలు కుయుక్తులు కనబడతాయి.
కొందరు రూపురేఖావిలాసాలు వస్త్రాలంకరణలు దగ్గర అగుతారు.
మరికొందరు శృఙ్గార రసానుభవాస్వాద మనస్కులై ఉంటారు...
అదేవిధంగా యోగులు ఉపాసకులు సాధకులు వారివారి సాధనానుభవ స్థాయినిబట్టి గుణనిధియై అనంతంగా ప్రకాశిస్తూన్న ఆ కాళీరహస్యతత్త్వాన్ని దర్శిస్తూంటారు.
ధర్మప్రవృత్తిగలవారికి ధర్మనిష్ఠయే ప్రకాశిస్తూంటుంది.
సంపన్నులు సృష్టిరచనా విలాసలోని సంపన్నతను సమృద్ధిని చూస్తారు.
భోగోలు కామప్రవృత్తిని దర్శిస్తారు. ఉద్రేకపూరితులు ధైర్యాన్ని సాహసాన్ని, యోగులు జ్ఞానులు ఇన్ద్రియనిగ్రహమును కలిగి వైదుష్యాన్ని దర్శిస్తూ సత్యమును అనుభూతి చెందుతూ ఉంటారు.
ఈ సమస్తము అతిరహస్యమైన కాళీ లాస్య-తాణ్డవ లక్షణాత్మకమైన నాట్యము. లాస్యము అనురాగాత్మకము మనోల్లాసహేతువు లీలా హేలా హావ భావములచే ప్రకాశిస్తూంటుంది. తాణ్డవములో విధ్వంసము, ప్రళయరచనా విలాసరూప ఉద్ధతి దర్శింపబడుతూ ఉంటుంది. ఈవిధంగా ఉన్నదానిని రుద్రతాణ్డవమని, అనురాగాత్మకము మనోల్లాసహేతువు లీలా హేలా హావ భావపూర్ణమైన దానిని ఆనన్దతాణ్డవము అని చెప్తారు.
ఇక్కడ **నటన్తీ** శబ్దము ఓ కళాకారిణిని చెప్తోంది. నాట్యంలో పాల్గొనే నటుడు అభినేతా నర్తకుడు గాయకుడు వాదకుడు మెదలైన వారిని సమగ్రముగా కలిపే పదము. అంటే కళాకారిణి శరీర వాక్సామర్థ్యాలు భావప్రకటన శబ్దనినాదం లయ తాళం సంగీతము మొదలగు వాటి సమష్టి అయిన నటనచే ప్రేక్షకులకు ఏవిధంగా రసానుభూతిని కలిగిస్తుందో...
గుహ్యకాళీ స్వరూపముకూడా అనురాగాత్మకము మనోల్లాసహేతువు లీలా

హేలా హావ భావములచే ప్రకాశిస్తూనే, విధ్వంసము, ప్రళయరచనా విలాసరూప ఉద్ధతి ప్రదర్శిస్తూ ఆశ్రితులను సంసార (జగత్) సత్యత్వ భ్రాన్తినుండి బయటకు లాగి బ్రహ్మానన్ద రసానుభూతిని అనుభవింపజేస్తుంది.

కళాకారుడు ఏవిధంగా అయితే నటనకు అనుకూలమైన శరీరధర్మ సంపన్నుడై ఉండాలో గుహ్యకాళీ పరదేవతా ధ్యానపరులు యోగులు ఉపాసకులు ఆశ్రితులు సాధన చతుష్టయ సంపత్తిని వివేకము తీవ్రవైరాగ్యము షట్సంపత్తి (శమ దమ ఉపరతి తితీక్ష సమాధానము శ్రద్ధ) ముముక్షుత్వము వీటిని పూర్ణంగా కలిగి ఉండాలి. అంటే వీడు స్థితప్రజ్ఞుడైన జీవుడు.

సత్యదర్శనానికి నటన్తీ తపన్తీ చలన్తీ హసన్తీ అను నాలుగు ఉపాసనా లేదా ధ్యాన పద్ధతులు చెప్పేరు.

నాట్యము మనస్సు హావ భావ రస స్థితి ప్రేరణల మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. గుహ్యకాళీ లాస్య–తాణ్డవ ధ్యానం సమస్తబ్రహ్మాణ్డముల ఉత్పత్తి స్థితినాశముల మధ్య త్రిగుణాత్మక సంబంధాన్ని దర్శింపజేస్తుంది. ఇది **పాదోఽస్య విశ్వాభూతాని** అని ఈ నామరూపాత్మక విశ్వము పరమాత్మయందలి ఒక పాదము అను అనుభవాన్ని ఇస్తుంది. అంటే ఆత్మానాత్మ వివేకజ్ఞానానన్తరము **మోహోఽయం విగతో మమ** మోహము తొలగినవాడై విశ్వరూప సందర్శన యోగము (ఇది బృహదారణ్యకోపనిషత్తు ఖిలకాణ్డాన్తర్గత బ్రాహ్మణముల వంటిది. **విశ్వరూప సన్దర్శన బ్రాహ్మణమ్** అనవచ్చు) అనుభవంలోకి వస్తుంది. అర్జునుడు (జీవుడు) శ్రీకృష్ణుని (ఈశ్వరుని) విశ్వరూపాన్ని దర్శించి అన్ని రకాల రూపాలను చూసి విభ్రమమును పొందుతాడు. ఇది హావ భావ రస స్థితి ప్రేరణల అనుభూతి. విశ్వరూప దర్శనములో కూడా అద్భుత ఆశ్చర్య భయానకాది రసానుభవాలు ఉన్నాయి. కనుకనే ఉపాసకులు తాదాత్మ్యస్థితిలో కంపన మోహన రోదనాది చేష్టలను చేస్తూ ఉంటారు. ఈ తాత్త్వికతకు నాట్యరస సిద్ధాంతాలు ప్రతిబింబాలు. శ్రీకృష్ణుడు సారధి పాత్రలో నటిస్తూన్నప్పటికీ తాను **కాలః అస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః మమైతాన్సర్వాన్ నిహనిష్యే** అంటాడు. I am time, the great destroyer of the worlds అని చెప్పి జగన్నాటకానికి తానే కర్త కర్మ స్వరూపము అని వెల్లడిస్తాడు. శివపారమ్యాన్ని అగింకరించు

వారలకు నటరాజతత్త్వము సృష్టి స్థితి లయ తిరోధాన అనుగ్రహరూపంగా ఈ తత్త్వమునే దర్శింపచేస్తుంది.

భావాలు రసాలు అభినయ వైవిధ్యాలలో నైపుణ్యము ఉన్న వాడు, పాత్ర నిర్వచనము, గానము నాట్యరూపణలో సిద్ధహస్తుడైన వాడే కళాకారుడు. ఈ కళాకారుడు ఒక యోగి. తన సాధనద్వారా శరీరమును మనస్సును అన్నిటినీ ఒకే లక్ష్యమునందు నిలిపి, **రసో వై సః** అనే ఆనన్దానుభూతిని ప్రేక్షకుల హృదయాలలో ప్రవహింప చేస్తాడు. ప్రదర్శనానంతరము ఆ పాత్రతో ఏవిధమైన సంబంధము లేనివాడు. ఇక్కడ గుహ్యకాళీ ధ్యానావస్థలో **రసో వై సః** అనే బ్రహ్మానుభూతి సాధకుల ఉపాసకుల హృదయాలలో ప్రవహిస్తుంది. సృష్టి స్థితి ప్రళయము అను జగద్వ్యాపారమును నిర్వహిస్తూన్నప్పటికీ వాటితో రాగద్వేష రూప సంబంధము లేనిది.

తపన్తీ తపింపచేయునది. ఇది జగద్వ్యాపారము (సృష్టి స్థితి లయము) ను క్రమబద్ధీకరించునది. జీవుడు క్రమశః బ్రాహ్మీస్థితిని ఆనన్దానుభవమును పొందుటకు చేయు కృచ్ఛ్రచాన్ద్రాయణాది వ్రతమార్గాన్తర్గత శక్తి. భవపాశములను దగ్ధమొనర్చు దివ్యమైన యోగాగ్ని. ఇక్కడ **అనాఖ్యా గుహ్యకాళిని** చేరు రహస్యమైన తపస్సును చెప్తున్నారు. ఇది బృహదారణ్యకమునందలి తపోబ్రాహ్మణము అను ధ్యానమార్గాన్తర్గత శక్తి. పాపఘ్ని. **ఏతద్వై పరమం తపో యద్వ్యాహిత స్తప్యతే పరమగ్ం మైవ లోకం జయతి య ఏవం వేద** వ్యాధిగ్రస్తుడు జ్వరాది రోగములచే పీడను పొందుట ఏదికలదో, అది గొప్ప తపస్సని భావనచేయాలి. తపస్సునందు, రోగమునందు శరీరపీడ సమానము. కావున శరీరపీడ సమయమున రోగమును, భగవంతుని, ఇతరులను దూషించకుండా ఇది కర్మక్షయకారకమైన తపస్సుగా భావన చేస్తే, వ్యాధిపీడా జన్యమైన దుఃఖమే పాపక్షయకారకమై తపస్సు అవుతుంది. ఈ విధంగా భావన చేస్తే సర్వోత్కృష్టమైన పుణ్యలోకములను పొందుతాడు. ఇంకా ఎలా భావన చెయ్యాలో చెప్తున్నారు. **ఏతదద్వై పరమం తపో యం ప్రేతం అరణ్యగ్ం హరతి** మరణించిన నన్ను ప్రేతకర్మకై అరణ్యమునకు (శ్మశానమునకు) తీసుకుపోతారు. ఈ భావన తపస్సు. ఎందుకంటే **గ్రామాద్ అరణ్య గమనం**

పరమం తపః ఇతి ప్రసిద్ధమ్ అని వానప్రస్థము గొప్ప తపస్సని ప్రసిద్ధమే కదా! అరణ్యమునకు (శ్మశానమునకు) తీసుకుపోవుటను గొప్ప తపస్సు అని భావన చేసినవాడు సర్వోత్కృష్టమైన లోకములను పొందుతాడు.

ఈ విధంగా మృతదేహమును అగ్నియందు ఉంచుటను భావన చేయుట గొప్ప తపస్సు. ఎందువలన అంటే ఇది అన్త్యేష్టితో సమానమగుటచే సర్వోత్కృష్ట మైన లోకములను పొందును. ఈవిధమైన తపస్సు తీవ్రమైన వైరాగ్యమును పెంపొందించి, భార్యా పుత్ర మిత్ర బన్ధు శత్రువుల మొదలు వృక్ష పశు పక్ష్యాదుల వరకు మనంత మనముగా వేసుకున్న సర్వబంధములు దగ్ధమైపోయి తద్వారా పాపములు హరింపబడి, తన తత్త్వస్వరూపమును అనుగ్రహించు చున్నది. ఇది బృహదారణ్యకమునందలి ఖిల భాగమునందు తపోబ్రాహ్మణము అను ధ్యానమార్గముగా చెప్పబడుటచే వైదికమైంది. దీనినే తన్త్రములు **ఘోరము** అంటున్నాయి.

చలన్తీ సుషుమ్ణా మార్గమందు సర్వత్రా చలించే శక్తి. కుణ్డలినీ (మెఱుపు) స్వరూపము. నిత్యప్రవాహ రూపమైనట్టిది. విద్యుద్రూపిణి (మెఱుపు).

ఈ ఉపాసన చిత్తముయొక్క చఞ్చలత్వాన్ని హరించే శక్తి. ఇది **విద్యుద్బ్రాహ్మణమ్** సత్యబ్రహ్మోపాసన. **విద్యుద్ బ్రహ్మేత్యాహుః** అని చెప్తోంది. విద్యుత్ (మెఱుపు) ను బ్రహ్మగా భావన చెయ్యమని చెప్పింది. విద్యుత్ అంటే చీకటిని ముక్కలు చేయునది అని. విద్యుత్ బ్రహ్మయని ఎవరు ఉపాసన చేస్తారో వానికి బ్రాహ్మీస్థితికి ప్రతికూలమైన పాపములను ఉపాస్యబ్రహ్మ (అనాఖ్యాకాళీ ఆద్యాభగవతీ) నశింపచేయును. ఎందుకంటే విద్యుత్తే బ్రహ్మ. అదే చలనశక్తి. ఇలా ఉపాసించినవాడు అనురూపమైన ఫలమును పొందుతాడు.

హసన్తీ మన్దహాస స్వరూపిణి. అనుగ్రహ స్వరూపము. అనన్దావస్థ. సమభావంతో ఉన్న పరమోన్నత దర్శన స్థితి. అంటే విశుద్ధసత్త్వ స్వరూపము. విశుద్ధసత్త్వ మంటే... **విశుద్ధసత్త్వస్య గుణాః ప్రసాదః। స్వాత్మానుభూతిః పరమా ప్రశాన్తిః। తృప్తిః ప్రహర్షః పరమాత్మనిష్ఠా। యయా సదానన్దరసం సమృచ్ఛతి॥** మనోనైర్మల్యము, స్వాత్మానుభవము, గొప్పశాన్తి, తృప్తి, ఆనన్దము. దేనిచే సదా అనన్దరసమును పొందునో, అట్టి పరమాత్మయందు ఏకాగ్రనిష్ఠ. ఇవి

విశుద్ధమగు సత్త్వగుణముల యొక్క లక్షణములు. విశుద్ధత్వం అంటే రజోగుణ తమోగుణ సంపర్కములేని కేవల సత్త్వగుణము. దీనివలన మనస్సు నిర్మలంగా ఉంటుంది. నిరతిశయమైన, ప్రకృష్టమగు శాన్తావస్థలో నిత్యానన్దరసానుభవ రూప పరమాత్మ నిష్ఠ. అద్వైతసిద్ధి స్వరూపము. తురీయాతీత అవధూత.

రవన్తీ దమన్తీ నటన్తీ హసన్తీ అని ఆన్తరయాత్రలోని ధ్వని సంహార తప ఆనన్ద శక్తులు. ఇవి మానవ వైఖరిని శుద్ధిచేసి, జ్ఞానప్రకాశములో నిలుపుతాయి.

త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా॥ నీకు ఇన్ని రూపాలు ఉన్నప్పటికీ విధ్వంస శక్తిగా ఉన్నప్పటికీ, నీవే ఏకైక సత్యము. పరబ్రహ్మ స్వరూపిణివి. పరబ్రహ్మమే భయంకరమైన సంహారశక్తి. ఆ పరబ్రహ్మమే నాట్యం చేస్తూ జ్ఞానాన్ని నింపుతుంది.

ఆ పరబ్రహ్మమే అందరియందు అఖణ్డానన్ద స్వరూపిణి. ఈ అన్ని దశలు ఒక్కటే అయిన పరబ్రహ్మశక్తి రూపాలు.

యథా విశ్వమేకం రవేరమ్బరస్థం
ప్రతిచ్ఛాయయా తావదేకోదకేషు।
సముద్భాసతేఽనేకరూపం తథా వై
త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా।। ౧౩

భావము– ఆకాశంలో ప్రకాశించు సూర్యుడు ఈ ఒకే విశ్వముయొక్క అనేక రూపాలను దృశ్యమానము చూసినట్లే, జలములయందు ఒక్కడే అయిన సూర్యుడు అనేకంగా కనిపిస్తున్నాడు. అదే విధంగా నీవుకూడా ఏకైక పరబ్రహ్మవు.

మానసౌకా వ్యాఖ్యా:
సూర్యుడు ఒక్కడే ఉన్నా అతని ప్రతిబింబాలు అనేకంగా నీటి బిందువులలో సరస్సులలో నదులలో సముద్రములో వేరువేరుగా కనిపిస్తున్నాయి. కానీ అసలు సూర్యుడు ఆకాశంలో ఒక్కడే ఉంటాడు.
ఈజగత్తులో అనేక ప్రతిబింబాలున్నా అవన్నీ ఒకే మూలస్వరూపానికి చెందినవి. ఇక్కడ ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు విశ్వముయొక్క నానాత్వమును దృశ్యమానం చేస్తున్నాడు. **స య ఏషోన్తర హృదయాకాశః** హృదయాంతరంలో అందరూ ఎరిగిన స్ఫుటమైన ఆకాశం ఉంది. ఈ ఆకాశంలో హిరణ్మయుడైన పురుషుడు ఉన్నాడని శ్రుతి చెప్తోంది. ఈ హిరణ్మయ పురుషుడినే శ్రుతులు ఆదిత్యుడు అంటున్నాయి.
యథా సుదీప్తాత్ పావకా విస్ఫులిఙ్గాః సహస్రశః ప్రభవన్తే సరూపాః చక్కగా జ్వలించే అగ్ని వేలకొద్దీ అగ్ని కణాలను ఉజ్వలింప చేసినట్లుగా...
ఎక్కడే అయిన ఆదిత్యుడు జగత్తునందలి చరాచరముల హృదయాకాశములో అనేకంగా ప్రకాశిస్తున్నాడు. ఇక్కడ **ఆదిత్య బ్రహ్మోపాసనను** ఉపదేశిస్తున్నారు. సత్ అనుపదము నామరూపాత్మక జగత్తును చెప్తుంది. ఈ నామరూప ప్రకటన ఆదిత్యుని అధీనమై ఉంది. ఈ ఆదిత్యుడు లేకపోతే గాఢాంధకారమే. లోకములో ఉన్నది **(సద్)** అనే వ్యవహారమునకు కారణము ఆదిత్యుడే. ఈ ఆదిత్యుని

అనుసరించి పెద్దధ్వనులు, సకల ప్రాణులు, సకల భోగ్యములు (స్త్రీ వస్త్ర అన్నాదులు) పుట్టేయి. ఈ ఆదిత్యుడే బ్రహ్మ. **అదిత్యో బ్రహ్మేత్యాదేశః...** అని శ్రుతి చెప్తోంది. ఒక్కడే అయిన ఆదిత్యుడు (బ్రహ్మ) జలములయందు అనేకముగా కనిపించినట్లు, జగత్తునందలి చరాచరముల హృదయాకాశములో బ్రహ్మ ప్రకాశించుచున్నాడు.

రవి అంటే చైతన్యము, ఆత్మతత్త్వము.

ఉదకము అంటే మనస్సు, ప్రకృతి, మాయ, ఆవరణ.

ప్రతిబింబాలు జీవతత్త్వాలు, జగత్తుయొక్క అనేకత్వం. ప్రతి ఉపాధిలోనూ పరమాత్మ జీవుని రూపముగా ప్రతిబింబిస్తాడు. కాబట్టి జీవులు భిన్నంగా కనబడినా మూలస్వరూపంగా ఒక్కటే.

త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా అలా నీవు (గుహ్యకాళీ తారా ఇత్యాది) అనేక రూపాలుగా దర్శింపబడుతున్నా, నిజమునకు నీవు ఒక్కటే అయిన పరబ్రహ్మమే అయి ఉన్నావు. నీవు విశ్వసృష్టిలో అనేక రూపాలుగా అనుభూతి చెందబడినప్పటికీ, నీవు అద్వైత సత్యమైన పరబ్రహ్మ స్వరూపమే.

గుహ్యకాళీ (పరబ్రహ్మ) ఒక్కటే అయినా అది జగత్తులో అనేక రూపాలుగా వ్యక్తమవుతోంది. అనేకత్వము మాయామూలకమైన భ్రాన్తి. నిజానికి తత్త్వంగా పరబ్రహ్మ ఒక్కటే. కానీ నీళ్ళలో సూర్యుని ప్రతిబింబాలవలె జీవులుగా అనిపించడము మాయకు కారణం. శక్తి = బ్రహ్మ. ఇది శాక్త మార్గమునకు అంకితమైన భావన. శక్తి మాత్రమే పరబ్రహ్మమని, ఆ శక్తినే **త్వమేకా** అని కొలుస్తుంది. సూక్ష్మచైతన్య దృష్టితో చూస్తే వేరువేరు ప్రదేశాలలోని నీటిలో అనేక సూర్యప్రతిబింబముల వలె, ప్రతి జీవిలో అమె తనకుతానే భిన్నత్వంగా వ్యక్తమవుతోంది. ఈ **ఆదిత్యబ్రహ్మోపాసన** జీవులమధ్య ఉన్న భేదము స్వాభావికముగాదని మాయా స్వభావంగా ఉందని తెలియజేస్తుంది. శుద్ధచైతన్య ముగా శక్తి స్వరూపముగా ఉన్న పరాత్పరతత్త్వాన్ని ఉపాసించిన **త్వమేకా పరబ్రహ్మరూపేణ సిద్ధా** అనే సత్యాన్ని ప్రత్యక్షంగా అనుభవించవచ్చు. ఇది ద్వైతభావిన్ని తొలగించుకొని అద్వైతాన్ని అనుభవంలోకి తెచ్చుకొను మార్గము.

అపాదాపి వాతాధికం ధావసి త్వం
శ్రుతిభ్యాం విహీనాఽపి శబ్దం శృణోషి।
అనాసాఽపి జిఘ్రస్య నేత్రాఽపి పశ్య
స్వజిహ్వాఽపి నానా రసాస్వాద విజ్ఞా॥ ౧౪

భావము– కాళ్ళులేని నీవు గాలికన్నా వేగంగా పరిగు పెడుతున్నావు. చెవిలేని నీవు ధ్వనిని వింటున్నావు. ముక్కులేని నీవు వాసనను పీలుస్తున్నావు. కళ్ళులేని నీవు చూస్తున్నావు. నాలుక లేని నీవు రుచులను ఆస్వాదిస్తున్నావు.

మానసౌకా వ్యాఖ్యా:
ఇది నిరాకార శరీర రహితమైన సాక్షీ చైతన్యాన్ని దర్శింపచేస్తోంది. ఇది... **సర్వేన్ద్రియ గుణాభాసం సర్వేన్ద్రియ వివర్జితమ్** బాహ్యేన్ద్రియముల చర్యల ద్వారా ప్రకాశిస్తూన్నప్పటికీ, ఇన్ద్రియరహితమైనదిగా తెలియబడుతోంది.
దేహీ హంసో లేలాయతే బహిః శరీరాన్ని సాధనంగా ఉపయోగించి బాహ్య జగత్తులో క్రీడించే హంస (ఆత్మశక్తి). అంటే జగద్వాసనలు ఏవీ అంటని స్వరూపము.
విశ్వరూపుడైన వానికి **సర్వతః పాణి పాదం తత్ సర్వతోక్షి శిరో ముఖమ్। సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి॥** ఎటు చూసినా చేతులు కాళ్ళు కళ్ళు చెవులు ఇలా ఇన్ద్రియాలద్వారా వ్యాకరణం చెంది ఉన్న ఇన్ద్రియాతీత చైతన్యరహస్యము గురించిన ప్రస్తావన. దీనివలన జగద్రూపముగా అవతరించిన పురుషుని పూర్ణతకుగాని అనన్తతత్త్వమునకుగానీ లోపం రాదు. చేతులు లేకుండా గ్రహిస్తున్నాడు. పాదాలు లేకుండా వేగముగా పోతున్నాడు. నేత్రాలు లేకుండా చూస్తున్నాడు. చెవులు లేకుండా వింటున్నాడు. ఆత్మ భౌతిక సామర్థ్యముతో కాకుండా చైతన్యంద్వారా క్రియాశీలమై ఉంటుందని శ్రుతిమాత ఉపదేశిస్తోంది. ఇన్ద్రియ ఆవశ్యకత లేకుండా సర్వక్రియలను చేస్తుంది. సాక్షి వికార రహితము. నిర్గుణమైన గుణధర్మాలను అనుభవిస్తుంది.
ఈ స్వరూపాన్ని ఉపనిషత్తులు పురుషుడని చెప్తే, యోగులు తాన్త్రికులు

పరబ్రహ్మయొక్క అవిభాజ్యశక్తి స్వరూపమైన కుణ్డలినీశక్తిగా చూస్తున్నారు. కాళ్ళు లేని ఆమె – అంటే భౌతిక శరీర రహిత శక్తి అయినా..., **వాతాధికం ధావసి** నాడులయందు ప్రవహిస్తూన్న ప్రాణశక్తిగా ఆమె అన్తరంగా ప్రయాణి స్తోంది. కుణ్డలినీ సాధకుని సుషుమ్నానాడిలో సంచరించే ప్రాణశక్తిగా ఉంది ఆమె.

శ్రుతిభ్యాం విహీనాఽపి శబ్దం శ్రుణోషి ఇది నాదశక్తి. ఈ స్వరూపము మూలాధారాది ఆజ్ఞాన్త ప్రయాణములో భేరీ వేణు మృదంగాది దివ్య ధ్వనులను వింటూ సాగుతుంది. శబ్దము వినడము అంటే బాహ్య శ్రవణము కాదు. అన్తర్ముఖ నాదానుభవము.ఆమెకు బాహ్యంగా చెవులు లేవు. కానీ ఆమె పరావాగ్రూపిణి. పరానాద స్వరూపమే ఈమె.

అనాసాఽపి జిఘ్రసి ఆమె శబ్దమువలె వాసనలూ గ్రహిస్తుంది. వాసన అంటే ఇక్కడ మనోసఙ్కల్పానుభవ సారము. ఇది వాసనాక్షయ మార్గములో సహాయపడే శక్తి.

అనేత్రాఽపి పశ్యసి జగదస్తిత్వ భావనా విచ్ఛేదకర దృష్టి. తృతీయనేత్ర తత్త్వము. దృష్టిశక్తిగా ఆమె ఆత్మచైతన్యములో దర్శింపబడుతోంది. జిహ్వా లేనప్పటికీ రుచిని ఆస్వాదిస్తోంది. ఇన్ద్రియాల్లేకుండానే ఇన్ద్రియార్థముల ద్వారా ప్రకాశిస్తూనే సంసార సంబంధ అంశాలు ఏవీ అంటకుండా ఉంటుంది. అహంభావము లేని ఆనన్దస్వరూపము.

ఇవన్నీ కలిసి కుణ్డలినీ తత్త్వాన్ని వివరిస్తున్నాయి. నిరాకార నిర్గుణ సాక్షీ శక్తి. ఇది పరబ్రహ్మశక్తి. విశ్వరూపుడైన పరమాత్మయొక్క విశ్వచైతన్య దీప్తి. సర్వసాక్షీ చైతన్యము. ఇది న ద్రష్టా న శ్రోతా న జాంఇఁతా... ఇత్యాది అనుభవాలన్నింటికీ మూలకారణమైన సాక్షి జ్ఞానస్వరూపము.

ఇన్ద్రియాల్లేనిదైనా **య చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి; యత్ శృణోతి యేన శ్రోత్రమిదం శ్రుతమ్; యత్ ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే।** మన దృష్టి శ్రవణ ఘ్రాణ రసన స్పర్శేన్ద్రియాలన్నీ నడవడానికి ఉన్న అధిష్ఠానము. ఇది కేవలము ద్రష్ట. దీనినే బృహదారణ్యకములో యాజ్ఞవల్క్యుడు ప్రతి దానికి ఆధారమైన తత్త్వముగా ఉపదేశించాడు. ఇది అన్తర్ముఖతా సాధనకు ప్రేరణ.

ఇది శరీరాధారంగా శక్తిని గమనించడమే కాదు–
శక్తిస్వరూపాన్ని అనుభవాత్మకంగా తెలుసుకునే సాధన. దీనినే **'నేను'**ను తెలుసుకోవడం అని శ్రీరమణులు చాలా సులువైన మార్గంలో దర్శింపజేసేరు. ఇన్ద్రియాతీతమైన ఆనన్దమే పరమేశ్వరీ, కుణ్డలినీ, చిదానన్దలహరి లేదా నిర్వాణశక్తి.

యథా భ్రామయిత్వా మృదం చక్రమధ్యే
కులాలో విధత్తే శరావం ఘటం వా।
మహాయన్త్రమధ్యే చ భూతాన్యదృష్టే
సురాన్మానుషాం స్త్వం సృజాస్యాదిసర్గే॥ ౧౫

భావము– ఏవిధంగా కుమ్మరి చక్రం మధ్యలో మట్టిని తిరి పెడుతూ పాత్రలు, కుణ్డలు రూపొందిస్తున్నాడో...
ఆ విధముగా నీవు (కాళీ) చూడ శక్యముగాని పెద్దయన్త్రము మధ్యలో భూతములను సురులను మనుష్యులను మొదటగా (ప్రథమార్థంలో) నీవే సృష్టిస్తున్నావు.

మానసౌకా వ్యాఖ్యా:
పరాశక్తి (కాళీ) తన అన్తరఙ్గ **మహాయన్త్రము**ద్వారా అదృష్టంగా మనం చూడలేని ఊహించలేని విధంగా భూతములు దేవతలు మానవులు మొదలైన సృష్టి రచనా వైదుష్యాన్ని ప్రకటిస్తోంది.
ఈ సర్వసృష్టికి పరమాత్మయే కారణమని వేదవేదాన్త తన్త్ర గ్రన్థాలలో విస్తృతంగా ప్రస్తావింపబడింది.
ఈ మొత్తం అంతా వాడే... వాడే చేసేదు.
మొత్తం అంతటికీ కారణం వాడే...
ఎవడా వాడు... ఇంకెవరు పరమాత్మ. అని నేననటం కాదు. సాక్షాత్తు వ్యాసభగవానుడు అన్నారు. భాగవతంలో పరమాత్మను **సర్వేన్ద్రియ గుణద్రష్టే। సర్వ ప్రత్యయ హేతవే।** అంటారు. సకల ఇన్ద్రియములకు వాటి విషయములకు సాక్షి. సకల మనోవృత్తులకు మూలము అని చెప్పుటచే; అంటే ఈ సంసారము నకు జగన్నిర్మాణ రూప విభూతికి పరమాత్మయే కారణము.
మట్టికుండ ఏవిధంగా ఒక కుమ్మరియొక్క చర్యల ఫలితమో; మట్టికుండను చూడటం ద్వారా కుమ్మరి ఉనికి ఏవిధంగా గ్రహింపబడుతుందో అదేవిధంగా ఇక్కడకూడా. ఎప్పుడూ కూడా ఈ భౌతిక ప్రపఞ్చము ఆధ్యాత్మిక ప్రపఞ్చాన్ని

పోలి ఉంటుంది. The physical realm resembles the spiritual plane. కనకనే సుప్రభాత సేవనుండి పవళింపు సేవ వరకు మన సంసారాన్ని ఆయనలో చూస్తాం. దీనికీ ఆయనే కారణం అనుకోండి...

ఎందుకంటే ఈ జగత్తు (సంసారం) అంతా ఆయనే కదా..!

అందుకే మనకు అలా భావన చెయ్యాలనే తలంపు వస్తుంది. ఈ జగత్తును నాలోకి చేర్చి అంతా నన్నుగా తెలుసుకోండి అని ఆయన చెప్తుంటే...

మనకు సౌలభ్యంగా ఉంటుంది కదా అని ఆయన్నే సంసారంలోకి ఈడ్చుకొని వచ్చేసాం. ఇక్కడ మనం చేసిన తెలివైన పని అనుకున్నా, తెలివితక్కువ పని అనుకున్నా... ఒక గొప్ప పని అయితే చేసాం. కట్టి కూర్చోపెట్టే క్రమంలో మనల్ని ఆయనతో కలిపి కట్టేసుకున్నాం. ఆ బంధాలను ఆయన త్రెంచుకుని వెళ్ళిపోతే, మన బంధాలూ తెగిపోతాయి. భాగవతంలో కృష్ణుని రోటికి కట్టేసిన ఘట్టం ఇదే. కనుకనే **ఈశ్వరానుగ్రహాదేవ పుంసాం అద్వైత వాసనా** అన్నారు. భగవానుడు **మయాధ్యక్షేన ప్రకృతిః సూయతే సచరాచరమ్। హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే॥** ఓ అర్జునా! (ఓ జీవుడా!) నా అధీనములో ఉండి ప్రకృతి (ప్రాకృతిక శక్తులు) చరాచర జగత్తును సృష్టిస్తుంది. దీనవల్లే ఈ ప్రపఞ్చము మారుతూ ఉంటుందని చాలా స్పష్టంగా అంటున్నాడు పరమాత్మ.

ఉదాహరణకు భారత రాజ్యాంగమును ఎవరు నిర్మించారు అంటే... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అబేద్కర్ అని మనం చెప్తున్నాం కదా...

ప్రాకృత శక్తులు నిర్మించినా అవి ఈయన అధ్యక్షతన పనిచేస్తాయి. ఆ శక్తులు ఈయనవే. ఈయనకంటే వేరుకాదు. **మాయాం తు ప్రకృతిం విద్ధి మాయినం తు మహేశ్వరమ్** మాయ అనేది క్రృతిని సూచిస్తుంది. ఆ ప్రకృతిని నియంత్రించే వాడు మహేశ్వరుడు. అంటే పరమాత్మ, సర్వమునకు అధిష్ఠానము పరమాత్మయే అని శ్రుతిమాత చెప్తోంది.

మమాయన్త్ర మధ్యమున, ఇక్కడ యన్త్రము అంటే నియమన విధానము. నియన్త్రణకారక సాధనము. నియంత్రించేది, ఒకే దిశలో శక్తిని ప్రసారం చేయునది. కర్మను సమర్థముగా చేయగల పద్ధతి. ఈ యాన్త్రికత

దేశకాలములకు లోబడి ఉంటుంది. మహాయన్త్రము అంటే అఖణ్డమైన కాలస్వరూపమే...

దీనికి లోబడి పదార్థములు జీవులు ఉంటాయి. ఉదాహరణకు రాముడు త్రేతాయుగములో ఉన్నాడు. త్రేతాయుగము అంతా ఉన్నాడా... లేదు. ఆదిలోనో మధ్యలోనో చివరలోనో ఉన్నాడు. కాలపరిచ్ఛిన్నుడై ఉన్నాడు.

స్థలం మరియు సమయ విరాయములను కొలవడం పరిశీలకుడి కదలికపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, వేర్వేరు వేగాలతో కదులుతున్న ఇద్దరు పరిశీలకులు ఒకే సంఘటన మధ్య వేర్వేరు సమయ విరామాలను కొలుస్తారు. (the measurement of space and time intervals depends on the observer's motion. For example, two observers moving at different speeds will measure different time intervals between the same two events.)

అఖణ్డకాలము, శుద్ధమైన ఆకాశము చూడశక్యముగావు. ఎందుకంటే ఇవి వీటికి అధిష్ఠానమైన పరబ్రహ్మమునందే ఉంటాయి.

ఈ అనుభవావస్థలో ఉన్నవాడు తన అనుభవాన్ని పంచుకోదగిన తనకంటే భిన్నమైన స్వరూపము లేనివాడగుటచే ఎప్పటికీ అదృష్టమే.

ఈ కాలయన్త్రము మధ్మలో, అనుటలోనే ఆ అఖణ్డకాలమునందు **స్పందన** కదలిక వచ్చిందని తెలుస్తోంది. ఎప్పుడంటే... భూతములు అంటే ఆకాశాది మహాభూతములు, దేవతలు, మనుష్యులు అంటే పశువర్గము ఇవి సృష్టింపబడు టచే మహాకాల శుద్ధాకాశముల యందలి కదలిక **స్పందన** ఊహింపతగినది. ఇదే విషయాన్ని

తస్య సంవృత మన్త్రస్య గూఢాకారేఙ్గితస్య చ। ఫలానుమేయాః ప్రారమ్భాః

రహస్యమైన పైకి కనబడని స్పందనలుగల గుహ్యాకాలము (కాలిక) యొక్క సృష్టి ప్రళయాలు అనే పనుల ప్రారంభములు ఫలితమును చూచి ఊహింప తగినవే కానీ మందుగా తెలిసేవి కావు. అని మహాకాల స్వరూపాన్ని తెలిసినవాడు మాట్లాడేడు.

యథా రజ్జరజ్జుర్కధృష్టిష్వకస్మా
న్నృణాం రౌప్యదర్వీకరామ్బుభ్రమః స్యాత్।
జగత్యత్ర తత్తన్మయే తద్వదేవ
త్వమేకైవ తత్తన్నివృత్తౌ సమస్తమ్॥ ౧౬

భావము– ఏవిధంగా తగరము, త్రాడు, సూర్యకిరణములయందు మనుష్యులకు ఉన్నట్లుండి వెండి సర్పము ఎండమావి కనబడుచున్నవో... ఆవిధముగానే జగత్తునందు సంసారులకు ఆయా వస్తువుల పట్ల భ్రమలు కలుగుతూనే ఉంటాయి. అయితే ఆ భ్రమలు తొలగినప్పుడు ఒకటే పరమ సత్యమైన (నీవు ఒక్కతెవే) నీ విశ్వరూపమే మిగులుతుంది.

మానసోకా వ్యాఖ్యా:

దృశ్య నిరాకరణపూర్వకంగా జీవేశ్వరాభేదము చెప్తున్నారు. శుక్తి రజత భ్రాన్తి, రజ్జుసర్ప భ్రాన్తి, మరుమరీచికా భ్రాన్తి.

తగరపుముక్క – వెండి

త్రాడు – సర్పము

సూర్యకిరణాలు – ఎండమావి

అను ప్రాతిభాసిక వస్తువులు. ఇవి ప్రాచిన వేదాన్త తన్త్ర యోగ మరియు శైవ దర్శనాలలో జగత్తుయొక్క యదార్థ స్వరూపమును తెలుపుటలో విశేషస్థానాన్ని కలిగి ఉన్నాయి.

శుద్ధాద్వయ బ్రహ్మావిబోధనాశ్యా। సర్పభ్రమో రజ్జు వివేకతో యథా। అని వివేకచూడామణిలో భగవత్పాదశఙ్కరులు రజ్జుజ్ఞానముచే సర్పభ్రాన్తి ఎలా నశిస్తుందో, ఆవిధంగానే మాయా సంబంధములేని అద్వితీయ పరబ్రహ్మయొక్క సాక్షాత్కార జ్ఞానముచే మాయ నశించుచున్నదని చెప్పేరు. సర్పభ్రాన్తికి కారణం అంటే అధిష్ఠానము త్రాడు. త్రాడును తెలియగానే సర్పభ్రమ పోతుంది. ఇదేవిధంగా ఈ శరీరేన్ద్రియములకు అధిష్ఠానముగా ఆత్మ ఉన్నది. ఈ ఆత్మ చైతన్యమే సమస్త ప్రపఞ్చమునకు అధిష్ఠానము. అప్పుడు వ్యష్టి సాక్షిత్వమును

దాటి, సమష్టి సాక్షి అగుచున్నాడు.

దృక్ స్వరూపే స్థిరం కుర్యాత్ అదృశ్యం దృశ్యమేవహి। దృక్ అయిన గుహ్యకాళీ పరబ్రహ్మయందు యోగారూఢత్వమును పొందినవాడు కాళికయే అంటే పరబ్రహ్మయే నిరుపాధికుడే. దృశ్యమే లేదు కనుక సర్వాధిష్ఠాన పరబ్రహ్మమే తాను కావలెను. తనకన్న వేరొకటి తోచనప్పుడు **నేదం నేదం కల్పితత్వాన్న సత్యం** అన్నట్లుగా **నేతి నేతి** అను విచారణచే శరీరము, ఇన్ద్రియములు, మాయ ఇత్యాదులు నేనుకాదు అని భావించును. ఆ గుహ్యకాళీ బ్రహ్మమే తాను అగునప్పుడు వేరొకటి స్ఫురించుట లేదు. అక్కడ వేరొక వస్తువు లేదు. ఉన్నది కాళీపరబ్రహ్మమే. స్ఫురించినదంతయు పరబ్రహ్మమే.

పాము అనుకున్నప్పుడు ఆ సర్పజ్ఞానము అభేదముచేతనే కలుగుచున్నది. అక్కడ త్రాడుకన్నా పాము వేరుగా లేదు. ఇదేవిధంగా పరమాత్మయందు జగద్భ్రాన్తి కలుగుచున్నది. ఇది **సత్యానృత మిథునీకరణము** అవుతుంది. నిజానికి పరమాత్మకంటే జగత్తు వేరుగా లేదు. ఎలా అయితే త్రాడును చూచి సర్పమని భ్రమించి దానియందు భయంకరము, వక్రత, పడగ, కోరలు అని అనేక వికారములను భావన చేస్తున్నాడో, అటులనే సద్వస్తువొక దానియందే జగత్తును కల్పించుచున్నారు. ఇది మిథ్యాకార్యము. దీనిచే సంసారరూప మహా భయాన్ని కల్పించుకుంటున్నారు. **జ్ఞానంబన్ధః** అను శివసూత్రము కూడా Bound by wrong knowledge భ్రమ అనేది బ్రహ్మానుభవానికి ప్రధాన ప్రతిబంధకము అనే విషయాన్ని బలంగా చెప్తోంది. ఈ విషయం ఈవిధంగా ఎన్నిరకములుగా కల్పింపబడినను అది **సత్** అనుదానిని ఆధారం చేసుకొనే కదా..! దానిని మనము పాము అనుకొనిననూ అది త్రాడే కదా. ఈవిధంగా జగత్తు పరబ్రహ్మమే అని సిద్ధించును.

ఈధ్యాస అధ్యారోప అపవాద రూప విచారణచే జగత్తుయందు జగత్సత్యత్వ భ్రాన్తిని తొలగించుకోవాలి. త్రాడును చూసి పాము అని అన్నప్పుడు త్రాడుయొక్క రూపము తెలియబడుటలేదు. రజ్జుస్వరూపమును గుర్తుపట్టిన తరువాత సర్పరూప జగద్భ్రాన్తి పూర్తిగా నశించుచున్నది. అంటే భ్రమ కాలములోనూ, భ్రమ నివర్తనానంతరము నిత్య శుద్ధ బుద్ధ ముక్త పరబ్రహ్మ

(గుహ్యకాళీ) ము ఒక్కటియే..!

అంటే పరబ్రహ్మయందు జీవత్వము (కార్యోపాధి, జగదాదులు), ఈశ్వరత్వము (కారణోపాధి, మాయా మహదాదులు) అనునవి కల్పింపబడినవి.

బాధకాలే ఇచ్ఛాజన్యం జ్ఞానం ఆరోపః బాధకాలమున బలాత్కారముగా కల్పింప బడిన జ్ఞానమే ఆరోపము. శుక్తియందు రజతము బాధితము. అయినా భ్రాన్తిచే కల్పింపబడుచున్నది. ఆరోపిత ఉపాధులను **అథాత ఆదేశః** అను వేదవాక్యము నిషేధిస్తోంది. జీవత్వ ఈశ్వరత్వములు కల్పితములు.అద్వైత భఙ్గకము. కావున జీవులయందును ఈశ్వరునియందును పరబ్రహ్మచైతన్యమే భావించవలెను. రజ్జు-సర్ప, రజ్త-రౌప్య, మరు-మరీచికాది దృష్టాన్తముల వలన నానావిధ వికల్పములు, విపరీత భావనలు భ్రాన్తిచేతనే అనే జ్ఞానం ప్రాప్తించింది. మరియు **అనన్యత్వమధిష్ఠానాత్** అనుదానిచే త్రాడుకన్న పాము వేరుకాదనునటుల, బ్రహ్మముకన్న ఆరోపిత జగత్తునూ వేరుకాదు. **సర్వం ఖల్విదం బ్రహ్మ** అనునట్టి విచారముచే పరబ్రహ్మ వస్తువుల అధిష్ఠాన వివేకముచే సకలానర్థములు తొలగి పరబ్రహ్మరూపుడే అగుచున్నాడు.

యథా యథా చిత్తం ప్రవర్తతే। తథా తథా విశ్వం పరివర్తతే। మన మనోవికారము లను అనుసరించే అంటే మన కోరికలను భయాలను అనుసరించే ఈ విశ్వం అంటే స్వరూపాలు / సర్వోపాధులు మారుతున్నాయి. మిథ్యాజ్ఞానముచే ఆరోపాదులవలన జనించిన వికల్ప విపరీత భావనలు సర్వము, భ్రాన్తి తొలగు టచే **సర్వం ఖల్విదం బ్రహ్మ** తనకు కారణమగు బ్రహ్మమే అను శ్రుత్యర్థ రూపంగా పరమసత్యమైన నీ విశ్వరూపమే మిగులుతుంది.

మహాజ్యోతిరాకార సింహాసనం యత్
స్వకీయాన్ సురాన్ వాహయస్యుగ్రమూర్తిః
అవష్టభ్య పద్భ్యాం శివం భైరవం చ
స్థితా తత్ర మధ్యే భవత్యేవ ముఖ్యా॥ ౧౭

భావము– గొప్పజ్యోతి ఆకారంగా ప్రకాశించే నీ సింహాసనమున ఉగ్రమూర్తిగా నీవు అవతరించి, నీ స్వయంప్రభ గణమైన దేవతలచే సేవింపబడుచూ, శివునకు మరియు భైరవునకు ఆశ్రయ స్థానమైన పాదములుగల నీవు (చణ్డభైరవి) భవమునకు మధ్యలో ప్రధానమైన స్థితికలిగి ఉన్నావు.

మానసౌకా వ్యాఖ్యా:

మహాజ్యోతిరాకార సింహాసనం దివ్యమైన మహాప్రభా భాసురమైన ఆమ్నాయ సింహాసనము. పరమమైన ఉత్తరామ్నాయ స్వరూపిణి. స్వీయ (తన సంబంధమైన) దేవతలను ఉద్బోధించి ముందుకు నడిపిస్తూన్నట్టిది.
యథా అగ్నేః క్షుద్రా విస్ఫులిఙ్గాః వ్యుచ్చరన్తి (బృ. 2. 1. 20) ఒకటే అయిన తననుండే వచ్చిన దేవతలు. ఎలా అంటే శ్రుతి చెప్తోంది. ఒకటే అయిన అగ్ని కుండి ఆ అగ్నియొక్క అంశలే అయిన (క్షుద్రాః అల్పాః) చిన్న మిణుగురులు నలుదిక్కులా ఎగురుచున్నవో...
ఆవిధంగానే పరబ్రహ్మమే అయిన చణ్డకాళీ నుండి అనేకములైన తన స్వీయశక్తులను (సురాన్ అంటే ఇన్ద్రాది దేవతలను కాదు) తన యోగ శక్తులైన దేవతలను ఉద్బోధించి ముందుకు నడిపిస్తోంది.
ఈ దేవతలు...
ముద్రా నవకమునకు అధిదేవతలైన సర్వసంక్షోభిణీ మెదలైనవారు, వీరావళీ దేవతలు అయిదుగురు. వీరు బ్రహ్మ విష్ణు రుద్ర ఈశ్వర సదాశివ అను వారు; మహార్థ, అశ్వారూఢ, సంపత్కరీ, మిశ్రామ్బా, వాగ్వాదినీ, జాతవేదసీదుర్గా దుర్గా జయదుర్గా దీపదుర్గా వనదుర్గా శూలినీదుర్గా ప్రతిక్రియాదుర్గా ఆసురీదుర్గా శీతలాదుర్గా, ధూమావతీ, తారా దక్షిణకాళీ చణ్డీ నకులీ పుళాందినీ

రేణుకా మహాలక్ష్మీ వాగీశ్వరీ స్వయంవరా యోగినీ ఇత్యాది దేవతా గణములను నడుపుచున్నది.

ఈ స్వరూపము ఉత్తరామ్నాయ ఊర్ధ్వామ్నాయ దేవతలకు అధిదేవత చణ్డకాళీ (చణ్డభైరవీ).

ఈమె చతుర్వేద మహావాక్యములచే తెలియదగినది. చణ్డభైరవి ఊర్ధ్వామ్నాయ అధిదేవత. చతుర్వేదములు తమ సారభూతమైన సర్వోత్కృష్ట స్వరూపములతో అంటే మహావాక్య చతుష్టయ స్వరూపముగా...

1. ఋగ్వేద మహావాక్యము: **ప్రజ్ఞానం బ్రహ్మ.** (ఐతరేయ ఉపనిషత్తు) అవబోధ స్వరూపమైన జ్ఞానమే ఈమె అని. ఇది చైతన్య స్వరూపమైన సత్యం.

2. యజుర్వేద మహావాక్యము: **అహం బ్రహ్మాస్మి.** (బృహదారణ్యక ఉపనిషత్తు) వ్యక్తిగత ఆత్మను పరబ్రహ్మతత్త్వముగా అనుభవించుట. జ్ఞానయోగముద్వారా ఈ ఐక్యమును సిద్ధింపచేసుకోవడం.

3. సామవేదీయ మహావాక్యము: **తత్త్వమసి** (ఛాన్దోగ్యము). ఇక్కడ విద్యా స్వరూపము. నువ్వు బ్రహ్మస్వరూపుడవని బోధిస్తుంది. ఇది ఉపదేశ వాక్యం.

4. అధర్వవేద మహావాక్యము: **అయమాత్మా బ్రహ్మ** (మాణ్డుక్య ఉపనిషత్తు). ఈ ఆత్మయే పరబ్రహ్మస్వరూపము. ఇది అనుభవము.

...సేవింపబడుచున్న స్వరూపము.

క్షుద్రరూపములు అంటే జగద్వ్యాకరణమునకు ఉపయుక్తములైన ఇన్ద్రాది దేవతా స్వరూపములు. ఇవి వీటి ప్రయోజనము మహావాక్య చతుష్టయ స్వరూపము కంటే అల్పము.

ఈ మహావాక్యచతుష్టయ విచార రూపముగా ప్రత్యక్షముగా అనుభూతి చెందదగిన ఈ మహాచణ్డయోగీశ్వరీ సమయవిద్యేశ్వరీ కాళికాంబ. పరబ్రహ్మ స్వరూపము. కనుకనే ఈ స్వరూపమును **ఉగ్రమూర్తిః** అన్నారు.

కస్మాదుచ్యత ఉగ్రమితి అని ఉపనిషత్తు ప్రశ్నవేసి సమాధాన రూపంగా సర్వశక్తి సంపన్న మహాచణ్డకాళీ శబ్దముచే వచింపబడు స్వరూపమే తన స్వమహిమ అయిన ఆత్మాధారముతో స్వతంత్రముగా సర్వపార్థివ లోకములను ఇన్ద్రాది సర్వదేవతలను విశ్వతైజసాది సర్వభూతములను అనుగ్రహించుచున్నది

కావున ఉగ్రమూర్తి అని ఉపనిషత్తు ఉగ్రశబ్దాన్ని వివరించింది.

ఉద్గృహ్ణాతీతి ఉగ్రం అనుగ్రహమూర్తియని అర్థం. **సర్వాన్ లోకాన్ సర్వాన్దేవాన్ సర్వానాత్మనః సర్వాణి భూతాన్యుద్గృహ్ణాత్యజస్రం సృజతి విసృజతి వివాసయతి ఉద్గ్రాహ్యతే**

సర్వమును సృష్టించుచున్నది. విస్తరింప చేయుచున్నది. ఉపసంహరించు చున్నది. **ఉద్గ్రాహ్యతే** సర్వము తనచే నుండునట్లు ఇతర దేవతలద్వారా చేయిస్తున్నది. ఉగ్రమనగా భయంకరమని కాదు. సర్వానుగ్రహ తత్పరురాలు. **స్తుహిశ్రుతం గర్తసదం యువానం మృగం నభీమ ముపహత్ను ముగ్రమ్** అని ఋక్ మన్త్రము ప్రమాణీకరించింది.

అనుగ్రహాత్మికా జ్యోతిర్మయీ విద్యా స్వరూపిణీ।
ఊర్ధ్వామ్నాయేశ్వరీ ధ్యేయా మూర్తిసూక్త స్వరూపిణీ॥ ఇది ముద్రాది ఆయుధములు ఏమీ లేని పరమ అనుగ్రహమూర్తి ఈ చణ్డభైరవీ.

ఈ ఉత్తరామ్నాయ ఊర్ధ్వామ్నా అధిదేవత అయిన చణ్డకాళీని బ్రాహ్మణులు (జాతివాచకం కాదు) మాత్రమే సేవింపతగినవారు. అంటే పూర్ణవిరాగులు బ్రహ్మవేత్తలు సేవింపతగిన తెలియదగిన స్వరూపము. ఈ ఉపాసకులు సర్వ బన్ధముల నుండి ఆ క్షణమే ముక్తులగుచున్నారు. జగత్తు (సంసారము) తో తను వేసుకున్న బన్ధములు ధర్మమేఘముల వలె తేలిపోతాయి.

అవష్టభ్య పద్భ్యాం శివం భైరవం శివుడినీ భైరవుడినీ తన రెండు పాదముల దగ్గర ఉంచుకున్నది. శివం మఙ్గళ స్వరూపం. శాన్త తత్త్వము.

భైరవం ఘోరతత్త్వం. భయంకరుడు. లయకారకత్వము ఇరువురికీ సమానమే. ఇక్కడ ఒక గంభీరమైన భావన ఉంది. పరాశక్తి తన పాదాలను శివుడు, భైరవుడు మీద నిలిపి ఉంచడం లేదా వారిని పాదాల దగ్గర ఉంచడం అనేది ఆమెను చేరుటకు వీరిని సేవించాలనే సఙ్కేతము.

భైరవ – భయంకరుడు. ఈ తత్త్వాన్ని వజ్రయాన దేవునిగా బౌద్ధులు కూడా ఉపాసిస్తారు. కాశీరశైవం భైరవుడు పరమసత్యాన్ని తెలియజేసే స్వరూపంగా చెప్తుంది. ఇతడు దణ్డపాణి. పాపులను దయలేకుండా శిక్షించువాడు. భైరవుడు భయంకరుడు, భయహరుడూను. ఉపాసకునకు భయకారకమైన దానిని

లేకుండా చేయువాడు. ఏది భయంకరము...

అంటే, **భయం ద్వితీయాభినివేశతః స్యాత్** ఈశ్వరుని నుండి విముఖుడైన వానికి ఈశ్వరమాయచే స్వరూపజ్ఞానము మరుగుపడట, దేహాభిమానము, శత్రుమిత్రాది భేదము సత్యమను బుద్ధి, దానివలన భయము కలుగునని భాగవతము అంటుంది.

ద్వితీయాద్ వై భయం భవతి రెండవ వస్తువు అంటూ ఉంటే దానివలన భయము కలుగుతుంది. ద్వితీయం అనగా తనకంటే వేరైనది. ఇది అజ్ఞాన జనకము. రెండవ వస్తువు ఒకటి ఉందనే నిశ్చయం లేకుండా భయం కలుగుటకు అవకాశం లేదు. మరి ఈ భయనివర్తకమైన మార్గమేది...

అంటే దానికి **తతః ఏవ యథాభూతాత్మ దర్శనాదేవ అస్య ప్రజాపతేః భయం వీయాయ విస్పష్టం అవగతమ్** బృహదారణ్యక శ్రుతినిగూర్చి భాష్యకారులు అంటున్నారు. తన స్వరూపమును యథార్థముగా తెలుసుకొనుటచే భయము దూరమైనవాడుగా అయ్యేడు. భైరవుని అనుగ్రహం ఇలా ఉంటుంది. సంసారమే భయమునకు హేతువని శ్రుతుల అభిప్రాయమై యున్నది. కనుక సంసారమును కూకటి వేళ్ళతో పెకలించి పడవేయువాడు. ఈ విధముగా భైరవానుగ్రహాన్ని పొంది పైకినడిచి చణ్డభైరవీ (కాళీ)ని తెలుసుకుంటాడు. ఈ చణ్డభైరవీ (కాళీ) స్వరూపం సంసారఘ్ని, కావున ఉగ్రరూపా అని చెప్పబడింది.

ఉగ్రమూర్తిః అంటే **వాత్సల్యేన ఇచ్ఛాతిరిక్తా సంసారభయ మనహృత్య బ్రహ్మానుభవం దదాతి** అనగా ఈ తత్త్వం వాంఛకు అతీతముగా వాత్సల్యము వలన సంసార భయాన్ని తొలగించి, బ్రహ్మానుభవాన్ని ఇచ్చునది. ఈ శివ–భైరవ తత్త్వాలు రెండూ చణ్డభైరవీ తత్త్వమును గ్రహించుటకు ఆధారమైనవి. **స్థితా తత్ర మధ్యే భవత్యేవ ముఖ్యా** ఆ చణ్డభైరవి **భవము**నకు మధ్యలో ప్రధానమైన స్థితికలిగి ఉంది. ఇక్కడ అసాధారణ రహస్యాన్ని ఉపదేశిస్తున్నారు. ఉగ్రమూర్తిః చణ్డభైరవీ అయిన ఈ ఉపాస్యరూపము ఎక్కడ ఉంది...

ఎక్కడో ఉంటే... ఉపాసకులకు ప్రయోజనం లేదు. సాపేక్షతకు అందని బ్రహ్మను ఉపాసనా సౌలభ్యంకొరకు **కాలము–స్థలము** సాపేక్షతను ఆలంబనగా చేసుకుని విలాసమును చూపిస్తున్నారు. **భవస్య మధ్యే** అనగా జగద్రూపంగా విశ్వంలోనే

ఉంది. ఇక్కడ ఒకమాట చెప్పడానికి భయపడనవసరం లేదు. సంసార రూపంగా సంసారములోనే ఉంది. పోష్యపోషక వర్గరూపంగా, వాటి ఉత్పత్తి నాశముల రూపముగా సర్వసాక్షీ స్వరూపముగా నిత్యముగా మనలోనే ఆ శక్తి ప్రధానమై ఉంటుంది.

భవః అంటే అణిమాది విభూతులు. "కదలని కదల్చలేని పర్వతాలు (**గరిమ**); ఎగిరే పక్షులు, కదిలే మేఘాలు (**లఘిమ**); కురిసే వర్షాలు (**ప్రాప్తి**); నీటి గమనం, అధికారం ప్రభుత అంటే పోష్యపోషకవర్గము మధ్య సూత్రం (**ఈశత్వ, వశిత్వాలు**); విశ్వాసాన్ని అనుసరించి ఉన్న ఏకకణ జీవి (**అణిమ**), నుండి కంటికి ఇమడని విశ్వం (**మహిమ**) వరకూ అన్నీ విభూతులే" ఈ రూపంగా నిత్యమూ ప్రకటమౌతూనే ఉంది.

ఈ శ్లోకము పరాశక్తియొక్క యోగ-స్థితిని మరియు అఖిల జగత్తును ప్రభావితం చేసే ఆమె శివ-భైరవ తత్త్వాలు అనే రెండు మెట్లు కలిగిన సింహాసనము పై తేజోరూపిణిగా తన అన్తర్ముఖ దివ్యశక్తులను నడిపిస్తూ, జగత్తు (సంసారం) రూపంగా జగత్తుమధ్యలో ప్రధాన స్థితినిపొంది ఉంది. ఈమెను జగత్తుయొక్క ఆదిమధ్యాన్త స్వరూపముగా గ్రహించాలి.

క్వ యోగాసనం యోగముద్రాది నీతిః
క్వ గోమాయుపోతః క్వ కాలానలశ్చ।
జగన్మాతరీదృక్ తవాపూర్వలీలా
కథంకారమస్మద్విధైర్దేవి గమ్యా॥ ౧౮

భావము– ఓ జగన్మాతా! యోగాసనాలు యోగముద్రలు సాధనల నీతి నియమాలు ఒకవైపు గోమాయువును అధిష్ఠించిన రూపము, కాలాగ్నివంటి ఉగ్రతతో కూడిన నీ రూపం ఇంకొకవైపు– ఇవి అన్నీ నీ పూర్వకాల లీలల భాగమా..! ఇలాంటి నీ మహత్తును నావంటి సాధారణ మనుష్యులు ఎలా గ్రహించగలరు.

మానసౌకా వ్యాఖ్యా:

క్వ అనేది విపరీత దర్శిని అయిన ఓ ప్రశ్నార్థకం... ఎక్కడ..?
యోగముద్రాది మార్గం ఎక్కడ! యోగాసనాలు ఎక్కడ...
ఇక్కడ యోగముద్రాది మార్గము శ్రేష్ఠము అని అభిప్రాయము. ఇది అన్తర్ముఖతను ఇస్తుంది. శామ్భవీముద్ర, ఖేచరీముద్ర యోగముద్ర, మూలబన్ధ ముద్ర, అశ్వనీముద్ర (మూలబన్ధముద్రకు ఉపముద్ర), ఉడ్డియానముద్ర, తాలముద్ర ఇత్యాదులు. ఇవి కుణ్డలినీశక్తిని శీఘ్రముగా సహస్రారమును చేర్చి తీవ్రమైన ధ్యానసమాధ్యనుభవాల ద్వారా ఆధ్యాత్మికోన్నతికి ఉపకరించును. కేవల యోగాసనములు శరీరదార&ఢ్యమునకు తద్ద్వారా బాహ్యప్రయోజనాల కొరకే. కేవల యోగాసనాలకు నీరోగశతాయుష్యమే ఫలము.

క్వ గోమాయుపోతః నక్కకూ నాగానికీ పోలికా...అని మనకు ఓ జనవాక్యం ఉంది. అదే ఇక్కడ స్మరించేరు. **గోమాయువు** అంటే నక్క. **పోతః** అంటే పది సంవత్సరాల వయస్సులో ఉన్న కలభము. అంటే ఏనుగు గున్న.
ఏనుగు జ్ఞానమునకు, స్థిరత్వానికి, విశాలమైన చెవులు సున్నితమైన విషయ గ్రహణమునకు, బలమునకు సాత్వికతకు విశ్వాసానికి సఙ్కేతము.
నక్క వ్యాకులతకు, భయానికి, చఞ్చలత్వానికి, అసత్యవాదమునకు సఙ్కేతము.

నక్కవంటి నేనెక్కడ... ఏనుగువంటి నీవెక్కడ. అంటే ఇక్కడ శాన్తము ఉగ్రతా రెండూ ఆమె స్వరూపాలని చెప్తున్నారు.

క్వ కాలా క్వ అనలః కాలా అంటే నల్లని రంగుగల నేనెక్కడ, జాజ్జ్వల్యమానమైన నీవెక్కడ. అంటే అమ్మా! నాది అజ్ఞానాన్ధకారం. నీవు జ్ఞానాగ్ని స్వరూపము. దేవీ జగదంబా! సృష్టి ప్రళయాత్మకమైన ఇటువంటి నీయొక్క సృష్ట్యారంభ సమయ లీలను నావంటివారు సామాన్యులు ఏవిధంగా గ్రహించగలరు. ఇక్కడ ఇంకో రహస్యం ఉంది.

క్వ యోగాసనం యోగముద్రాది నీతిః ఇది యోగమార్గాన్ని అన్తర్ముఖ సాధనల్ని సూచిస్తుంది. ఇది శాన్తమైన నియమితమైన, నియంత్రితమైన సాధనప్రక్రియ. యోగముద్రలు ప్రాణాయామ ధ్యాన సమాధులను జీవబ్రహ్మైక్య సాధనకు మార్గముగా సూచించేరు.

క్వ గోమాయుపోతః క్వ కాలానలశ్చ

గోమాయుపోతః అంటే శ్మశానము. అందు విహరించేది. ఇది కాళికా, చణ్డభైరవీ లీలకు సజ్కేతము. **కాలానలః** కాలాగ్నితో సర్వాన్ని భస్మీకరించే ఉగ్రతత్త్వం. ఇది చణ్డకాళీ (చణ్డ భైరవి) ఉగ్రశక్తి రూపం. ఇక్కడ శ్మశానమును మరియు సర్వోపాధులను భక్షించే కాలాగ్నిస్వరూపమును దర్శింపచేస్తూ, ఇది తీవ్రవైరాగ్యోదయ తత్త్వముగా చెప్తున్నారు.

ఈ రెండూ యోగసాధనా (ఇది షట్సమ్పత్తి. ఇవి శమ దమ ఉపరతి తితీక్ష శ్రద్ధ సమాధానం. అంటే దశేన్ద్రియ సహితముగా నియన్త్రించబడిన మనస్సు), ఉగ్రశక్తి (ఇహాముత్ర ఫలభోగవిరాగము, నిత్యానిత్య వస్తువిచారము ముముక్షుత్వము) ఒకే దేవీతత్త్వంలో కలిసి ఉన్నాయి. ఇది అద్వైత తత్త్వము. శాన్తమైన యోగమార్గము మరియు ఉగ్రతతో కూడిన విరాగుల మార్గము. అంటే ఘోరాఘోర సంప్రదాయాల రెండింటి సమన్వయరూపంగా ఉంది.

జగన్మాతరీదృక్ తవాపూర్వలీలా ఇంత విరుద్ధ స్వరూపాలను కలిగివుండే నీ దివ్యతత్త్వం నిజంగా నీ పూర్వలీలలో భాగమేనా ఇది అన్వేషణాత్మకం, విచారణాత్మకం.

ఇది లీలావాదము. ఆ పరాశక్తి సృష్టిలో సంహారములో మరియు స్థితి (మోహం)

లో పడుగు పేకలా ఉన్నదని చెప్పబడుతోంది.

కథంకారమస్మద్విధై ర్దేవిగమ్యా ఇక్కడ అన్వేషణా తీవ్రతను చెప్తున్నారు. మావంటి స్వల్పబుద్ధులైన భౌతికతలో చిక్కుకున్నవారమైన మేము నిన్ను ఏలా గ్రహించ గలము. అంటే ఇది సాధనపట్ల ఓ విరక్తి కాదు. అసమర్థత నిస్సహాయత పట్ల వినయాన్ని సూచిస్తుంది. ఇట్టి విచారణ దాసభావానికి భక్తియోగానికి తత్క్షణ జ్ఞానలభ్యతకు వేదికగా ఉంటుంది. యోగముద్రలతో అంటే విచారణాత్మకమైన ధ్యానము, ధ్యానఫలరూపమైన సమాధి వీటితో నీవు అనుభవమునకు వచ్చుదానవు. దీనికి మార్గము మాత్రము తీవ్రవైరాగ్యకారక మైన నీ ఉగ్రలీలల ద్వారానే వస్తుంది. ఆ పరమశక్తియొక్క విభిన్నతను, విరుద్ధతను గ్రహించి ధ్యానించినప్పుడే వినయభావముతో స్మరింపబడినప్పుడే పరమానన్దమయమైన సహజ సమాధిస్థితికి మార్గము సుగమము అవుతుంది.

చణ్డకాళీ పరదేవతయొక్క విభిన్నతల సమన్వయము

ఆమె యోగిని – ఆమె చణ్డభైరవి; ఆమె కల్యాణి శ్రీ – ఆమె కాలరాత్రి

ఆమె ఉగ్రమూర్తి – ఆమె అన్తర్ముఖసమార్ధ్యా

ఉపాసకుడు సమత్వమును అన్తర్ముఖతను అలవరుచుకుంటేనే పరమాత్మయే అయిన కాళీ రహస్యము అనుభవమునకు వస్తుంది.

విశుద్ధా పరా చిన్మయీ స్వప్రకాశా
ఉ మృతానన్దరూపా జగద్వ్యాపికా।
తవేదృగ్విధాయా నిరాకారమూర్తే
కిమస్మాభిరన్తర్హృది ధ్యాయితవ్యమ్॥ ౧౮

భావము– ఓ పరాశక్తి! నీవు విశుద్ధస్వరూపినివి, సర్వోత్కృష్ట తత్త్వానివి. నిరంతర చైతన్యరూపమైన శుద్ధప్రకాశానివి. స్వయంప్రకాశమానమైన స్వరూపానివి, అమృతస్వరూపిణివి, ఆనన్దరూపిణివి. నీవు జగత్తు అంతటా వ్యాపించి ఉన్న సూత్రాత్మవు. ఈ రీతిగా నీవు నిరాకార స్వరూపిణివి అయితే మేము ఇంకదేన్ని ధ్యానించాలి.

మానసౌకా వ్యాఖ్యా:

విశుద్ధా పరా చిన్మయీ త్రిపుటి రహిత చైతన్యతత్త్వము. ఇక్కడ **విశుద్ధా** అంటే మనోమయ విజ్ఞానమయ ప్రాణమయ స్థూలతత్త్వాలన్నింటినీ అధిగమించిన దశ. ద్వైతభావము అంటే ఇతర సంబంధము కొంచెముకూడా లేనిది. తనయందు ఎటువంటి సంకల్పములు వాసనలు లేనిది. గుణత్రయం యొక్క ఉద్రేకము లేనిది. అంటే **అవ్యక్త మేతత్త్రిగుణైః నిరుక్తం తత్** గుణత్రయ సంఘాతమే మాయ (అవ్యక్తం). మాయను అధీనములో ఉంచుకున్నది. దీనినే ఉపరతిగా చెప్పేరు. మన్త్రశాస్త్రములో లలితామ్బ సదాశివుని పై కూర్చొన్న స్వరూపము ఇదే. గుణత్రయ శాన్తావస్థయే ఉపరతి. దీనిని **పరమాశాన్తిః** అని శఙ్కరులు వివేకచూడామణిలో చెప్పేరు. ఆత్యన్తిక శాన్తావస్థయే ఉపరతి. ఇదే పరమాత్మ నిష్ఠ. అంటే పరమాత్మతో నిత్యసమ్బన్ధియై ఉండుట. ఈ తత్త్వమును ప్రకృతి అనుకుంటే పురుషునితో నిత్యసమ్బన్ధియై ఉంటుంది. ఈ తత్త్వము పురుషుడు అనుకుంటే ప్రకృతితో నిత్యసమ్బన్ధియై ఉంటుంది. అంటే నిత్యము ప్రకృతిపురుషాత్మకముగానే ఉంటుంది. అన్తఃకరణమే లేనిది. కారణభూత మలిన సంస్కారములు, కార్యభూత మలిన వృత్తులుగాని ఉండుటకు అవకాశము లేనిది. వృత్తులే కారణముగాగల జన్మపరంపరలు లేనిది. కల్పిత

పదార్థ గుణమెప్పుడూ కల్పితమే. కాలమునందలి సుముహూర్త దుర్ముహూర్త రాహుకాల యమగణ్డాది కల్పనలు మొదలు కలాకాష్ఠాది మహాయుగాన్తమైన కాలవిభాగమే కల్పితము. ఇటువంటి కాలవిభాగ రూపమైన మలినములు లేనిదని చెప్పుటచే, స్థలవిభాగముకూడా లేనిదై తన మహిమలోనే ఉందునదిగా ఉన్నది.

పరా సర్వోత్కృష్టమైనది. ఇది పరావాక్ స్థితిని సూచిస్తుంది. భావనకు మించిన ధ్వని. అకారాది క్షకారాన్త సర్వామ్నాయ వాగ్వైఖరికి అధిష్ఠాన స్వరూపము. జ్ఞానానన్దమయమైన అత్యున్నత తత్త్వము. పదవాక్యరూపమైన శబ్దమునకు పూర్వరూపమైన వర్ణమే అర్థసృష్టి హేతువు అని తాన్త్రికుల భావన. పఞ్చాత్మక జగద్విస్తృతికి కారణమైన ఓంకారోపాసనను వేదము అంగీకరించడం చూస్తే, వైదిక ఉపాసనా వ్యవస్థకు, తాన్త్రిక ఉపాసనావ్యవస్థకు మధ్య ప్రాథమికంగా ఏ భేదములు లేవని చెప్పచు. బ్రహ్మముయొక్క స్వరూపమే **ఓం** అను ఏకాక్షరమని వేదము ప్రమాణీకరించింది. దీనిని ఆధారం చేసుకుని బీజాక్షర ఉపాసనా విస్తృతిని తన్త్రములు వ్యాప్తిచేసి, దేవత మన్త్రస్వరూపమే అని సిద్ధాంతీకరించేరు.

ఈ కుణ్డలినీ రూప పరదేవత 'ధామపఞ్చక'మైన సఙ్కేతగృహములను (కణ్ఠ నాభి హృద్ వక్త్ర భ్రూమధ్యములు) దాటి సహస్రారమును చేరుతుంది. ఈ కుణ్డలినీ ప్రథమస్పన్దన పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీ రూపముల పరిణామ మొందుచూ ఉచ్ఛ్వాస నిశ్వాస రూపమున గమనాగమనాదుల వాగ్వ్యాపారాన్ని వాదవాయురూపమున నిర్వహిస్తున్న క్రియాశక్తి.

ప్రాణాయామము ద్వారా ఈ కుణ్డలిని సహస్రారము చేరి అనాఖ్యాస్థితిలో నిత్యమై పరమశివ ఐక్యమును పొందుతుంది. ఈ స్థితిలో ఈ స్వరూపమునకు పేరు లేదు. అందుకే అనాక్యా. ఈమెయే ఘోరచణ్డకాళీ అన్తస్ఫూర్తి రూపము. అమృతప్రదాయిని. ఈ సర్వోత్కృష్ట అనాఖ్యారూప పరాస్వరూపమే సంవిద్రూప పరాశక్తి.

చిన్మయీ... అంటే శుద్ధచైతన్యమే స్వరూపముగా కలిగి ఉన్నది. ఇది సాక్షిగా ఉన్న నిత్య చైతన్యము. ఇది జ్ఞేయస్వరూపము. సహస్రకమల కర్ణియందు

ఆవిర్భవించినది. ప్రకాశ విమర్శాత్మకమైన జ్ఞానస్వరూపిణి. సంవిద్బిన్దువు.

అపానే జుహ్వతి ప్రాణం ప్రణేఽపానం తథాపరే।
ప్రాణాపాన గతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః॥
అపరే నియతాహారాః ప్రాణాన్ప్రాణేషు జుహ్వతి।
సర్వేఽప్యేతో యజ్ఞవిదో యజ్ఞ క్షపితకల్మషాః॥

ఇటువంటి యోగరూపమైన యజ్ఞముద్వారా పాపములను నాశనము ఒనరించుకొనువారలు. ప్రాణాయామాది రూపమైన యోగమను యజ్ఞమును చేయు దేవతలు. అంటే **కర్మజాన్విద్ధితా స్సర్వానేవం జ్ఞాత్వావిమోక్ష్యసే॥** అని మనస్సు ఇన్ద్రియములయొక్క క్రియాకలాపముల ద్వారా జరుగువానినిగా గ్రహించమన్నారు. వీరే దేవతలు. ఇట్టి దేవతలచే జరుపబడుచున్న యజ్ఞము. ఈవిధంముగా తెలుసుకున్నవాడు బన్ధములనుండి విముక్తుడు అగుచున్నాడు. ఇట్టి యజ్ఞశిష్టామృతమును సేవించువారలు సనాతన పరబ్రహ్మను అనాఖ్యా రూప చణ్డకాళిని పొందుచున్నారు. శ్రేష్ఠమగు జ్ఞానముయొక్క కుణ్డము నుండి ఆవిర్భవించిన జ్ఞేయరూపమైన యజ్ఞశిష్టామృత స్వరూపము అని లలితా సహస్రనామములయందూ చెప్పబడింది.

స్వప్రకాశా తాను ప్రకాశించుటకు బాహ్యదీప్తి అవసరం లేనిది. ఇది తనకు తానే ప్రకాశించు జ్ఞానతత్త్వము. ఆధేయరూప ఖణ్డకాల సత్తావ్యవహార ప్రకాశమునకు హేతువైన, అధిష్ఠాన సత్తారూప అఖణ్డకాలము. అఖణ్డకాలము నందే కలాకాష్ఠాదిరూప సర్వవ్యవధానములు వ్యవహితములు. కలాకాష్ఠాది రూప వ్యవధాన వ్యవహితములను ప్రకాశింపజేయు సర్వాధిష్ఠాన అఖణ్డకాల రూప అనాఖ్యా చైతన్యము.

అవచ్ఛేదకత అవచ్ఛేద్యత లేని అఖణ్డకాల చైతన్యము సర్వకాలసర్వావస్థలలో భాసించును. ఆభాసము అంటే ఇతర సహాయమున ప్రకాశించు తిథినిత్యల నుండి ఇతర కాళీస్వరూపముల మిథ్యాదర్శనము. అఖణ్డకాల చైతన్యముయొక్క స్వప్రకాశమున **'సాక్షి'**యందు భాసించును.

క్రమ సంప్రదాయానుగుణముగా పరబ్రహ్మానుభవము అనేది దశలవారీగా సాగుతుంది. ప్రతిదశ ఒక నిర్దిష్ట శక్తి (శక్తితత్త్వం)తో అనుసంధానించబడి

12 ప్రధాన రూపాలతో ప్రకాశిస్తోంది.

ఈ గుహ్యకాళీ **ప్రమేయము** (గ్రహించబడే వస్తువు); **ప్రమాణం** (జ్ఞాన సాధనము); **ప్రమాతృ** ((గ్రహించేవాడు) అను త్రివిధ భేదములను తనలో కలుపుకున్న చతుర్థశక్తి. ఈ నాలుగు భేదములు సృష్టి స్థితి సంహార భేదమున త్రిగుణితములై పన్నెండు స్వరూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఈ సమష్టి అయిదు రకాల శక్తులను ప్రతిబింబిస్తాయి. సృష్టి (సృష్టికారిశక్తి); స్థితి (పోషణశక్తి); సంహార శక్తి (విలయం); అనాఖ్యా (వర్ణనాతీత స్థితి).

ప్రతిభా / చితి / స్వాతంత్ర్య శక్తి (అనుభూతి, స్ఫురణ) కాళీతత్త్వము ఈ నాలుగు స్థితుల మధ్యకేంద్రముగా అనాఖ్యాశక్తికి సమానంగా భావింపబడు తుంది.

I ప్రమేయము (జ్ఞేయము)

1. సృష్టికాళీ – పరసంవిత్‌లో జ్ఞేయవస్తువుయొక్క సృష్టి. (సృష్టి సృష్టి)
2. రక్తకాళీ – జ్ఞేయవస్తువుయొక్క స్థితి. ఇది ప్రతిబిమ్బ రూపమున సజీవముగా ఉంటుంది. (సృష్టి స్థితి)
3. స్థితినాశకాళీ – వస్తువుయొక్క అంతిమ నాశనము (సృష్టి సంహారము)
4. యమకాళీ – జ్ఞేయవస్తువునుండి పూర్తిగా పరిచ్ఛేదము అనాఖ్యాస్థితి. సృష్టి తురీయము)

II **ప్రమాణము** (జ్ఞానసాధనము)

5. సంహారకాళీ – అది నీవే అన్న అనుభూతి. (స్థితి సృష్టి)
6. మృత్యుకాళీ – మూలస్థితికి వెళ్ళడం (స్థితి స్థితి)
7. రుద్రకాళీ – అనుభవాలను స్మృతిపథంలో సంస్కరించడం ద్వారా ఉన్నతమైన జ్ఞానాన్ని పొందటం (స్థితి సంహారము)
8. మార్తాండకాళీ – దశేన్ద్రియాలు, మనస్సుబుద్ధి అన్నీ అహంకారముతో కలిసిపోతాయి. ఇది అనాఖ్యాశక్తి ప్రతీక (స్థితి తురీయము)

III ప్రమాతృ (జ్ఞాత)

9. పరమార్కకాళీ – యథార్థమైన నేను ద్వారా తెలియవచ్చు సృష్టికారిశక్తి. (సంహార సృష్టి)

10. మహాకాలకాళీ – నేనే సమస్తము అనే అనుభూతి. తదుపరి ఇది మాత్రమే ఉంది అను అనుభూతి. చివరకు ఏమీలేదు అనే స్థితి (సంహార సంహారము)

12. మహాభైరవ ఘోరచణ్డకాళీ – సంహార తురీయము. మహాభైరవ చణ్డోగ్ర ఘోరకాళీ అ స్థితి పరిమితమైన (జ్ఞాత) సంబంధములో **అనాఖ్యా** అనే పరమ స్థితిని సూచిస్తుంది.

అనాఖ్యా అంటే వాచికముగా వివరించలేని స్థితి. ఇది పరసంవిత్ లేదా పరమచైతన్య స్వరూపము. ఏ వర్ణనకు అందని శబ్దాతీతమైన స్థితి. అందుకే దీన్ని **అనాఖ్యా** అంటారు. ఇది అకులస్థితి. అంటే లౌకిక ప్రమేయ, ప్రమాణ ప్రమాత త్రయం లీనమైపోయే స్తితి. ఈ స్థితిలో జ్ఞేయమైన వస్తువు (ప్రముయం), దానికి సంబంధించిన జ్ఞానమార్గము (ప్రమాణం), మరియు జ్ఞానాన్ని పొందే వ్యక్తి (ప్రమాతా) ఇవన్నీ పరిపూర్ణంగా **"అహం"** భావములో లీనమైపోతాయి. ఈ స్థితిని **పరా** అంటారు. ఎందుకంటే ఇంతకుముందు చెప్పిన అన్ని స్థితులు ఈ స్థితినుండే ఉద్భవిస్తాయి.

ఈ కాళీతత్త్వమును నాథ సంద్రాయములో **నిజశక్తి** గా పేర్కొంటారు. ఇది అపార, నిర్వచనాతీత శక్తి.

(పురుషుడు) పరమాత్మ–జీవాత్మ మధ్యనున్న సంబంధాలన్నింటినీ అధిగమించిన శక్తి. జీవుని పరిపూర్ణంగా పరిచయం చేసే శక్తి. నాథులు దీనిని **ఆదేశం** అంటారు. అంటే జీవాత్మ పరమాత్మ సమన్వయ స్తితి. ఈ శక్తి ద్వారానే యోగి జీవితంలో మోక్షాన్ని పొందగలడు.

ఈ అఖణ్డకాల చైతన్యమే భాసము భానము జ్ఞానము అనే సంజ్ఞలచే చెప్పబడుతోంది. ఈ ప్రకాశము చేతనే మిగిలినవి ప్రకాశింపబడుచూ, తాను ప్రకాశించుటకు ఇతర ప్రకాశ ఆవశ్యకత లేనిది అగుటచే **స్వప్రకాశా** అని చెప్పబడుచున్నది.

అమృతానన్దరూపా శివశక్తి మేళన స్వరూపము. ఈ ఆనందము భోగానందము కాదు. ఇది తురీయానందము. శుద్ధస్వరూపానందము. ఇది మోక్షమయమైన శక్తి. అమృతత్త్వము అనేది ఇక్కడ కాలబంధానికీ అతీతమైన తత్త్వముగా

చెప్పబడింది.

జగద్వ్యాపికా అంటే ఈ స్వరూపము అస్తిత్వములోని ప్రతి దానికీ మూలశక్తి. ఇది అనుభూతికి మాత్రమే సాక్షాత్కరించబడే తత్త్వము. ఈ భావన తాన్త్రిక సూత్రములు, ఉపనిషత్తుల మధ్య సూత్రాధారమైన బోధ. మూలాధార సహస్రార పర్యన్త ఆన్తర జగత్ప్రకాశము. అంటే ఇది కాళీ (కాలీ) శబ్దప్రతిపాద్య తత్త్వార్థరూప బ్రహ్మయొక్క పరిణామమో వివర్తమో అయిన ప్రపఞ్చమూల పదార్థరూపమైన అచ్చులు హల్లులు అను ద్వివిధ వర్ణములు. పదవాక్యరూప శబ్దానికన్నా సూక్ష్మమైన వర్ణరూప శబ్దమే అర్థసృష్టి హేతువు. అంటే ఈ వర్ణములే పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీ భేదములచే ప్రపఞ్చావిర్భావ హేతువు అగుచున్నది. ఈ జగత్తు **అహం** స్వరూపాభిన్నమైనది. అంటే ఆత్మకంటే భిన్నముకానిది. వర్ణాది 'అ'కారము వర్ణాన్త 'హ'కారము (ల–ళ యో రభేదః కనుక) ప్రత్యాహార రూపంగా **అహం** ఆవిర్భవించింది. జగద్వ్యవహారమంతా దీనిలోనే చేరుతుంది. ఈ సమస్త ప్రపఞ్చము ఆత్మాభిన్నమైన అహమర్థమే. ఈ అనుభవాన్ని తన్త్రములు **అహంత** అన్నాయి. స్వయంప్రకాశమైన ఆత్మ బ్రహ్మ అని, ఆయన స్వానుభవరూప అహంత **విమర్శ** అని చెప్పేయి. ఈ జగద్వ్యాపినియైన విమర్శయే కాళీ అహంత హృదయం స్పన్దము శక్తి ఇచ్ఛా క్రియ అనాఖ్యా ఇత్యాది అభిజ్ఞలతో బహుధా విస్తరించి దర్శింపబడుతోంది.

తవేదృగ్విధాయా నిరాకార మూర్తే నిరాకారత్వానికి అకారణమైన రూప నిరూపణ. ఇది తత్త్వప్రవేశంలో అత్యన్త ముఖ్యమైన పదబన్ధము. ఇక్కడ పరాశక్తి స్వయంగా అనాఖ్యా అనగా అనిర్వచనీయమైన తత్త్వముగా సాక్షాత్కరించింది. అర్థాత్ తాను నిరాకారమైనప్పటికీ ఆత్మజ్ఞానముకు ఉపాయముగా ఏదో ఒక రూపమును స్వీకరించునది. ఈ విధంగా స్వరూపాన్ని చూపే ప్రయత్నం. ఇదే సదాశివ తత్త్వం.

కామస్మాభిరన్తర్హృది ధ్యాయితవ్యం ఇది ప్రశ్నించుట కాదు. జ్ఞానుల స్థితి. ఇది పరిపూర్ణత. జ్ఞానములో ఉద్భవించే భావన. ఇంతటి పరిపూర్ణమైన అన్తర్యామి స్వరూపిణిని, స్వప్రకాశమైన దానిని మేము ఇం&ఏమని ధ్యానించాలి. ఈ ప్రశ్నలో ధ్యానావేశమూ ఉంది. ప్రేమపూర్వక పరిపూర్ణ సమర్పణ భావమూ

ఉంది. ఇది భేదభావము లేకపోవడం ద్వారా జనించే శివశక్తి ఐక్యభావన. పరాశక్తి అనేది రూపంకాదు. కానీ కల్పింపబడిన రూపముల ఆలంబనగా మానవుడు చేరగల బ్రాహ్మీస్థితి. ఆనన్దావస్థ. ఆమె రూపాన్ని వర్ణించడం ధ్యానము చేయడంద్వారా, క్రమముగా రూపరహిత ధ్యానావస్థను పొందుతారు. జ్ఞానముయొక్క ఆత్యన్తిక దశలో ధ్యానముకూడా మిగలదు. ఆత్మానుభవమే మిగులుతుంది.

తురీయస్థితిలో నిర్విశేష చిదాకాశంలో అనుభూతి ద్వారా పరాశక్తిని గ్రహించే మార్గాన్ని సూచిస్తుంది. ఇది తాన్త్రిక సాధనకు పరాకాష్ఠ. ఇదే ఆధ్యాత్మిక సాధనకు రహస్యపథం. రూపానికి రూరాహిత్యానికి మధ్యగల పరమమైత్రి. సమానత్వబోధన. ఇది కాళీక్రమ దర్శనము.

మహాఘోర కాలానల జ్వాలజాలా
హితా త్యక్తవాసా మహాట్టాట్టహాసా।
జటాభార కాలా మహాముణ్డమాలా
విశాలా త్వమీదృక్ మయా ధ్యేయసేఽమ్బ॥ ౨౦

భావము- ఓ అమ్బా..! ప్రళయకాలంలో కలిగే మహాఘోరమైన కాలాగ్ని జ్వాలలచేత ఆవృతమై ఉన్న నీవు అహితా - వైరాగ్యమునకు ఆత్మజ్ఞాన ప్రయోజనమునకు, ఉపరతికి ఇన్ద్రియ నైశ్చల్య ప్రతిష్ఠకు, స్వానన్దానుభవానికి ఘాతకలిగించు శత్రువులకు సకల దృశ్యదాహరూప సతత ప్రజ్వలనాత్మక మహోజ్జ్వల జ్వాలజాల (నిప్పులవల అంటే అగ్నివలయం) ముగా ప్రకాశించుచున్న, వస్త్రము విడిచినదానవైన, మహాప్రళయపు గర&ఝునలా ఉక్కిరిబిక్కిరి చేసే అట్టహాసముతో కూడి నవ్వుతున్న దానవై, గొప్పశిరోమాలతో కూడి విశేషముగా శోభిల్లుతున్న ఇటువంటి నిన్ను నేను ధ్యానము చేయగలనా..!

మానసౌకా వ్యాఖ్యా:

ఈ శ్లోకము త్రిక శాక్త తన్త్ర సిద్ధాన్తాన్ని ప్రతిబింబించే విధంగా మహాఘోర చణ్డకాళీ యొక్క రూపాన్ని దివ్యంగా వర్ణిస్తోంది. **మహాఘోర కాలానల జ్వాలజాలాహితా** ప్రళయకాలంలో కలిగే మహాఘోరమైన కాలాగ్నిజ్వాలలచేత ఆవృతమై ఉన్న నీవు అహితా వైరాగ్యమునకు, ఆత్మజ్ఞాన ప్రయోజనమునకు, ఉపరతికి ఇన్ద్రియ నైశ్చల్యప్రతిష్ఠకు, స్వానన్దానుభవానికి ఘాతకలిగించు శత్రువులకు సకల దృశ్యదాహరూప సతత ప్రజ్వలనాత్మక మహోజ్జ్వల జ్వాలజాల (నిప్పులవల అంటే అగ్నివలయం) ముగా ప్రకాశించుచున్న,

మహాఘోర అంటే ఉగ్రత్వరూప గుణమువలన సర్వమును అతిక్రమించి మిక్కుటముగా సర్వానుగ్రహకత్వముతో, సర్వసంహరణ స్వరూపముతో ప్రకాశించుచున్నందున మహాఘోర కాలగ్ని, ఈ కాలాగ్నినే **లీఢభాను శశిమణ్డలా స్థితి ర్లమ్బితా ప్రళయవహ్నినా త్వయా** అని కాళిదాసు కీర్తించేరు. వ్యావహారిక త్రిపుటీమణ్డలమును ఆత్మలో ప్రవిలాపన మొనరించి తురీయ చిదగ్నిరూప

మున భానుశశి మణ్డలములను గ్రసించునట్టి (బాహ్యాభ్యన్తర విషయముల అన్నింటినీ మ్రింగు ప్రలయవహ్ని) స్వరూపము. ఇది ప్రళయానికి అంటే సాంసారిక జగత్తు నశించి కేవలానన్దమై యుండుటను సూచిస్తుంది.

కాలాగ్ని అనగా కాలమే స్వరూపమైన అగ్ని. ఇది భౌతిక అగ్నియందు (ఈ సర్వభక్షకుడైన వాడుకూడా కాలాగ్నియందు శాన్తావస్థను పొందుతాడు), స్మృతి యందు, వయోరూపముగా, ఉపాధులయందు ప్రబలమైన రాగద్వేషాల రూపంగా, తంద్ర, ఉపేక్ష ఇత్యాదుల గర్భమందు ఉంటుంది. వాటివలన బహిర్గతమైన అహఙ్కార మమకారములచే ఉపాధులను వాటితో సహా దహించునది.

జ్వాలజాల (అగ్నివలయము) అంటే ఇన్ద్రియాల బాహ్య తర్జనభర్జనలను ఉలిక్కిపడేలా అనుభూతి ప్రపఞ్చాన్ని భస్మంచేస్తూ ఉండే శక్తి. ఈ శక్తి **సవితా** అని చెప్పబడుతోంది. **సవితా ప్రసవితా దీప్తో దీపయన్దీప్యమానః। జ్వలఞ్జ్వలితా తపన్వితపన్సన్తర్వ రోచనో రోచమానః। శోభనః శోభమానః కల్యాణః। తస్మాదుచ్యతే జ్వలన్తమితి॥** సూర్యాన్తవర్తియై వర్తులాకారముగా భాసించు పరమేశ్వరియే **సవితా**. ఈమెను **భానుమణ్డలమధ్యస్థా భైరవీ** అని వశిన్యాదులు కీర్తించేరు. ఈ భగవతి **ప్రసవితా** జగత్తుయొక్క సర్వకర్మానుష్ఠానములో సాక్షిగా అఙ్గీకరింపబడి ఉంది. అందుచేతనే సవితృ ఉపాసనానన్తరమే ఇతర ఉపాసనలు విధింపబడ్డాయి. కాలముకూడా సర్వకర్మానుష్ఠానములో సాక్షియై ఉన్నది కావున, కాల సంకీర్తనానన్తరమే కర్మారమ్భమును చేయుచున్నారు. ఇది అన్తఃకరణ శుద్ధిని ఇస్తుంది. ఫలితంగా అన్తఃకరణ చతుష్టయము (మనస్సు బుద్ధి చిత్త అహంకారములు) లయించి పోయి నిర్బీజసమాధి స్థితి కలుగుతుంది.

హిత–అహిత అంటే లౌకిక నియమాలు, సంస్కార నిబద్ధతలు. వాటిని అధిగమించిన స్థితి. శౌచాశౌచములు. విధి నియమములకు అతీతమైన స్థితి అత్యాశ్రమి (ఆనన్దావస్థ) వ్యవస్థ. **అహిత** ఈ ఆనన్దావస్థకు ఘాతకలిగించు నామరూపాత్మకమైన దృశ్యప్రపఞ్చము. దీనికి భయకారకమైనది. సకల దృశ్యదాహ రూపమైన స్వయంప్రకాశమాన భైరవి.

ఇది **తురీయ** స్థితిని సూచిస్తుంది. వాసనా రహిత , మాయారహిత చైతన్యస్థితి.

త్యక్తవాసా వస్త్రమును విడిచిన స్థితి. అంటే కోశములకు ఆవలిదైన స్వరూపము. అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ కోశములకు ఆవలిది. ఉన్మత్తానన్దావస్థ. ఆవరణము అంటే అవిద్య (అజ్ఞానము) యొక్క రెండు రూపాలు.

మొదటిది **అసత్తాపాదక ఆవరణము** ఇది అవిద్యయొక్క ఒక రూపము. దీని ప్రకారము బ్రహ్మము అనగా సత్యమైనది వేరుగా ఉందని భావిస్తాము. మరొక విధంగా బ్రహ్మము లేదని లేదా అసత్యమని భావించే అజ్ఞానము.

రెండవది **అభాసాపాదక ఆవరణము**. దీని ప్రకారము బ్రహ్మము గురించి తెలుసుకోవడం అసాధ్యమని, దానిని మనం తెలుసుకోలేమని భావింస్తాము. అనగా బ్రహ్మము ఉన్నాడని తెలిసినా దానిని అనుభవించడంలో విఫలమవడం. ఈ ఆవరణలు లేనిది. ఈ కోశములకు ఆవరణములకు అతీతమైన స్థితి **నగ్నత్వము**నకు సూచన.

మహాట్టాట్టహాసా కాళీయొక్క అట్టహాసము అనగా ప్రపఞ్చబన్ధాలపై చెప్పుకోతగినంత విరక్తి. భయానకంగా అనిపించే నవ్వు అనేది **మత్తస్థితి** ని సూచిస్తుంది. తరతమ, తనపర భేదము తెలియని ఉన్మత్తానన్దావస్థ. అట్ట అంటే **అపమూర్ధ కళేబరః** తలలేని కళేబరము. **మహత్** శబ్దప్రయోగము ఈ స్వరూపము మరియు అట్టహాసము పూజనీయమని చెప్తున్నారు. తన తలనే నరుక్కున్న స్వరూపానికి (ఛిన్నమస్త) తన పర భేదాలు ఉంటాయా..!

సర్వకర్మోపరతి రూపముగా దృశ్యప్రపఞ్చాన్ని దహించి సర్వబన్ధములనుండి నిర్దయగా లాగివేసి కేవలుడిగా నిలిపి శాశ్వతానన్దాన్ని ఇచ్చునది. అద్వైతానుభూతి ప్రాపకము. సాధకుడు జగత్తుయొక్క అసత్యతను గుర్తించి హసిస్తాడు. ఇది తుర్యాతీతస్థితి.

ఆ నవ్వు అనేది మాయపై విజయము. అభేదజ్ఞానమున దృఢత.

జటాభారకాలా నల్లని దట్టమైన జటాభారముచే ప్రకాశించుచున్నది. జటలు అనేవి గంగ ఉధృతిని శాన్తింప చేసిన శివతత్త్వముగా గౌరవింపబడతాయి. **జటాభారం** అంటే ప్రబలమైన చిత్తశుద్ధిని అహఙ్కారనాశనానికి కోరికలు లేని, మమకార రహిత పూర్ణవైరాగ్య చిహ్నము. ఇది శివ-శక్తి ఏకత్వస్థితికి

సంకేతము.

మహామ్ముణ్డమాలా అంటే ఇది చిత్తగత వాసనల నాశనం. ప్రతీ ముండం ఒక బన్ధనానికి సూచిక. ముణ్డమాల ధరించడం అనగా జ్ఞానమార్గమున ఒకో బన్ధాన్ని సమూలంగా నాశనం చేయడాన్ని సూచిస్తుంది. ఇది వాసనాక్షయం. జ్ఞానవైరాగ్య ఫలం.

విశాలా త్వమీదృక్ మయా ధ్యేయసేఽమ్బ విశాలమైన ఇటువంటి నిన్ను ఎలా ధ్యానించగలను..! విశాల అంటే అన్నిటా వ్యాపించినది. ఇది విశ్వవ్యాప్తి నుద్దేశిస్తుంది. ఇది పరాశక్తి.

నేను అంటే పరిమితులుగలది అని. పరిమితులుగల తత్త్వము లేదా భావన; ఎలా ఒక అపరిమిత శక్తిని ధ్యానించగలదు. నేను నిన్ను ధ్యానించగలనా తల్లీ అని శరణాగతి చేసి అవధులు లేని ఆ అనన్త చైతన్యం లోకి శాశ్వతానన్దంలోకి తీసుకోమని ప్రార్థన.

ధ్యానం అనేది స్వ-అహఙ్కార రహితంగా పరమాత్మలో లీనమైన స్థితిలో మాత్రమే సాధ్యం అవుతుంది. ఈ శ్లోకం ఉగ్రరూపిణి అయిన గుహ్యకాళీ పరాశక్తిని ధ్యానించేందుకు సిద్ధమైన సాధకుని లోని సంశయాన్ని, భయాన్ని ప్రతిబింబిస్తుంది. కానీ అదే సమయంలో అమె రూపం తానొక తత్త్వరూపిణి అని, ఈ భయఙ్కారాకృతి మాత్రం, భౌతికచైతన్యానికి మాత్రమే భయం కలిగించేది. తత్త్వజ్ఞుడు ఆమెను మాయాతీత స్థితిగా ధ్యానించగలడు.

భయంకరత భయపెటడానికి కాదు. సర్వవిధ సాంసారిక భయాలనుండి విముక్తుని చేయడానికి. నగ్నత్వం సహజత్వానికి, పరమసత్యానికి; అట్టహాసము తామసానికి కాదు. తిరోధానమునకు (మాయ తొలగింపు).

తపో నైవ కుర్వన్ వపుః ఖేదయామి
వ్రజన్నాపి తీర్థం పదే ఖఞ్జయామి।
పరన్నాపి వేదం జనిం పావయామి
త్వదఙ్ఘ్రిద్వయే మఙ్గలం సాధయామి॥ ౨౧

భావము– తపస్సులు చేసి శరీరాన్ని ఏడిపించడం లేదు. పాదములు చిట్లిపోయేలా ప్రయాణాలు (తీర్థయాత్రలు) చేయడం లేదు. జన్మను పవిత్రీకరించుకునుటకు వేదమును కూడా పఠించడం లేదు. నీ రెండు పాదములయందే మఙ్గళములను శ్రేయస్సును పొందుతున్నాను.

మానసౌకా వ్యాఖ్యా:

నేను తీర్థయాత్రలు వేదపఠనము వంటి సాధనలు ఏవీ లేకుండానే సర్వశ్రేయస్సులను పొందుతున్నాను. పరదేవతా పాదయుగళ ధ్యానమే పరమ మఙ్గళమని చెప్తున్నాడు. సర్వార్థ సాధకమైన పరదేవతా పాదయుగళ ధ్యానాన్ని, కేవల ధ్యానాన్ని విధించేరు. ఇదే తన సాధనా రహస్యమని ఉపదేశిస్తున్నారు.

ఇదే సర్వోత్కృష్టమైన వేదధర్మముగా భగవానుడు శ్రీమద్భాగవతములో చెప్పేడు. అన్యమెరుగని సర్వోత్కృష్టమైన ఆనన్దానుభవాన్ని పొందే విషయంలో ప్రాథమికంగా త్రిక తాన్త్రిక వైదిక మార్గములు ఏకవాక్యతను కలిగి ఉన్నాయి. ప్రాపంచిక సుఖభోగాభిలాషలను భ్రమింప చేయడంలో ఈ మార్గములు తమ వికృతిని పతాకస్థాయిలో ప్రదర్శించేయి.

తపో నైవ కుర్వన్ వపుః ఖేదయామి ప్రస్తుతం తపస్సులు చేసి శరీరాన్ని ఏడిపించడం లేదు, అంటున్నాడంటే...

బాహ్యాభ్యన్తర శౌచాన్ని ఇప్పటికే సాధించినవాడని. ఈ విషయం **కుర్వన్** అనే కృదన్తరూపం చెప్తోంది. వర్తమానంలో లేదు. గతంలో చేసేడు అని. శరీరం లఘువైంది. ఇన్ద్రియములు స్వాధీనంలో ఉన్నాయి. మనస్సు ప్రశాన్తతను పొందింది. సాలమ్బ నిరాలమ్బ ధ్యానావస్థలు అనుభవంలో ఉన్నవాడు. ఇదిగో ఇప్పుడు **తపో నైవ కుర్వన్ వపుః ఖేదయామి** అను నిర్ణయము.

ఇక్కడ శరీరమునకు క్లేశము లేని మార్గము ద్వారా శరీరాన్ని బాధించకుండా

శాశ్వతానన్దానుభవాన్ని పొందే మార్గం వ్యక్తీకరించారు. బాహ్యంగా ఉన్నదానిని లోనికి తెచ్చే క్రమంలో శారీరక మానసిక క్లేశము ఉంటుంది.

ఈ ఆనన్దానుభవము బాహ్యంగా లేదని చెప్పడానికి తల్లిదండ్రుల దగ్గరనుండి బ్రహ్మవేత్తల వరకు తపిస్తూనే ఉన్నారు. రతి అంటే ఆనందము. కేవలం ఆనందము. గృహస్థు ఆనన్దము బయట ఉందనుకుంటే వేశ్యాలోలుడై బహుక్లేశాలను అనుభవిస్తూ ఉంటాడు. ఆనన్దము బాహ్యవస్తువు కాదని చెప్పటానికే భార్యాభర్తల శృఙ్గారాన్ని నాలుగు గోడలమధ్యకు చేర్చారు. లోపల ఉన్నదాన్ని బయటపెట్టడంలోనూ క్లేశము ఉంది. తనదైన ఆనన్దానుభవాన్ని (శృంగారాన్ని) ప్రదర్శనకు పెట్టకూడదు. పెడితే అది బహుక్లేశకారి.

బ్రహ్మానుభవరూప శాశ్వతానన్దమునకు బాహ్యప్రయత్నము అవసరం లేదని, అది లోపలే ఉందని చెప్పడానికే మన సనాతన వివాహవ్యవస్థ. ఈ ఆనన్దము ఎవరిది అంటే ప్రకృతీపురుషు లిద్దరిదీ. ఇది అర్థనారీశ్వరం అవిభాజ్య స్వరూపము. భర్త దక్షిణభాగం అయితే, భార్య వామభాగమని చెప్పడములో విశేషము ఇదే. ఊర్వశీపురూరవ సంవాదములో, ఊర్వశి శృంగారాన్ని ఆనన్ద (బ్రహ్మ) స్వరూప దర్శనముగా చెప్పింది. ఇది మనం దేవాలయానికి వెళ్ళి బాహ్యమైన శిల్పసౌన్దర్యమును నిర్మాణ చాతుర్యాన్ని దాటి, నారసింహ రామ కృష్ణాది రూపాలనో, లింగ యంత్రాది చిహ్నములనో చూసి భగవదనుభూతిని పొందడం వంటిది. ప్రతీకవాదము (symbolism) అని చెప్పొచ్చు.

వ్రజన్నాపి తీర్థం పదే ఖఞ్జయామి పాదాలు చిట్లిపోయేలా తీర్థ క్షేత్ర సందర్శన రూపమైన తిరుగుడు లేదు.

ఇవి ఎందుకు తిరుగుతాం... అంటే

చిత్తశుద్ధి కొరకు... వైరాగ్యోదయము కొరకు.

మనలో చాలామంది కాశీ వెళ్ళి ఉంటాము.

కాశీకి వెళ్ళిన వాడూ... కాటికి వెళ్ళిన వాడూ ఒక్కటే (సమానం) అనే జనవాక్యము ఉంది. శ్మశానమునకు పోయినవాడు (పోయినవాడితో పోయినవాడు అని, తీసుకుపోబడినవాడని కాదు)ఆ వాతావరణములో జీవితముయొక్క అస్థిరత అనుభవములోకి వచ్చి వైరాగ్యము పొందుతాడు.

ఇదే విధంగా కాశీ దర్శనమూను. శ్మశానం ఊళ్ళోనే ఉంది కనుక ఇంటికి తిరిగి వచ్చి కాలమహిమ వలన మరిచిపోతాడు. ఎందుకంటే తనదైన ఇంట్లో రోజూ చావులు ఉండవు కదా...

కాశీదర్శనము అలాకాదు. దూర ప్రయాణము. అన్త్యేష్టి సంబరాల కోలాహలం సూర్యోదయం నుండి అస్తమయ పర్యన్తము జరుగుతూనే ఉంటాయి. తొమ్మిది రోజుల లేదా తొమ్మిది నెలల కాశీవాసములో వీడికి జీవితం నీటిబుడగ పాటికాదను అనుభవము స్థిరమై సద్యఃస్పన్దన రూపముగా తీవ్రవైరాగ్యము వస్తుంది. ఇదే కాళీ కరాళనృత్యము. ఆ స్వరూపము సర్వబన్ధ విచ్ఛేదిని. శ్మశానం అంటే ఊళ్ళోనే ఉంది, కనుక తిరిగి వచ్చే సందర్భములో శరీరానికి అంత శ్రమలేదు.

కాశీ దూర ప్రాంతం. తాను వైరాగ్యముతో ఉన్నాడు. తిరిగి వెనక్కి వెళ్ళడములో క్లేశమును, రెప్పపాటు జీవితమును విచారించుకొని ఆ అనుభవాన్ని స్థిరం చేసుకుని బన్ధాలను త్రెంచుకుంటూ అక్కడే ఉండిపోతాడు. ఇక తిరగనవసరం లేనివిధంగా అనుగ్రహించగల గురువు లభిస్తారేమోననే... అన్వేషణా ఉంటుంది. తాను బ్రహ్మమే అయిన పరదేవతా పాదలయందే నిష్ఠగలవాడై ఉంటాడు.

పరన్నాపి వేదం జనిం పావయామి జన్మను పవిత్రీకరించుకునుటకు వేదముకూడా పఠించడం లేదు. వేదము మన్త్రాత్మకము అగుటచే మన్త్రోపాసనలు చెయ్యటం లేదని. వేదపఠనపాఠనాదుల వలన జనించిన అర్థజ్ఞానరూప క్రతు కర్మానుష్ఠానములేవీ లేనివాడై సర్వకర్మత్యాగము చేసి **సోఽహం** భావనతో పరదేవతా పాదయుగళ ధ్యానాన్ని, కేవల ధ్యానాన్ని చేస్తున్నాడు. సర్వకర్మోపరతి రూపంగా శాన్తించిన ఇన్ద్రియములుగలవాడై జన్మరాహిత్యాన్ని పొందుతున్నాడు. ఇది పరాభక్తి మార్గము. సర్వకాల సర్వావస్థలలోను పరదేవతా పదయుగళ చింతన వేదధర్మమని భగవద్వచనము.

త్వదఙ్ఘ్రిద్వయే మఙ్గలం సాధయామి అఙ్ఘ్రిద్వయం అంటే పాదయుగళము. అఘి-గతౌ అని రూపము. దీనిచేత పోవుదురు కనుక **అంఘ్రి**. వీటిని ఆశ్రయించిన వారు పోతారు. ఎక్కడికి పోతారు... సర్వకర్మపరిత్యాగము చేసి **సోఽహం** భావరూపంగా జన్మరాహిత్యరూప సర్వశ్రేయోదాయక

అనన్దరూప బ్రహ్మానుభవము లోనికి పోతున్నారు. ఈ పాదయుగళము సర్వకర్మ త్యాగము చేసిన పరమహంసలకు కూడా... **మరాలీనాం యానాభ్యసనకలనా మూలగురవే** ఆదిగురువు అని చెప్పేరు. ఇది సహస్రార కమలకర్ణికోపరి స్థానముగా, ప్రకాశ విమర్శాత్మక స్వరూపముగా తన్త్రములు చెప్తున్నాయి. వీటి భావన జన్మరాహిత్యమే అనుటకు ప్రత్యక్షోదాహరణము మూకశఙ్కరులు. పరదేవతా చరణయుగళమును ధ్యానించి పరమహంస పరివ్రాజకులై జగద్గురువులై సర్వజ్ఞపీఠమును అధిష్ఠించి మూకపఞ్చశతిని అనుగ్రహించిన వారు. సకల శ్రేయోదాయకమై జన్మపరంపరలనుండి బయటపడవేయు **అనాఖ్యారూప పరదేవతా పాదయుగళము.**

రజస్సంసర్గేఽపి స్థితి మరజసా మేవ హృదయే

పరం రక్తత్వేన స్థితిమపి విరక్తైక శరణమ్॥ రజోగుణ సంబంధములేని వారికి, హృదయమాలిన్యము లేనివారికి, విరక్తులకు మాత్రమే ఆశ్రయమై ఉన్నది. **సద్వృత్త రుచిరైః శుద్ధైః ముక్తాశ్రితం** సత్త్వగుణవిశిష్టులైన వారిచేత, ముక్తులైన వరిచేత ఆశ్రయింపబడుచున్న అనాఖ్యాకాళీ పాదయుగళమునందే సర్వశ్రేష్ఠ మైన మఙ్గళములను పొందుతున్నాను.

పరాభక్తిమార్గములో పరదేవతా పాదయుగళ ధ్యానరూపముగా **సోఽహం** భావ ధ్యానమునే చెప్పేరు. ఇది కర్మ (తపస్సు), ఉపాసన (తీర్థయాత్ర), జ్ఞాన (వేదపఠన) ములను అన్నింటినీ అధిగమించిన సర్వోత్కృష్ట **సోఽహం** రూప పరాభక్తి.

ఇక్కడ తత్త్వజ్ఞుని ధ్యాన వ్యవస్థ వ్యక్తం చేయబడుతోంది. సకల సాధన మార్గము లను విడిచి కేవలం **సోఽహం** భావముతో అనాఖ్యా రూప పరదేవతా పాదయుగళ ధ్యానమునే పరమగమ్యముగా, జన్మరాహిత్య రూప సర్వశ్రేయో సాధనముగా చెప్పేరు. ఇది నిష్కామభక్తికి, జీవుని ఆనన్దస్వరూపునిగా ఆవిష్కరించు అమృతపథము.

తిరస్కుర్వతోఽన్యామరోపాసనాం వై
పరిత్యక్త ధర్మాధ్వరస్యాస్య జన్తోః।
త్వదారాధనే న్యస్తచిత్తస్య కిం మే
కరిష్యన్తమీ ధర్మరాజస్య దూతాః॥ ౨౨

భావము- నిశ్చయముగా ఇతర దేవతోపాసనలను తిరస్కరించిన, ధర్మాచరణములను క్రతురూప కర్మాచరణను పరిత్యజించిన నన్ను, నీ ఆరాధనలో ఉంచబడిన చిత్తముగల ఈ జీవుని యమధర్మరాజు యొక్క భటులు ఏమి చేయగలరు.

మానసౌకా వ్యాఖ్యా:

తిరస్కుర్వతోఽన్యామరోపాసనాం ఇతర దేవతోపాసనలను తిరస్కరించిన వాడు. భగవంతుడికి నిర్దిష్టమైన నామరూపములు కల్పించి ఆరాధించుట. ఇది ఉపాయభూతముగా ఉపయోగపడినప్పటికీ, చివరికి అది భగవన్నిష్ఠ లేదా పరమైక్య సాధనకు **సోఽహం** భావనకు దారి చూపాలి. ఈ జీవుడు ఈ ఆరోపిత నామ రూపాత్మక ఉపాసనలను తిరస్కరిస్తున్నానని ప్రకటిస్తున్నాడు. **న దేశ నియమస్తస్మిన్ న కాల నియమస్తథా** (పద్మపురాణం) భగవద్భక్తికి సమయాసమయములు తీర్థక్షేత్రముల ఆవశ్యకత లేదని స్పష్టంగా చెప్తోంది. భగవంతునియెడ అనన్యభక్తిలో, ఇవన్నీ విడనాడబడతాయి. కేవలము హృదయంలోని పరాప్రేమతో మాత్రమే చూస్తాడు.

పరిత్యక్త ధర్మాధ్వరస్య నిజంగా, నిశ్చయంగా పూర్తిగా విడిచిపెట్టిన ధర్మ కర్మానుష్ఠానములు...

ధర్మానుష్ఠానము అంటే కృచ్ఛ్రచాన్ద్రాయణాది రూప వ్రతాది అనుష్ఠానములు, నోములు, వివిధ సంస్కారాదులు. అధ్వరమంటే దర్శపూర్ణమాసాదుల మొదలు సోమయాగ పర్యన్తమైన సమస్త క్రతుకర్మానుష్ఠానము. వీటిని నిశ్చయముగా వదిలివేసిన నన్ను...

వేదము నానావిధ దేవతా ఉపాసనా మార్గములను, వివిధ కామ్యములకైన యజ్ఞయాగాదులను చెప్పింది. మరి ఇవన్నీ...

బహ్వ్యస్తేషాం ప్రకృతయో రజస్సత్త్వతమో భువః।
యాభిర్భూతాని భిద్యన్తే భూతానాం మతయస్తథా।
యథా ప్రకృతి సర్వేషాం చిత్రవాచస్స్రవన్తిహి॥ అని భగవానుదు చెప్పేడు.
ప్రళయకాలంలో నష్టమైన వేదమును సృష్ట్యాదిలో బ్రహ్మకు ఇచ్చేడు. బ్రహ్మ తన సంతానమైన స్వాయంభువ మనువుకు చెప్పేడు. మనువు ఆయన సంతానమైన భృగువు మెదలైన వారికి కిన్నర నాగ రాక్షసాదులకు చెప్పేరు. వీరు గుణత్రయ సంఘాత జన్యమైన స్వభావములు కలిగినవారు. గుణత్రయ సంఘాతజన్యమైన వారి బుద్ధులు అనేక రకాలుగా ఉంటాయి. వారివారి స్వభావజన్యమైన బుద్ధిని అనుసరించి వేదమును వ్యాఖ్యానించుకుంటూ వెళ్ళేరు.

గుణత్రయ సంఘాతజన్యమైన స్వభావము **మాయా**. గుణత్రయ సమష్టియే **మాయా** అని శాస్త్రం చెప్తోంది. మాయవలన పుట్టినది మాయాలక్షణమే కలిగి ఉంటుంది. మాయా స్వభావజన్యమైన బుద్ధి. ఆ బుద్ధికి తగినట్లుగా ఆవిర్భవించిన వేదార్థరూపమైన క్రతురూప కర్మానుష్ఠానము **మాయ**యే అగుచున్నది. మరి సత్యము ఏమిటి అంటే...

కాలేన నష్టా ప్రతయే వాణీయం వేద సంజ్ఞితా।
మయాఽదౌ బ్రహ్మణే ప్రోక్తా ధర్మోయస్యాం మదాత్మకః॥
నాయందు చిత్తమును లగ్నము చేయడమే వేదధర్మము. ఇదే సత్యము. ఈ విషయమును సాక్షాత్తు భగవానుదు ఉద్ధవునకు చెప్పేడు.

కనుకనే సత్యం పరం ధీమహి అని శ్రీవ్యాసభగవానుదు సత్యమునందే మనస్సు నిలిపేరు.

ధర్మాధ్వర పరిత్యాగమంటే నిష్కామ కర్మానుష్ఠాన స్థితి. ధర్మాధ్వరములు అంటే యజ్ఞములు, నిత్యనైమిత్తిక కర్మలు; ఇత్యాదులన్నీ విడిచిపెట్టిన వాడిగా పేర్కొన్నాడు. ఇది సర్వకర్మ త్యాగము చేసిన స్థితి. కానీ ఇది నాస్తికత్వం కాదు. ఇది **సోఽహం** భావరూప భక్తి.

కనుక **త్వదారాధనే** నీ ఆరాధనలో **న్యస్త చాత్తస్య** ఉంచబడిన చాత్తముగల **అస్యజన్తోః** అ జీవుని **అమీ ధర్మరాజస్య దూతాః** ఈ యమదూతలు ఏమి

చేయగలరు.

ఇది సర్వకర్మ త్యాగము చేసిన, ఆత్మానుభూతి పొందిన వాని గంభీరమైన ప్రకటన. ఆత్మజ్ఞాని లేదా పరాభక్తి గల జీవుని స్థితి.

నేను ఇతర ఆరోపిత నామరూపాత్మక ఉపాసనలను తిరస్కరించాను. ధర్మశాస్త్ర ములలో చెప్పిన యజ్ఞయాగాది క్రియలను పూర్తిగా విడిచిపెట్టేను. నా చిత్తాన్ని నీ ఆరాధనలో స్థిరపరుచుకున్నాను. ఇప్పుడు నన్ను యమదూతలు ఏమి చేయగలరు. ఇది **ఈశ్వరప్రణిధానాద్వా** ఈశ్వరునిపై సంపూర్ణ విశ్వాసంతో చిత్తాన్ని అర్పించడం వల్ల పొందిన అనుభూతి. **అబన్ధోర్పణస్య ముఖమ్** ఇది సర్వార్పణ భావంతో భగవంతుని సమీపించడం వలన సర్వబన్ధములు తెగిపడి **సోఽహం** భావమును పొందుతాడు.

యమదూతలు యాంత్రిక ధర్మపాలకులు. వీరు కేవలం కర్మఫల నిర్వాహకులు. ఒకవేళ జీవుడు కర్మమార్గమును పూర్తిగా దాటి, ఈశ్వరార్పణ బుద్ధితో శుద్ధ చిత్తంతో భగవన్నిష్ఠను సంపాదిస్తే అతను యమపథంనుండి మినహాయింపు పొందుతాడని చెప్తున్నారు. దీర్ఘాయువు కలిగిన కాళీసిద్ధులను మనం చరిత్రలో చూసాం. ఇది భక్తుని అహంకార ప్రదర్శన కాదు. శుద్ధభక్తి సిద్ధాంతపు మణిపూస. శుద్ధభక్తి అన్నది ధర్మ కర్మోపాసనలకన్న శ్రేష్ఠము. ఈశ్వరార్పిత చిత్తమున్నవాడు ముక్తుడే. ధర్మాధర్మ భావనకూడా బన్ధమే అని సిద్ధాంతీకరిస్తున్నాడు.

శుద్ధభక్తి – అనన్యభక్తి అంటే కేవలం పరమేశ్వరుని మీదే మనస్సును స్థిరపరచడం. అలాంటివాడికి యమపథం లేదు. ఈశ్వరునితో అభేద భావన **సోఽహం** భావననుపొందిన జీవునిపట్ల ధర్మనియమాలకూ, యమదూతలకూ అధికారము ఉండదు. భక్తియోగమునకు మూలసూత్రము ఇదే అని డిండిమాన్ని మ్రోగించి మరీ చెప్తున్నారు.

నమస్యే హరిం నైవ ధాతారమీశం
న వహ్నిం న చార్కం న చేన్ద్రాది దేవాన్।
శివోదీరితానేక వాక్యప్రబన్ధై
స్త్వదర్చావిధిం కేవలం కిన్తుమన్యే॥ ౨౩

భావము– నేను విష్ణువు ధాతా ఈశ్వరుడు అగ్ని సూర్యుడు ఇన్ద్రాది దేవతలను ఎవరినీ సూజించను. శివునిచేత చెప్పబడిన వాక్యసముదాయముల ద్వారా నీ ఆరాధనను కేవలముగా భావిస్తాను.

మానసౌకా వ్యాఖ్యా:

నమస్యే హరిం నైవ ధాతారమీశం ఇది నిర్వికల్ప సమాధియందున్న యోగియొక్క అవస్థ. హరి ధాతా ఈశ్వరుడు ఈ మూర్తిత్రయమునకు నమస్కరించను అంటున్నారు. **నమస్త్యైక్యం ప్రవదేత్** అని శ్రుతి నమస్కారం అంటే ఐక్యానుసన్ధానము అని చెప్తోంది. సర్వసాక్షి అయిన హంసస్వరూపుడను నేనే అని అనుసంధానము చేయుటయే నమస్కారము. శ్రుతిమాత చెప్పిన సర్వోత్కృష్టమైన పూజావిధానం **సోఽహం భావేన పూజయేత్** ఇదే.
ఈ స్థితిలో ఉన్న యోగి గుణాతీతుడు. వాసనారహితుడు. మరి పూర్వోక్తమైన మూర్తిత్రయము త్రిగుణాలలోని వారు.
బ్రహ్మ విష్ణు రుద్రా శ్చోత్పత్తి స్థితిలయ కర్తారః। రాజసో బ్రహ్మ సాత్వికో విష్ణుః తామసో రుద్రః ఇతి। ఏతే త్రయో గుణయుక్తాః। ఉత్పత్తి స్థితి నాశములకు కర్తలైన బ్రహ్మ విష్ణు రుద్రులు క్రమముగా రజోగుణ సత్త్వగుణ తమోగుణ విశిష్టులని యోగతత్త్వోపనిషత్తు చెప్తోంది. సమాధి స్థితిలో ఉన్న యోగి **సమాధి స్సమతావస్థా జీవాత్మ పరమాత్మనోః** జీవాత్మ పరమాత్మలయొక్క సమానావస్థ (ఐక్యము) పొందినవాడు. ఇందున్నవాడు గుణాతీతుడు, వాసనారహితుడు. ఇట్టి యోగి ప్రపంచం (సంసారం) లేనివాడు. ఈ యోగి గుణత్రయ విశిష్టులైన వారిని కూడితే తిరిగి సంసారం (జగత్తు) లో పడతాడు. జీవబ్రహ్మైక్యమును అనుభవిస్తున్న యోగి ఈ మూర్తిత్రయముచే నయస్కరింప తగినవాడు. ఇది

బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ఉపేక్ష చేయటం ఎంతమాత్రమూ కాదు. అసలు ఇటువంటి స్థితి ఉంటుందా అనిపిస్తుంది. దానికి సమాధానముగా **కుమార జననము**నకు పూర్వం సనత్కుమారుని సమీపించిన పార్వతీపరమేశ్వరుల స్థితి ఇదే.

నవహ్నిం నచార్కం నచేన్ద్రాది దేవాన్ నేను అగ్నికి నమస్కరించను అంటున్నాడు. పూర్వశ్లోకంలో జన్మను పవిత్రీకరించుకొనుటకు అంటే జన్మరాహిత్యానికి వేదముకూడా పఠించడం లేదని చెప్పేరు. అంటే దాని అర్థము వేదము జన్మ రాహిత్యమును ఇవ్వగల సామర్థ్యము లేనిదని. వేదము స్వర్గ సుఖాలకొరకు యజ్ఞయాగాది రూప కర్మానుష్ఠానమును చెయ్యమని ప్రోత్సహిస్తుంది. కర్మ ఒక్కనాటికీ మోక్షకారి కాదు.

నేను అగ్నికి నమస్కరించను అంటే వేదముయొక్క పూర్వార్థవ్యవహారమైన యజ్ఞయాగాది కర్మానుష్ఠానములు ఉపాసనలు విడిచినవాడు. **నచార్కః** అర్కః అంటే సూర్యుడు. ఉదయాస్తమయ రూపముగా కాల విభాగము చేయువాడు. కాలవిభాగరూపముగా సన్ధ్యావన్దనాది నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానమునకు అవకాశం కల్పించువాడు.

హృదాకాశే చిదాదిత్య స్సదా భాసతి భాసతి। నాస్తమేతి నచోదేతి కథం సన్ధ్యాముపాస్మహే॥ నా హృదయాకాశములో జ్ఞానసూర్యుడు సదా ప్రకాశిస్తూనే ఉన్నాడు. అస్తమించుట లేదు, ఉదయించుట లేదు. కాల విభాగమునకు అవకాశమే లేదు. నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానము ఏవిధంగా చెయ్యగలను. ఈ యోగి సదా బ్రహ్మానుభవమున ఉండుటచే కాలకృత్తు కనబడుటలేదు. కనుక ఉపచారాదులకు అవకాశమే లేదు.

నచేన్ద్రాది దేవాన్ భోగానుభవమునకై పుట్టినవారు. ఇన్ద్రియార్థములను అనుగ్రహించువారు. **బ్రహ్మాదేవానాం ప్రథమస్సంబభూవ ధాతా చ సృష్టౌ విష్ణుశ్చస్థితౌ రుద్రశ్చ నాశే భోగాయ చేన్ద్రః ప్రథమజా బభూవుః॥**

భోగానుభవమునకే ఇన్ద్రుడు మొదటగా పుట్టేడు. భోగములను మొదట అనుభవించునది మనస్సు. మనస్సు మొదట భోగమును అనుభవిస్తేనే, ఆ భోగానుభవజన్యమైన ఆనన్దమును ఇతర ఇన్ద్రియములు పొందుతాయి. తన

ఇన్ద్రియములు ఉపరమావస్థయందు ఉన్నాయి. కనుక ఇన్ద్రియములకు అధిష్ఠాన దేవతలైన మనస్సు – **చన్ద్రుడు**, బుద్ధి – **బృహస్పతి**, కన్ను – **సూర్యుడు**, చర్మం – **వాయువు**, చెవి – **దిక్కులు**, గుండె – **అగ్ని**, నాలుక – **వరుణుడు**, చేతులు – **ఇన్ద్రుడు**, పాదాలు – **విష్ణువు**. పాయువు – **మిత్రుడు**, శిశ్నం – **ప్రజాపతి**. అయా దేవతలు ప్రయోజన శూన్యంగా ఉనికి లేకుండా ఉన్నారు.

శివోదీరితానేక వాక్యప్రబన్ధైః ప్రబన్ధము అంటే కల్పిత రచన. శివుడు అంటే సర్వమంగళకరుడైన గురువు. గురువుచే చెప్పబడిన ప్రబన్ధ వాక్యసముదాయములు అంటే కల్పసూత్రములు. ఇవి మన్త్ర జప ఉపాసనా క్రతుకర్మాద్యష్ఠాన విధానమును చెప్పేవి. వీటి ద్వారానే కర్మానుష్ఠానపరులు జపహోమ అర్చనాదులను ఆచరిస్తూ ఉంటారు. ఇటువంటి గురూక్త విధానములో కల్పసూత్రాల ద్వారా నీ ఆరాధనను భావనచేస్తాను.

ఎందుకంటే శివుడే అయిన గురువు జ్ఞానస్వరూపుడు. ఆయన ఉపదేశించిన మార్గము ఇతర యాజ్ఞిక దేవతల స్థితిని విడిచి, కేవలం శివుడు (గురువు) ఆదేశించిన ఆత్మారాధన మార్గాన్ని అంగీకరించడం. ఇది అభేద బ్రహ్మజ్ఞాన మార్గము.

న వా మాం వినిన్దన్తు నిన్దన్తు నామ
త్యజన్త్వమ్బ వా జ్ఞాతయో మాం త్యజన్తు।
యమీయా భటా నారకే పాతయన్తు
త్వమేకా గతిర్మే త్వమేకా గతిర్మే॥ ౨౪

భావము– అమ్మా! నన్ను అపహాస్యము చెయ్యనివ్వు. నిందించనివ్వు. బంధువులు నన్ను విడిచిపెట్టనీ, యమభటులు నన్ను నరకములో పడవేయనీ నీవే నా తుది ౹ఆశయము.

మానసౌకా వ్యాఖ్యా:

న వా మాం వినిన్దన్తు నిన్దన్తు నామ ఇది బంధము ఎట్టిది, మోక్షము ఎట్టిది అని బాగుగా విచారించి స్థిర చిత్తుడైన ఓ యోగి, ఓ పరమహంస, ఓ భిక్షువు అయినవానియొక్క భావన.
నన్ను ఆక్షేపించనీ నిందించనీ... నీవే నా ఆధారం (ఆ౹శమస్థానము). అంటే **సోఽహం** భావనను (అభేద దర్శనాన్ని) విడిచిపెట్టను అని. **ధీరః తుల్యనిన్దాఽఽత్మసంస్తుతిః** సర్వాత్మభావనయందున్నవాడు, తనను స్తుతించినా అవమానించినా వికార రహితంగా ఉంటాడు. **ధీమాన్ నిన్దాచ ఆత్మసంస్తుతిః చ తుల్యే యస్య యతే సః** (భ.గీ.భాష్యం శఙ్కరులు) ఇతనికి కాషాయ దణ్డ కమణ్డలాలు ఉండచ్చు, లేకుండనూ వచ్చు. ఈ లక్షణము కలవాడు మా౹తం యతి పరమహంస.
న దణ్డం న కమణ్డలుం న శిఖాం న యజ్ఞోపవీతం నాచ్ఛాదనం చరతి పరమహంసః। న శీతం న చోష్ణం న సుఖం న దుఃఖం న మానావమానే ఇతి షడూర్మి వర్జితః। అని పరమహంసోపనిషత్తు అంటుంది.
దణ్డాత్మనస్తు సంయోగః సర్ధఐవ విధీయతే అని అత్యా౹శమి యతి దణ్డమును సర్వాదా ధరించాలని నియమము ఉంది. అసలు అదేదీ పట్టని స్థితీ ఉంది. దీనికి శాస్త్రంలో వివిదిషా అని, విద్వత్ అని సంజ్ఞలు ఉన్నాయి.
అసలు ఎందుకు ఆక్షేపిస్తారు... ఎందుకు నిందిస్తారు...
అదికదా... ఆలోచించాలి.

ఆచారవ్యవహారాలు మంటకలిపెస్తున్నాడు, దేవపూజా నమస్కారాదులు లేవు. ఇష్టం వచ్చినట్లు తిరుగుతాడు. శుచి శుభ్రతా లేదు. బట్టలుకూడా కట్టడు. మరి ఇవన్నీ ఆక్షేపణీయాలే. ఇటువంటి వారిని...

వీటినే అంటిపెట్టుకుని ఉండేవారు నిందిస్తారు కదా..!

అయినప్పటికీ యోగి పరమహంస భిక్షువు అయినవాని స్థితి ఇలాగే ఉంటుంది.

ఆశామ్బరో న నమస్కారో న స్వధాకారో న నిన్దా న స్తుతిర్యాదృచ్ఛికో భవేత్సభిక్షుః ఆశ అంటే దిక్కులు. ఇవే ఆచ్ఛాదన. కృత్రిమమైన ఆచ్ఛాదనలు లేనివాడు. **త్రికాలమేకకాలం వా పూజయేత్పురుషోత్తమా** సన్ధ్యావన్దన మన్త్రజపాదులు మూడుపూటలా చెయ్యి. కనీసపక్షం ఒకపూటైనా చెయ్యి. అని స్మృతులు విధించేయి. ఇక్కడ ఉన్నవాడు ఈ స్మృతివాక్యములు పట్టనివాడు. అంటే అగ్నిహోత్రాదులు యజ్ఞయాగాలు మన్త్రజపాంగ హోమాలు ఏమీ లేనివాడు. ఇవి లేకపోతే పోయాయి పితృకార్యాలైనా చేస్తాడా... అదీ లేదు. తాను అవసరాలకో ఇతరుల మెప్పుకో నిందా స్తుతులు చేయడం లేనివాడు.

యాదృచ్ఛికుడు అంటే మంచి చెడుల, సత్యాసత్యములు వంటివి లేకుండా ఒంటరిగా భిక్షువులలా సంచరించేవాడు.

అలా ఉన్నవారంతా (వేషగాళ్ళు) మహాత్ములు కారు. అలా ఉన్నాను అనే స్పృహ లేకుండా ఉన్నవాళ్ళు మహాత్ములు. చాలా సందర్భాలలో ఈ తేడా గుర్తించడం ప్రపంచానికి చాలా కష్టం. అటువంటి సందర్భాలలో నిందలకు గురి అయ్యే అవకాశం ఉంది.

ఒక త్రైలింగస్వామి, ఒక సదాశివబ్రహ్మేన్ద్రులు, ఒక కినారాంబాబా, ఒక రమణులు. వీరిని గురించి విన్నాం. వీరిది ఇటువంటి స్థితే.

పరమాత్మాత్మనోరేకత్వ జ్ఞానేన తయోర్భేద ఏవ విభగ్నస్సా సన్ధ్యా పరమాత్మకు తనకు భేదము లేదను జ్ఞానముచేత, వారిమధ్య భేదము భగ్నమగుటయే సన్ధ్యోపాసనము.

యథా మూఢో యతా మూర్ఖో యథా బధిర ఏవ వా వీరు లోకంలో ఇలాగే ఉంటారు. ఇది అత్యన్త ఉన్నతమైన భక్తి (పరాభక్తి) స్థితి. ఇక్కడ భక్తుడు తనపై చేసే అపహాస్యాలను, దుర్వాక్యాలను, ప్రజల విమర్శలను తను స్వీకరిస్తూనే,

వాటితో సంబంధము లేని వాడుగా ఉంటూ, తన సమాధిస్థితిని చెదరనివ్వడం లేదు. ఎందుకంటే తను సర్వాత్మభావనతో అనాఖ్యాతత్త్వముతో ఐక్యము అనే ఒకే లక్ష్యము పై నిలిచియున్నాడు. ఇటువంటి వానిని స్థితప్రజ్ఞుడు అని పేర్కొన్నాడు భగవానుడు. **తుల్యనిన్దా స్తుతిర్మౌనీ** నిందలోను స్తుతిలోను ఒకేలావుండువాడు. సమస్త బాహ్యవిసయములపై అవమాన సన్మానములపై విరక్తి, నిర్లిప్తత. **న వా మాం వినిందంతు నిందంతు నామ** అంటే ఈవిధంగానే ఉంటుంది.

త్యజన్త్వమ్బ వా జ్ఞాతయో మాం త్యజన్తు ఇటువంటి వ్యక్తిని ఎవరూ అంటి పెట్టుకుని ఉండరు. బాహ్యమైన ప్రయోజనమేదీ ఇతని (మతిస్థిమితం లేనివారి) వలన లేదు. పైసా ఉపయోగం లేదు. దమ్మిడి ఆదాయం లేదు. ఎందుకు పనికొస్తాడు. కన్న తల్లిదండ్రులు ఉన్నంత కాలం చూస్తారు (భరిస్తారు). వారు గతించిన తరువాత **జ్ఞాతయః** అంటే తనతో పుట్టినవారు, స్నేహితులు, బన్ధువులు సపిండులు... అందరూ విడిచి పెట్టేస్తారు.

వారు విడిచి పెడితే పెట్టనీ...వీడుమాత్రం నిరంతరం బ్రహ్మచిన్తనయందే లేదా పరదేవతా చరణారవిన్దములను ధ్యానము చేస్తూ బాహ్యస్పృహ లేకుండా ఉంటాడు.

ఓ జడభరతుడు, ఓ హస్తామలకుడు, ఓ వేతాళమహాత్మ, ఓ అవధూత నిత్యానంద (1897-1961), గణేష్‌పురి (మహారాష్ట్ర), శ్రీబాబాజీ మహరాజ్ (నాగబాబా) ఇలా ఎందరో...

ఏ పనీ చెయ్యలేదు, వాడిలో వాడు ఏదో ఆనన్దావస్థలో ఉంటాడు. కనీసం ఆకలి వేస్తోందని అడగడు. పిలిస్తే పలకడు. వీధి అరుగుమీద కూర్చుని వాడిలో వాడు ఏదో ఆనన్దిస్తూ ఉంటాడు. అంతలోనే లేచి ఎటో నడుచుకుంటూ వెళ్ళిపోతాడు. చీకటి వేళకు వెతుక్కుని తెచ్చుకుంటూ ఉండాలి. సమాజంలో ఇతని కుటుంబసభ్యులకు ఇది చిన్నతనంగా ఉంటుంది. అస్తమాను ఇలాగే జరుగుతుంటే ఓరోజు వెతకడం మానెస్తారు. వెతక్కపోతే ఇతనికి నష్టమేమీ లేదు. ఇతడు తెగిన గాలిపటంలా వెళ్ళిపోతాడేగాని తిరిగి రాడు. ఎందుకంటే ఈ బంధాలు అతనికి శాశ్వతమైనవి కావు. భక్తిలోతు పెరిగినప్పుడు బాహ్య బన్ధాలు ఊహారూపమైనవిగా మిథ్యగా మారిపోతాయి. బాహ్యవిషయాలు

దేనియందు అనురక్తి ఉండదు. దేహబంధాల పట్ల విరక్తితో ఉన్న తనకు జ్ఞాతుల నిరాకరణ, ప్రజల వెక్కిరింత రెండూ తోడుగా ఉంటాయి. స్థితప్రజ్ఞతగల భిక్షువు మాత్రము ప్రపఞ్చాన్ని లెక్కచేసే స్థితిలో ఉండదు. అందువలనే జ్ఞాతులు నన్ను విడిచిపెడితే పెట్టనీ అంటున్నాడు.

యమీయా భటా నారకే పాతయన్తు యమభటులు నరకంలో పడవేస్తే పడవెయ్యనీ… అసలు ఇటువంటి జీవన్ముక్తుని తీసుకువెళ్ళి నరకంలో ఎందుకు వేస్తారు…

ఇది అంత సులభంగా సమాధానపడే ప్రశ్నకాదు. నేనూ సమధానము చెప్పటంలేదు. కానీ… ఓ రెండు సంఘటనలను చెప్తాను.

పూర్వం కుమారస్వామి అవతరణమునకు మునుపు ఋషభ అనే పర్వతము పై ఒంటరిగా ఓ అయిదు సంవత్సరాల పిల్లవాడు చూడ ముచ్చటైనవాడు కూర్చొని ఉన్నాడు. తరచి చూస్తే పిల్లాడు ప్రపంచం పట్టనివాడుగా ఉన్నాడు. అందరి ఆర్తీ తీర్చే ఆదిదంపతులు లోకసంచారానికి బయలుదేరేరు. ఋషభ పర్వత సమీపానికి రాగనే ముచ్చట గొలిపే ఆ బాలుడు కనబడ్డాడు. వెళ్ళి ఆ బాలుడిని సమీపించేరు. ప్రపఞ్చము పట్టని ఆ బాలుడు అఖణ్డానందంలో మునిగి తెలుతూ లోకాలతల్లిని చూడనేలేదు. వారికి నమస్కరించలేదు, పలకరించలేదు. ఆదిదంపతులమైన తమకు ఉపచారాలు లేవు సరికదా… ఉపేక్షచేసాడని అలకపూని ఎద్దువుకమ్మని అదేశించింది. శివసఙ్కల్పముతో స్పృహలోకి వచ్చిన బాలుడు ఆనందంతో అమ్మను సమీపించేడు. తనను సమీపించిన ముద్దుమోముగల బాలుని చూసి పరవశించింది. అంతలోనే ఎద్దువు కమ్మన్న తన మాటను తలచుకొని బాధపడింది. బాధపడుతున్న శివానిని చూసి నువ్వు లోకాల తల్లివి కనుకనే ఇంత కరుణతో నన్ను ఎద్దుగా తిరగమని ఆదేశించావు. నువ్వు నాకు మహోపకారమే చేసావు అన్నాడు. ఇప్పుడు నాకు శౌచాశౌచాలు, ఆచ్ఛాదనార్థమైన వెతుకులాటలు లేవు. ఇంతకు మునుపుకంటే సుఖంగా ఉంటాను అన్నాడు. ఆ వైరాగ్యానికి, ఆ బ్రాహ్మీస్థితికి ఆశ్చర్యపోయింది. ఆనందం పట్టలేక "ఏదైనా వరము కోరుకో" అంది. ఆ పిల్లాడు అద్దంలాంటివాడు. ఆ బాలుడూ "ఏదైనా వరము కోరుకో" అన్నాడు.

ఆశ్చర్యపోవడం తల్లివంతు అయ్యింది. ప్రక్కనే నిలబడి చోద్యం చూస్తూన్న శివయ్య ఆలశ్యం చెయ్యలేదు. అమ్మని సమీపించి మనకు ఇంతకు మించిన శుభసమయం మళ్ళీరాదని చెప్పి, మాకు బిడ్డగా జన్మించమని... ఆ బాలుడిని కోరేడు. ఈ బాలుదు సనత్కుమారుడు. తరువాత షణ్ముఖునిగా అవతరించేడు. కథాభాగంలో కొద్ది భేదం ఉన్నా విషయం ఇదే...

ఇక రెండవది. **రాజ్యాన్తే నరకం ధృవం**. అని నియమము. పరిపాలకుదు తెలిసి చేసినా, తెలియక చేసినా; తన పరిపాలనవలన తొంభైశాతం జీవులు ఆనందించి, పదిశాతం దుఃఖం అనుభవించినా... ఆ పదిశాతం దుఃఖం అనుభవించుటకు కారణమైన పరిపాలనవలన పరేతనాథుని వద్దకు పోవలసినదే. పాలకుదు పరమ ధర్మాత్ముడు అయితే పరేతనాథుడే స్వయంగా వచ్చిదర్శనం ఇస్తాడు. నరక దర్శనమో, నరకాధిపతి దర్శనమో లేకుండా పాలకుడు బయటపడలేదు. రాముడి ధర్మనిష్ఠకు పరేతనాథుడే వచ్చాదు.

ఏతావాత తేలినది ఏమంటే మనం స్పృహలో ఉన్నా లేకున్నా తెలసీ తెలియక చేసిన చర్యల ఫలంగా దణ్డధరుని దర్శనము చేయవలసినదే. జ్ఞానులు ఈ విషయంగా చింతించరు. ఇది విధి నియమాలు, శౌచాశౌచాల వంటివి పట్టని అఖణ్డానన్దావస్థలో ఉన్న యోగి, సర్వసంగపరిత్యాగి, భిక్షువు అవధూత అయిన మహాపురుషుని స్థితి. ఈ బ్రహ్మైక్యానుసంధానమున సర్వకర్మఫలక్షయమగుటచే పుణ్యపాప ప్రసక్తి లేదు. అనుషంగికముగా ఏదైనా కర్మఫలానుభవము ఎదురైనా దానితో బంధింపబడకుండా రాగద్వేషాలు లేకుండా ఆ కర్మఫలమును అనుభవించి క్షయమొనర్చుకొనును. కర్మఫలరూపమైన స్వర్గనరకాదులయందు వ్యామోహము భయము లేనివాడు.

త్వమేకా గతిర్మే త్వమేకా గతిర్మే - నీవే నాకు ఏకైక మార్గము, ఆశ్రయస్థానము. పునరుక్తి ద్వారా తీవ్రతను స్థిరత్వాన్ని తెలియజేస్తుంది.

మహాకాల రుద్రోదితం స్తోత్రమేతత్
సదా భక్తి భావేన యోఽధేతి భక్తః।
న చాపన్న రోగో న శోకో న మృత్యు
ర్భవేత్ సిద్ధిరన్తే చ కైవల్య లాభః॥ ౨౫

భావము– మహాకాలుడి ద్వారా ఉద్భవించిన (ప్రకటితమైనదైన) రుద్రోదితమైన ఈ స్తోత్రమును ఎవరు చదువుతారో అట్టి భక్తునికి వ్యాధి దరిచేరదు. శోకము ఉండదు. మృత్యువుకూడా సమీపించదు. చివరికి పరమసిద్ధి కలుగుతుంది. కైవల్యమును పొందుతాడు.

మానసౌకా వ్యాఖ్యా:

మహాకాల రుద్రోదితం స్తోత్రమేతత్ ఈ స్తోత్రము మహాకాలుడు స్వయముగా ఉద్గారించినదిగా చెప్పబడుతోంది. ఇది సాధారణ భక్తి స్తోత్రం మాత్రమే కాదు, ఇది కాలాన్ని అధిగమించిన పరశివుని అనుగ్రహవాక్యముగా భావించాలి. **రుద్రోదితం** అంటే రుద్రుడు స్వయముగా ఉచ్చరించిన శబ్దతత్త్వం. ఈ శబ్దమే శక్తిస్వరూపము. ఈ స్తోత్రములోని ప్రతిపదము రుద్రతత్త్వాన్ని ప్రతిబింబించే వాగ్బ్రహ్మం (శబ్దబ్రహ్మ) స్వరూపంగా నిలుస్తుంది.

సదాభక్తి భావేన యోధ్యేతి భక్తః నిత్యము హృదయపూర్వక భక్తితో, యోగ తన్త్ర వేదాన్త మార్గాల్లో భక్తి అనేది **స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే** అని ఆచార్యశఙ్కరులు మోక్షసాధన సామగ్రిలో భక్తి ముఖ్యమైనదని చెప్పేరు. భక్తి అంటే మనస్సు పూర్తిగా దివ్యతలో లీనమవడం.
ఈవిధంగా పరానుభూతితో చేసిన ధ్యానము పరదేవతకు ఆత్మసమర్పణ.

న చాపన్న రోగో న శోకో న మృత్యు మృత్యుః అంటే శరీర పతనముకాదు. ఐక్యానుసన్ధానభంగము. ఈ స్తోత్రమును భావనచేయుటద్వారా జీవుడు అజ్ఞానాన్ని అధిగమించి, మృత్యురూప సంసారమునుండి విముక్తి పొందుతాడు.
ఇక్కడ **సిద్ధిః** అంటే కైవల్యలాభమే.
అంటే పరదేవతా సాయుజ్యమునే సూచిస్తుంది. కైవల్యము అఖణ్డ బోధస్వరూప

మైన పరబ్రహ్మలో లీనమై ఉండటం. ఇది ముక్తియొక్క అత్యుత్తమ స్థితి. ఇక్కడ పునర్జన్మ లేదు. ద్వంద్వం లేదు. అన్తర్గత మౌనములోని శాశ్వత పరమానన్ద స్థితి.

ఈ స్తోత్రము స్వయముగా రుద్రుడు ఉద్గారించిన పవిత్రమైన శబ్దబ్రహ్మము. దీన్ని శుద్ధచిత్తముతో ధ్యానించు వారికి శారీరక రోగాలు, మానసిక బాధలు, మరియు ఆధ్యాత్మిక మరణమనే సాంసారిక బంధనాలు ఉండవు. చివరకు వారు మనోలయ రూపమైన కైవల్యాన్ని పొందుతారు. అది పరమశివునితో ఏకత్వం.

ఇది సాధకుడు తన చైతన్యాన్ని అనాఖ్యా గుహ్యకాళీ తత్త్వముతో ఐక్యానుసన్ధాన మునకు చేసిన ఉపదేశము.



ఇతి తే కథితో దివ్యః సుధాధారాహ్వయః స్తవః।
ఏతస్య సతతాభ్యాసాత్ సిద్ధిః కరతలే స్థితా॥ ౨౮

మానసౌకా వ్యాఖ్యా:
శ్రీగుహ్యకాళీ సుధాధారా స్తవములో చివరి శ్లోకమైన ఇది ప్రసన్న గంభీరమైన భావము కలది.

ఇతి తే కథితో దివ్యః సుధాధారాహ్వయః స్తవః। ఓ సత్పాత్రా! నీకు ఈ గుహ్యమైన స్తోత్రాన్ని వివరించి చెప్పితిని. ఇదగో నీకు నేను చెప్పిన ఈ **సుధాధారా** అని ప్రసిద్ధి పొందిన దివ్యమైన స్తోత్రము సాధారణమైనది కాదు. దివ్యమైనది. స్వయంప్రకాశమానమైన ఆత్మజ్యోతిని వెలిగించే అమృత ప్రవాహము ఈ స్తోత్రము.

ఏతస్య సతతాభ్యాసాత్ సిద్ధిః కరతలే స్థితా దీని నిత్యాభ్యాసం వలన సాక్షాత్ **సిద్ధి** నీకు కరతలామలకము.
సిద్ధి అంటే... ఇక్కడ భూమిలోకి దిగబడిపోయి...ఆకాశంలోంచి ఊడిపడటం వంటివి కాదు.
ఈ స్తోత్రమును భావనచేయటం ద్వారా ఏ యోగి అయినా, సాధకుడైనా వారి స్వభావానికి (స్వభావం అంటే కర్త – కారణశరీరం) కావలసిన ఫలితాన్ని మోక్షపర్యన్తమైన దానిని తక్షణం పొందుతాడు. అవి ఎంత దూరంగా ఉన్నా.. అంటే అవి అఘటన ఘటనలైనా **కరతలే స్థితా** అంటే చేతిలో ఉన్నట్లే. ఈ స్తోత్రాన్ని సుధాధారాగా పేర్కొన్నారు. అంటే అమృతపు ప్రవాహంలా పరమ మాధుర్యభరితమైనదిగా ఉంది. దీనిని రోజువారీ పఠనము ద్వారా సాధకుడు తత్త్వసిద్ధిని జ్ఞానసిద్ధిని భైరవీ అనుగ్రహాన్ని పొందగలడు. ఇక్కడ **కథితః** అన్నపదం గుహ్యాన్ని బహిర్గతం చేయడాన్ని సూచిస్తుంది. **సుధాధారా** అన్నపదం శక్తి ప్రవాహాన్ని సూచిస్తుంది. **సతతాభ్యాసాత్** అనగా క్రమశిక్షణతో కూడిన అనుష్ఠానము వలన గుహ్య(రహస్య)కాళీ ఈ స్వరూపమే **అనాఖ్యా** ఈ అతి రహస్యమైన అవధులు లేని శక్తి ప్రవాహము.

సిద్ధిఃకరతలే స్థితా సిద్ధి అంటే ఏమిటో భగవత్పాదులు నిర్వచించారు. ఇక

ఇతరత్రా ఎక్కడైనా వెఱ్ఱి నిర్వచనాలుకనబడినా అవి సాధకుడిని వంచించుటకు వచ్చినవే కాని, ఉద్ధరించుటకు వచ్చినవి కావు.

సిద్ధిః కేవలం జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణమ్ అంటారు భగవత్పాదులు. **"స్వకర్మణా ఈశ్వరం సమభ్యర్చ్య తత్ప్రసాదజం కాయేన్ద్రియాణాం జ్ఞాననిష్ఠా యోగ్యతా లక్షణం సిద్ధిం ప్రప్తః"** స్వధర్మానుష్ఠానము ద్వారా ఈశ్వరుని బాగుగా ఆరాధించి, ఆ ఈశ్వరుని కృప వలన దేహేన్ద్రియములకు ఆత్మజ్ఞాన నిష్ఠకు తగిన యోగ్యతకలుగుటయే సిద్ధి.

ఈ సాధన (ధ్యానం) విధానము తప్పక ఫలితాన్ని ఇస్తుంది. అతి రహస్యమైన అవధులు లేని శక్తి ప్రవాహాన్ని ధరించగలిగే యోగ్యతను సాధకుడు కలిగి యుండాలి. అందుకు ఈ సుధాధారను ధరించాలి భరించాలి అంటే అనవరతము ధ్యానిస్తూ ఉండాలి.

ఇది కేవలం ఏదో కొన్ని శ్లోకాల సముదాయము దాని వ్యాఖ్యానము అని కాకుండా, ఒక ఉపదేశముగా గ్రహించి ఈ దివ్య స్తోత్రాన్ని నిత్యంగా పారాయణ చెయ్యండి; సిద్ధి మీకు అందుబాటులో ఉంటుంది.

॥ఇతి ఆదినాథ విరచితాయాం మహాకాల సంహితాయాం
శ్రీగుహ్యకాల్యాః సుధాధారాహ్వయః స్తవః సంపూర్ణః॥

ఆదినాథ విరచిత **శ్రీగుహ్యకాళీ సుధాధారా స్తవము** నకు **బోధానన్దనాథ** చేసిన **మానసౌకా** అను వివరణాత్మకమగు వ్యాఖ్యానము ముగిసినది.